GET THE LATEST UPDATES AND NEWS DIRECTLY THROUGH THE WHATSAPP
JOIN NOW
STAY UPDATED IN REAL-TIME WITH OUR WHATSAPP CHANNEL

GST NO: 36ACPPF9587L2ZM TELTEL/2013/53323

# సమయుజ్యోతి

ప్రతీ అక్షరం - ప్రజలకోసం
తెలుగు దిన పత్రిక
CELEBRATING 12TH YEAR ANNIVERSARY

సంపుటి : 12 సంచిక : 164 పేజీలు : 12 ఆదిలాబాద్ వెల రూ : 01 శనివారం 13 సెప్టెంబర్ 2025 ఎడిటర్ : ఫైసల్ ఖాన్



దివంగత షఫీఉల్లా ఖాన్
మాజీ మేనేజింగ్ ఎడిటర్



### ఆలయాలన్నింటినీ సందర్శించి విడివిడిగా ప్రాజెక్టు రిపోర్టులు

# సిద్ధం చేయాలి

దక్షిణ భారత కుంభమేళాగా గోదావరి పుష్కరాలు

- గోదావరి పుష్కరాలకు శాశ్వత ప్రాతిపదికన ఏర్పాట్లు
- తీరప్రాంత ఆలయాల అభివృద్ధికి తక్షణ చర్యలు
- పుష్కరాలపై సమీక్షించిన రేవంత్ రెడ్డి

**హైదరాబాద్,సెప్టెంబర్12(సమయజ్యోతి):**

గోదావరి పుష్కరాలను దక్షిణ భారత కుంభమేళాగా ఘనంగా నిర్వహించేందుకు ముందస్తు ఏర్పాట్లు-చేసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గోదావరి పుష్కరాలకు శాశ్వత ప్రాతిపదికన ఏర్పాట్లు- చేయాలన్నారు. అందుకు అవసరమైన ముందస్తు ప్రణాళికలు తయారు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. అలాగే, రాష్ట్రంలో గోదావరి తీరం వెంట ఉన్న ప్రధాన ఆలయాల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. దీంతో పాటు- పుష్కరాల ఏర్పాట్లు-, రాబోయే భక్తుల రద్దీని అంచనా వేసుకొని మౌలిక వసతులు కల్పించాలన్నారు. గోదావరి పుష్కరాల ఏర్పాట్లు-, ముందస్తు సన్నద్ధతపై శుక్రవారం కమాండ్ కంట్రోల్ సెంటర్లో సీఎం రేవంత్ రెడ్డి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎంతో పాటు-మంత్రి కొండా సురేఖ, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రి, ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి శ్రీనివాసరాజు, ధార్మిక సలహాదారు గోవింద హరి తదితరులు పాల్గొన్నారు.

# ఉపరాష్ట్రపతిగా రాధాకృష్ణన్ ప్రమాణం

- రాష్ట్రపతి భవన్‌లో ప్రమాణం చేయించిన ద్రౌపది ముర్ము
- హాజరైన ప్రధాని మోడీ, పలువురు ప్రముఖులు

**న్యూఢిల్లీ,సెప్టెంబర్12(సమయజ్యోతి):**

భారత నూతన ఉప రాష్ట్రపతిగా సీపీ రాధాకృష్ణన్ శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రమాణస్వీకారం చేశారు. రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆయనతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీతోపాటు-, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, నితిన్ గడ్కరీ, సుప్రీం చీఫ్ జస్టిస్ గవాయ్, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఏపీ డిప్యూటీ- సీఎం పవన్ కల్యాణ్ పాల్గొన్నారు. మాజీ రాష్ట్రపతులు, మాజీ ప్రధానులు, మాజీ ఉప రాష్ట్రపతులనూ ఈ కార్యక్రమానికి ఆహ్వానించారు. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ఉప రాష్ట్రపతులు జగదీప్ ధన్‌ఖడ్, వెంకయ్యనాయుడు, హమీద్ అన్సారీ తదితరులు కూడా హాజరయ్యారు.



### ఖనిజాల తవ్వకాల్లోనూ సింగరేణికి

# ప్రాధాన్యం ఇవ్వాలి

- సింగరేణికి కొత్త బ్లాక్‌లు దక్కడం లేదు
- గ్రీన్ ఎనర్జీ స్టోరేజ్‌లో భాగస్వామ్యం అవుతున్న సింగరేణి
- మీడియా సమావేశంలో డిప్యూటి సిఎం భట్టి



**హైదరాబాద్,సెప్టెంబర్12(సమయజ్యోతి):**

సింగరేణి సంస్థ కేవలం బొగ్గు గనులకే పరిమితం కాకుండా ఖనిజాల తవ్వకాల్లోనూ పాల్గొనాలని సింగరేణి బోర్డు నిర్ణయం తీసుకుందని డిప్యూటీ-సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. సింగరేణిలో బొగ్గు నిల్వలు తగ్గుతున్నాయని పేర్కొన్నారు. తద్వారా సింగరేణి సంస్థకు నష్టం జరుగుతుందని అన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం సచివాలయంలో మీడియాతో మాట్లాడారు. సింగరేణి బోర్డు బొగ్గు తవ్వకాలు పెంచడంతోపాటు ఇతర మినరల్స్ మైనింగ్ చేయాలని నిర్ణయం తీసుకుందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

# సింగరేణిలో జెండా ఎగరేస్తాం

## జాగృతి అధ్యక్షురాలు కవిత



**హైదరాబాద్,సెప్టెంబర్12(సమయజ్యోతి):**

సింగరేణి ఎన్నికల్లో గెలవబోయేది మనమేనని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. సింగరేణిలో జరుగుతున్న అవినీతిపై సీబీఐకి ఫిర్యాదు చేస్తామని ఆమె తెలిపారు. హైదరాబాద్ తెలంగాణ జాగృతి కార్యాలయంలో హెచ్‌ఎంఎస్ - సింగరేణి జాగృతి సంయుక్త సమావేశం ఏబీ సింగరేణి మైనర్స్ అండ్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ కేంద్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఇటీవల హెచ్‌ఎంఎస్ గౌరవ అధ్యక్షురాలిగా ఎన్నికైన కల్వకుంట్ల కవిత ఈ సమావేశంలో ప్రసంగించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సింగరేణిలో అవినీతి రాజ్యమేలుతోందని కవిత ఆరోపించారు. రాబోయే సింగరేణి ఎన్నికల్లో హెచ్‌ఎంఎస్ జెండా ఎగురబోతోందని ఆమె జోస్యం చెప్పారు. అవినీతిని కట్టడి చేయకుంటే సింగరేణి భవన్‌ను ముట్టడిస్తామని కవిత హెచ్చరించారు.

## కర్నాటకలో మళ్లీ కులగణన

సామాజిక అసమానతలు గుర్తించేందుకు సర్వే

కర్నాటక సిఎం సిద్దరమాయ్య స్పష్టీకరణ

**బెంగళూరు,సెప్టెంబర్12(సమయజ్యోతి):**

రాష్ట్రంలో మళ్లీ కొత్తగా కులగణన చేపట్టనున్నట్లు కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రకటించారు. గతంలో ఇచ్చిన నివేదికను అంగీకరించబోమని.. సెప్టెంబరు 22 నుంచి అక్టోబర్ 7 మధ్య మళ్లీ కులగణన చేపడతామని వెల్లడించారు. గతంలో చేపట్టిన కులగణన సమాచారం దాదాపు పదేళ్ల కిందటిది గనక ప్రస్తుతం సమాజంలోని వాస్తవాలను తెలుసుకోవడానికి కొత్తగా సర్వే అవసరమని ఆయన అన్నారు.

# డీజిల్‌లో ఐసోబుటనాల్ మిశ్రమం

## ఇందన ధరల దృష్ట్యా ప్రయోగం

## కేంద్రమంత్రి గడ్కరీ వెల్లడి

**న్యూఢిల్లీ,సెప్టెంబర్12(సమయజ్యోతి):**

దేశంలో ఇంధన దిగుమతుల ఖర్చును తగ్గించేందుకు ఇథనాల్ కలుపుతున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే ఇ20 పెట్రోల్ వాడకం గురించి వాహనదారుల్లో ఉన్న అపోహలపై కేంద్రం క్లారిటీ- ఇచ్చింది. అయితే తాజాగా ఇథనాల్‌కు బదులుగా ఐసోబుటనాల్‌ను డీజిల్‌లో కలపనున్నట్లు- కేంద్ర రోడ్డు రవాణా మంత్రి నితిన్ గడ్కరీ వెల్లడించారు.



# రైతు సమస్యలు ప్రస్తావిస్తే కేసులా

## మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు

**హైదరాబాద్,సెప్టెంబర్12 (సమయజ్యోతి):**



రైతుల యూరియా కష్టాలను చూపిస్తే మీడియాపై కేసులు పెడతారా..? అణిచివేతలు, ఆంక్షలతో జర్నలిస్టులను భయపెడుతారా..? అని కాంగ్రెస్ సర్కార్‌ను మాజీ మంత్రి హరీశ్‌రావు నిలదీశారు. రైతులు పడుతున్న యూరియా కష్టాలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చేందుకు ప్రయత్నించిన ఖమ్మం రిపోర్టర్ సాంబశివరావుపై పోలీసులు అక్రమ కేసులు బనాయించడం దుర్మార్గం అని మండిపడ్డారు. రైతుల సమస్యలను తెలుసుకునేందుకు వెళ్లిన జర్నలిస్టుపై పోలీసులు ఉల్టా కేసులు పెట్టడం రాష్ట్ర ప్రభుత్వ నిరంకుశ పాలనకు నిదర్శనం. గడిచిన 2 నెలలుగా రైతులు యూరియా కోసం అష్టకష్టాలు పడుతుంటే పట్టించుకోని ప్రభుత్వం.. ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎత్తి చూపుతున్న మీడియా ప్రతినిధులపై కేసులు పెట్టడం శోచనీయం. శాంతిభద్రతల నిర్వహణను పక్కన పెట్టి ప్రజల గొంతు నొక్కేందుకు పోలీసులను వాడడం అప్రజాస్వామికం. జర్నలిస్ట్ సాంబశివరావుపై పెట్టిన కేసులను తక్షణం ఉపసంహరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, డీజీపీని డిమాండ్ చేస్తున్నాం అని హరీశ్‌రావు పేర్కొన్నారు.


# ఓటు చోరీ కాదు..


# ఎమ్మెల్యేల చోరీపై మాట్లాడాలి

## రాహుల్‌కు కెటిఆర్ గట్టి సవాల్

**హైదరాబాద్,సెప్టెంబర్12(సమయజ్యోతి):**

బీఆర్‌ఎస్ పార్టీ తరపున గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యేలపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి మండిపడ్డారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ ద్వంద్వ ప్రమాణాలపై కూడా కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. పార్టీ మార్చిన ప్రతి ఒక్క ఎమ్మెల్యేను రాహుల్ గాంధీతో సహా అనేక మంది కాంగ్రెస్ నేతలు స్వయంగా కలిశారని కేటీఆర్ గుర్తు చేశారు. కాంగ్రెస్ నేతలతో పార్టీ మారిన ఎమ్మెల్యేలు తీసుకున్న ఫోటోలను సోషల్ మీడియాలో చూపించి ఇవ్వాళ వీళ్లను మీరు గుర్తుపట్టగలరా అని ఎద్దేవా చేశారు. బిఆర్‌ఎస్ టికెట్ మీద గెలిచి కాంగ్రెస్ కండువా కప్పకున్న ఎమ్మెల్యేలు, ఇప్పుడు మేము కాంగ్రెస్‌లో చేరలేదని అంటున్నారు.. ఇది ఎంత వరకు కరెక్ట్ అని కేటీ-ఆర్ ప్రశ్నించారు. అది కాంగ్రెస్ కండువా కాదు అని అంటు-న్నారు, మీరు దీన్ని ఒప్పకుంటారా అని కేటీ-ఆర్ ప్రశ్నల వర్షం కురిపించారు. 'ఇది ఎమ్మెల్యేల చోరీ కాకపోతే ఇంకేమిటి?' అంటూ రాహుల్ గాంధీని నిలదీశారు. ఓటు- చోరీ గురించి రాహుల్ గాంధీ చేస్తున్న ఆరోపణలకంటే, ఎమ్మెల్యేల చోరీ కూడా చిన్న నేరం కాదని వ్యాఖ్యానించారు. ఈ ద్వంద ప్రమాణాలపై రాహుల్ గాంధీకి సిగ్గు లేదని కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు





మొదటిపేజీ తరువాయి

## ఉపరాష్ట్రపతిగా రాధాకృష్ణన్ ప్రమాణం

### రాష్ట్రపతి భవన్‌లో ప్రమాణం చేయించిన ద్రౌపది ముర్ము

### హాజరైన ప్రధాని మోడీ, పలువురు ప్రముఖులు

న్యూఢిల్లీ,సెప్టెంబర్12(సమయజ్యోతి):

భారత నూతన ఉప రాష్ట్రపతిగా సీపీ రాధాకృష్ణన్ శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రమాణస్వీకారం చేశారు. రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆయనతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీతోపాటు–, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, నితిన్ గడ్కరీ, సుప్రీం చీఫ్ జస్టిస్ గవాయ్, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఏపీ డిప్యూటీ– సీఎం పవన్ కల్యాణ్ పాల్గొన్నారు. మాజీ రాష్ట్రపతులు, మాజీ ప్రధానులు, మాజీ ఉప రాష్ట్రపతులనూ ఈ కార్యక్రమానికి ఆహ్వానించారు. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ఉప రాష్ట్రపతులు జగదీప్ ధన్‌ఖడ్, వెంకయ్యనాయుడు, హమీద్ అన్సారీ తదితరులు కూడా హాజరయ్యారు. కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, పియూష్ గోయెల్, ధర్మేంద్ర ప్రదాన్ సహా పలువురు కేంద్ర మంత్రులు, లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా, ఎన్డీయే కూటమికి చెందిన నేతలు, ఎంపీలు, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరయ్యారు. ఉప రాష్ట్రపతి ఎన్నికకు ఈనెల 9న జరిగిన పోలింగ్‌లో ఎన్డీయే కూటమి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ తన సమీప ప్రత్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డిపై 152 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ఎన్నిక లాంఛనాలన్నీ పూర్తి కావడంతో గురువారం మహారాష్ట్ర గవర్నర్ పదవికి సీపీ రాధాకృష్ణన్ రాజీనామా చేశారు. దీంతో మహారాష్ట్ర బాధ్యతలను గుజరాత్ గవర్నర్ ఆచార్య దేవవ్రత్‌కు రాష్ట్రపతి ముర్ము అప్పగించారు. ఆర్ఎస్ఎస్, జనసంఘ్ లాంటి సంస్థలతో 16 ఏండ్లకే రాధాకృష్ణన్ రాజకీయ జీవితం ప్రారంభమైంది. 1996లో తమిళనాడు బీజేపీ కార్యదర్శిగా, 2003 నుంచి 2006 మధ్య అధ్యక్షుడిగా పనిచేశారు. ఆ సమయంలో ఆయన రాష్ట్రంలో 93 రోజుల పాటు 19 వేల కి.మీ రథయాత్ర నిర్వహించారు. 2024, జూలై 31న ఆయన మహారాష్ట్ర గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు జార్ఖండ్ గవర్నర్‌గా ఏడాదిన్నర పాటు చేశారు. తెలంగాణ ఇన్‌చార్జి గవర్నర్‌గా, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గానూ పనిచేశారు. 1998, 1999లో కోయంబత్తూర్ నుంచి ఆయన రెండుసార్లు ఎంపీగా చేశారు. అభిమానులు ఆయనను తమిళనాడు మోదీగా పిలుస్తారు.



## భారీ వర్షాల హెచ్చరిక

### కామారెడ్డి కాంగ్రెస్ సభ వాయిదా

హైదరాబాద్,సెప్టెంబర్12(సమయజ్యోతి):

కామారెడ్డిలో 15న జరగనున్న సభను టీపీసీసీ వాయిదా వేసింది. భారీ వర్షాల సూచనతో సభను వాయిదా వేసినట్లు తెలిపింది. సభ తిరిగి ఎపుడు నిర్వహిస్తామనేది త్వరలో చెబుతామని ప్రకటించింది. బీసీ డిక్లరేషన్ ప్రకటించిన కామారెడ్డి గడ్డ మీద నుంచే రిజర్వేషన్లకు అడ్డుగా ఉన్న బీజేపీ సర్కారు మీద సమర శంఖం పూరించేందుకు కాంగ్రెస్ సిద్ధమైన సంగతి తెలిసిందే.. ఈ క్రమంలోనే సెప్టెంబర్ 15న కామారెడ్డిలో భారీ బహిరంగసభ నిర్వహించేందుకు ఏర్పాట్లు– చేస్తోంది. భారీ సభ నిర్వహించడం బీజేపీ మీద ఒత్తిడి తీసుకురావాలని కాంగ్రెస్ నాయకత్వం సన్నాహాలు చేస్తోంది. కామారెడ్డి సభకు కనీసం 2 లక్షల మందిని సమీకరించాలని పార్టీ నాయకులు టార్గెట్ గా పెట్టుకున్నారు. కామారెడ్డి, నిజామాబాద్, రాజన్న సిరిసిల్లా జిల్లాల నుంచి ప్రధానంగా జనాన్ని తరలించాలని భావిస్తు న్నారు. ఈ జిల్లాలకు చెందిన ముఖ్య నాయకులతో పీసీసీ లీడర్లు జనాలను తరలించే విషయంలో చర్చిస్తున్నారు. కామారెడ్డికి దగ్గరగా ఉండే మండలాలపై ఫోకస్ పెట్టాలని సూచిస్తున్నారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు కూడా రానుండడంతో గ్రామ, మండలస్థాయి లీడర్లు కూడా ఉత్సాహం పనిచేసే అవకాశం ఉందని ఆశిస్తున్నారు. ఈ సభకు కాంగ్రెస్ జాతీయ స్థాయి నాయకులు హాజరు కావచ్చునని తెలుస్తోంది. ఈ క్రమంలోనే సభ నిర్వహణ, జన సమీకరణ తదితర అంశాలను పరిశీలించేందుకు ఆదివారం కామారెడ్డిలో సన్నాహక సమావేశం జరిగింది. సభ సక్సెస్ చేసేందుకు ఎలా పని చేయాలో పార్టీ శ్రేణులకు పీసీసీ చీఫ్ మంత్రులు దిశానిర్దేశర చేశారు. అయితే తెలంగాణకు భారీ వర్షాల హెచ్చరికతో సభను వాయిదా వేస్తున్నట్లు– టీపీసీసీ ప్రకటించింది.

## నేపాల్‌లో దారుణ ఘటన

### హోటల్‌కు నిప్పు పెట్టిన దుండగులు

### యూపికి చెందిన మహిళ మృతి

న్యూఢిల్లీ,సెప్టెంబర్12(సమయజ్యోతి):

పొరుగు దేశం నేపాల్ లో జడ్ జనరేషన్– యువత నిర్వహిస్తున్న ఆందోళనలు తారాస్థాయికి చేరాయి. ఆర్మీ కంట్రోల్ లోకి తీసుకున్న తర్వాత పరిస్థితులు కాస్త చక్కబడినట్లే కనిపించినా.. అక్కడక్కడ నిరసనకారులు పేట్రేగిపోతున్నారు. నిరసనల్లో భాగంగా ఒక హోటల్ కు నిప్పు పెట్టడంతో.. భారత్ కు చెందిన మహిళ చనిపోవడం దిగ్భ్రాంతికి గురిచేస్తోంది.ఉత్తరప్రదేశ్ ఘజియాబాద్ కు చెందిన రాజేశ్ గోలా అనే 57 ఏళ్ల మహిళ చనిపోయింది. టూర్ కు వెళ్లిన కుటుంబం హయత్ రెజెన్సీలో ఉండగా ఆందోళన కారులు నిప్పు పెట్టారు. హోటల్ మంటల్లో చిక్కుకోవడంతో దూకి పారిపోయే ప్రయత్నంలో ప్రాణాలు కోల్పోయినట్లు– ఆమె కుటుంబ సభ్యులు తెలిపారు. మంటలు పూర్తిగా వ్యాపించడంతో భయంతో ఒక్కసారిగా బిల్డింగ్ మీది నించి జంప్ చేసింది. దీంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆమె భర్త రాంవీర్ సింగ్ గోలా ఆమెను ఖాట్మండులోని త్రిభువన్ యూనివర్సిటీ ఆస్పత్రికి తరలించాడు. అప్పటికే ఆమె చనిపోయినట్లు– వైద్యులు ప్రకటించారు.

# డీజిల్‌లో ఐసోబుటనాల్ మిశ్రమం

## ఇందన ధరల దృష్ట్యా ప్రయోగం

### కేంద్రమంత్రి గడ్కరీ వెల్లడి

న్యూఢిల్లీ,సెప్టెంబర్12(సమయజ్యోతి):

దేశంలో ఇంధన దిగుమతుల ఖర్చును తగ్గించేందుకు ఇథనాల్ కలుపుతున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే ఇ20 పెట్రోల్ వాడకం గురించి వాహనదారుల్లో ఉన్న అపోహలపై కేంద్రం క్లారిటీ– ఇచ్చింది. అయితే తాజాగా ఇథనాల్‌కు బదులుగా ఐసోబుటనాల్‌ను డీజిల్‌లో కలపనున్నట్లు– కేంద్ర రోడ్డు రవాణా మంత్రి నితిన్ గడ్కరీ వెల్లడించారు. డీజిల్‌లో ఇథనాల్‌ను కలిపే ప్రయోగం విజయవంతం కాలేదని.. అందువల్ల దానికి బదులుగా ఐసోబుటనాల్ మెరుగైనది గుర్తించినట్లు– చెప్పారు. డీజిల్‌లో ఇథనాల్ మిక్స్ చేసినప్పుడు ఇంజిన్ సమస్యలతో పాటు– కొన్ని సాంకేతిక సమస్యలు వచ్చాయని చెప్పారు. బయోఫ్యూయల్ మిక్సింగ్ విదేశీ కరెన్సీని ఆదాచేయటంతో పాటు– భారీ ఫ్యూయెల్ బిల్లుల నుంచి ఉపశమనం కల్పిస్తుందని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. పెట్రోల్ లో ఇథనాల్ మిక్సింగ్ పై సోషల్ మీడియాలో తనపై కావాలనే తప్పుడు ప్రచారం కొనసాగించాలని గడ్కరీ ఇటీవల అన్నారు. అవి పూర్తిగా పెట్రోల్ లాబీ స్పాన్సర్ చేసిన పెయిడ్ ప్రచారం అన్నారు గడ్కరీ. ఊ20 ఇంధనానికి వ్యతిరేకంగా జరుగుతున్న ప్రచారం రాజకీయంగా ప్రేరేపించబడిందని అన్నారు. ఇథనాల్ వల్ల వాహనాల ఇంజన్లు పాడవుతాయనం పూర్తిగా నిరాధారమైనదిగా కొట్టిపడేశారు. కానీ కొందరు నిపుణులు మాత్రం ఇథనాల్ వల్ల పాత వాహనాల్లో ఇంజిన్లో తుప్పు, రబ్బర్ భాగాలు పడవటం జరుగుతుందని అంటున్నారు. మైలేజ్ కూడా దెబ్బతింటు–ందని చెబుతున్నారు. ప్రస్తుతం డీజిల్ విషయంలో ఐసోబుటనాల్ కలపాలనుకోవటానికి కారణం అందులో ఇథనాల్ కంటే ఎక్కువ ఎనర్జీ ఉండటమే. డీజిల్‌లో కలిపినప్పుడు ఇంజిన్ పనితీరు మెరుగుపడి కాలుష్యం కూడా తగ్గినట్లు– గుర్తించారు. ఇథనాల్ మాదిరిగానే ఐసోబుటనాల్ కూడా చెరకు, మొక్కజొన్న వంటి పంటల నుంచి తయారు చేస్తారు. ఇక్కడ అసలు సమస్య ఏంటంటే ఐసోబుటనాల్‌ను పెద్ద ఎత్తున ఉత్పత్తి చేయడమే. దీని శుద్ధికి కర్మాగారాలకు నూ టెక్నాలజీ అవసరం ఉందని తెలుస్తోంది.

## జంటజలాశయాలకు మరోమారు వరద

### దిగువకు నీటి విడుదలతో మూసీ ఉరకలు

### పరివాహక ప్రజలను అప్రమత్తం చేసిన అధికారులు

హైదరాబాద్,సెప్టెంబర్12(సమయజ్యోతి):

తెలంగాణతో పాటు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్ జంట జలాశయాలకు మరోమారు భారీగా వరద నీరు చేరుకుంది. అలాగే మూసీకి కూడా భారీగా వరద నీరు చేరుకోవడంతో మూసీ పరివాహక ప్రాంతాల్లో జీహెచ్ఎంసీ అధికారులు రెడ్ అలర్ట్ జారీ చేశారు. ఈ నేపథ్యంలో మూసీ పరివాహక ప్రాంత ప్రజలను అప్రమత్తం చేశారు జీహెచ్ఎంసీ అధికారులు. జంట జలాశయాల గేట్లు– ఎత్తడంతో ఉగ్రరూపం దాల్చింది మూసీ. జియాగూడ, పురానాపూల్, చాదర్ ఘాట్, మూసారాంబాగ్ వద్ద ఉధృతంగా ప్రవహిస్తోంది మూసీ. ఈ క్రమంలో జియాగూడ, పురానాపుల్ వద్ద ఆలయాలు, ధోబీ ఘాట్లు– నీట మునిగాయి. భారీగా వరద నీరు చేరడంతో జియాగూడ 100 ఫీట్ రోడ్డు మార్గం మూసివేశారు. అలాగే, హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్ జంట జలాశయాలకు భారీగా వరద నీరు చేరుకుంది. భారీగా వరద ప్రవాహంతో హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్ ఎనిమిది గేట్లు– ఎత్తివేశారు. జంట జలాశయాల నుంచి 8,000 క్యూసెక్కుల వరద నీరు విడుదల చేశారు. హిమాయత్ సాగర్ నాలుగు గేట్లను 4 అడుగుల మేర ఎత్తి.. 5, 215 క్యూసెక్కుల నీటిని మూసీలోకి వదులుతున్నారు. అలాగే ఉస్మాన్ సాగర్ నాలుగు గేట్లను 4 అడుగుల మేర ఎత్తి.. 2800 క్యూసెక్కుల నీటిని మూసీలోకి వదులుతున్నారు అధికారులు. హిమాయత్ సాగర్ ఇన్ ఫ్లో 5500 క్యూసెక్కులకు చేరింది. ఉస్మాన్ సాగర్ ఇన్ ఫ్లో 2300 క్యూసెక్కులకు చేరింది.

## ఈ యేడాది చివర్లో భారత్‌కు ట్రంప్

### క్వాడ్ దేశాధినేతల సమావేశాల్లో పాల్గొనే ఛాన్స్

వాషింగ్టన్,సెప్టెంబర్12(సమయజ్యోతి):

రష్యా చమురు కొనుగోలు కారణం చూపి ట్రంప్ విధించిన భారీ సుంకాలతో భారత్–అమెరికా మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. ప్రస్తుతం రెండు దేశాల మధ్య సుంకాల వివాదం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో కీలక పరిణామం చోటు– చేసుకుంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ ఏడాది చివర్లో భారత్‌కు వచ్చే అవకాశం ఉంది. ఈ ఏడాది నవంబర్‌లో భారత్‌లో జరగనున్న క్వాడ్ దేశాధినేతల సదస్సుకు ట్రంప్ హాజరయ్యే అవకాశం ఉన్నట్లు– భారత్‌కు కాబోయే అమెరికా రాయబారి సెర్గీ గోర్ వెల్లడించారు. ఈ సదస్సు కోసం ఆయన ఎదురుచూస్తున్నట్లు– తెలిపారు. ఈ పర్యటనకు సంబంధించి ఇంకా చర్చలు జరుగుతున్నాయని వివరించారు. 2017లో భారత్, జపాన్, అమెరికా, ఆస్ట్రేలియా దేశాలు క్వాడ్ కూటమిని ఏర్పాటు– చేశాయి. నాలుగు అగ్రదేశాలతో ఏర్పడిన కూటమి అధినేతలు 2021 సెప్టెంబరు 24న వాషింగ్టన్‌లో తొలిసారి భేటీ– అయ్యారు. ఇక గతేడాది సదస్సుకు అమెరికా ఆతిథ్యం ఇచ్చింది. ఈ సారి క్వాడ్ దేశాధినేతల సదస్సుకు భారత్ ఆతిథ్యం ఇస్తున్న విషయం తెలిసిందే. నవంబరులో న్యూఢిల్లీలో జరగబోయే సదస్సుకు ఆయా దేశాధినేతలు హాజరు కానున్నారు. ఈ కూటమి విదేశాంగ మంత్రుల సమావేశం ఈ ఏడాది జనవరిలో అమెరికాలో జరిగిన విషయం తెలిసిందే.

## కర్ణాటకలో మళ్లీ కులగణన

మొదటిపేజీ తరువాయి

సమాజంలో అనేక కులమతాలతో పాటు– సామాజిక అసమానతలు కూడా ఉన్నాయి. దేశంలోని ప్రజలంతా సమానమేనని.. ప్రజలందరికీ సమాన సామాజిక న్యాయం జరగాలని రాజ్యాంగం చెబుతోంది. దాని ప్రకారమే.. ప్రజల మధ్య అసమానతలను తొలగించి ప్రజాస్వామ్యానికి బలమైన పునాదులు సృష్టించే దిశగా ముందడుగు వేయడానికి మేము నిర్వహించే నూతన సర్వే ఉపయోగపడుతుందని సిద్ధరామయ్య తెలిపారు. 2015లో కర్ణాటక వెనకబడినవర్గాల కమిషన్ జస్టిస్ కాంతరాజ నేతృత్వంలో కులగణన చేపట్టగా, ఈ డేటా ఆధారంగా కె.జయప్రకాశ్ హెగ్డే నేతృత్వంలో పూర్తిస్థాయి నివేదిక తయారుచేసి గతేడాది సర్కారుకు సమర్పించిన విషయం తెలిసిందే. కులగణన, ఆర్థిక, సామాజిక సమీక్షపై రూపొందించిన ఈ నివేదికను కర్ణాటక సర్కారు గతంలోనే ఆమోదించింది. నిపుణులు రూపొందించిన ఈ నివేదికపై భిన్నాభిప్రాయాలు, పలు వర్గాల నుంచి ఆందోళనలు వ్యక్తమవడంతో రాష్ట్రంలో మరోసారి కులగణన చేపట్టనున్నట్లు– ప్రకటన వెలువడింది. రాష్ట్రంలో మళ్లీ కులగణన చేపట్టాలని కాంగ్రెస్ అధిష్ఠానం సైతం ఇటీవల కర్ణాటక ప్రభుత్వానికి సూచించింది.

మొదటిపేజీ తరువాయి

# ఆలయాలన్నింటినీ సందర్శించి విడివిడిగా ప్రాజెక్టు రిపోర్టులు సిద్ధం చేయాలి

హైదరాబాద్,సెప్టెంబర్12(సమయజ్యోతి):

గోదావరి పుష్కరాలను దక్షిణ భారత కుంభమేళాగా ఘనంగా నిర్వహించేందుకు ముందస్తు ఏర్పాట్లు– చేసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గోదావరి పుష్కరాలకు శాశ్వత ప్రాతిపదికన ఏర్పాట్లు– చేయాలన్నారు. అందుకు అవసరమైన ముందస్తు ప్రణాళికలు తయారు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. అలాగే, రాష్ట్రంలో గోదావరి తీరం వెంట ఉన్న ప్రధాన ఆలయాల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. దీంతో పాటు– పుష్కరాల ఏర్పాట్లు–, రాబోయే భక్తుల రద్దీని అంచనా వేసుకొని మౌలిక వసతులు కల్పించాలన్నారు. గోదావరి పుష్కరాల ఏర్పాట్లు–, ముందస్తు సన్నద్ధతపై శుక్రవారం కమాండ్ కంట్రోల్ సెంటర్లో సీఎం రేవంత్ రెడ్డి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎంతో పాటు– మంత్రి కొండా సురేఖ, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రి, ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి శ్రీనివాసరాజు, ధార్మిక సలహాదారు గోవింద హరి తదితరులు పాల్గొన్నారు. గోదావరి పుష్కరాల నేపథ్యంలో బాసర నుంచి భద్రాచలం వరకు టెంపుల్ సెంట్రిక్ ఘాట్స్ నిర్మించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రధాన ఆలయాల వద్ద శాశ్వత ఘాట్స్ నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఒకే సారి రెండు లక్షల మంది స్నానాలు చేసేందుకు వీలుగా ఘాట్లు ఉండాలని సూచించారు. బాసర, కాళేశ్వరం, ధర్మపురి, భద్రాచలంతో పాటు గోదావరి పరిసర ఇతర ఆలయాల జాబితాను సిద్ధం చేయాలని ఆదేశించారు. జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారుల సమీపంలో ఉన్న గోదావరి పరీవాహక ఆలయాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న ఘాట్స్‌ను విస్తరించడంతో పాటు– రోడ్లు, ఇతర సౌకర్యాలను శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. పుష్కర స్నానాలు ఆచరించేందుకు వచ్చే లక్షలాది భక్తులకు ఎలాంటి లోటు–పాట్లు– లేకుండా తగిన సదుపాయాలు కల్పించేందుకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు.అయితే, 2027లో జులై 23వ తేదీ నుంచి గోదావరి పుష్కరాలు ప్రారంభమవుతాయి. ఇప్పటి నుంచి దాదాపు 22 నెలల వ్యవధి ఉన్నందున శాశ్వతమైన మౌలిక వసతులు, అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మహారాష్ట్ర నుంచి తెలంగాణలో ప్రవేశించే గోదావరి నదికి రాష్ట్రంలో 560 కిలోమీటర్ల తీర ప్రాంతముంది. దాదాపు 74 చోట్ల పుష్కర ఘాట్లను ఏర్పాటు– చేయాల్సిన అవసరముంటుందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి తీరం వెంట ఉన్న ధర్మపురి, కాళేశ్వరంతో పాటు– అన్ని ప్రధాన ఆలయాలను మొదటగా అభివృద్ధి చేయాలన్నారు ముఖ్యమంత్రి రేవంత్. ఇక, ప్రధాన ఆలయాల దగ్గర భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటు–ంది, ఆలయ పరిసరాల్లోని పుష్కర ఘాట్ల అభివృద్ధికి మొదటి ప్రాధాన్యంగా ఎంచుకోవాలన్నారు. ఆలయ అభివృద్ధితో పాటు– అక్కడ శాశ్వత పుష్కర ఘాట్ల నిర్మాణం చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. అలాగే, రెండో ప్రాధాన్యంగా పుష్కర స్నానాలకు వీలుగా ఉండే గోదావరి తీర ప్రాంతాలను అభివృద్ధి చేయాలి.. ఒకే రోజు రెండు లక్షల మంది భక్తులు పుష్కర ఘాట్లకు తరలివచ్చినా ఇబ్బంది లేకుండా రోడ్లు, రహదారుల నిర్మాణంతో పాటు– వాహనాల పార్కింగ్, తాగు నీరుతో పాటు– భక్తులకు అవసరమైన వసతులన్నీ ఉండేలా ఎ÷–లాన్ చేసుకోవాలన్నారు.అలాగే, మహా కుంభమేళాతో పాటు– గతంలో వివిధ రాష్ట్రాల్లోౖ పుష్కరాలు, ఆలయాల అభివృద్ధి, భక్తులకు అవసరమైన సౌకర్యాల రూపకల్పనలో అనుభవమున్న కన్సల్టెన్సీలను నియమించుకోవాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. బాసర, కాళేశ్వరం, ధర్మపురి, భద్రాచలంతో పాటు– గోదావరి తీరం వెంట ఉన్న అన్ని ఆలయాలన్నింటినీ సందర్శించి విడివిడిగా ప్రాజెక్టు రిపోర్టులు సిద్ధం చేయాలన్నారు. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఆలయాల అభివృద్ధికి డిజైన్లు రూపొందించాలన్నారు. ఇక, పుష్కరాల ఏర్పాట్లకు కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. స్వచ్ఛ భారత్, జల్ జీవన్ మిషన్ తో పాటు– అందుబాటులో ఉన్న కేంద్ర పథకాలన్నింటితో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. వాటికి అవసరమైన అనుమతులు తీసుకోవాలన్నారు. దక్షిణ భారత కుంభమేళాకు వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని కేంద్రం నుంచి స్పెషల్ ప్యాకేజీ కోరేందుకు వీలుగా ఈ పనుల జాబితాను సిద్ధం చేయాలని చెప్పారు. పుష్కరాల నిర్వహణకు ముందస్తు ఏర్పాట్లలో పర్యాటక శాఖ, నీటి పారుదల శాఖ, దేవాదాయ శాఖ సమన్వయంతో పని చేయాలని రేవంత్ రెడ్డి అన్నారు.

## ఖనిజాల తవ్వకాల్లోనూ సింగరేణికి ప్రాధాన్యం ఇవ్వాలి

మొదటిపేజీ తరువాయి

రాయచూరు, దేవదుర్గ ప్రాంతాల్లో కాపర్ అండ్ గోల్డ్ మైనింగ్ యాక్షన్‌లో సింగరేణి పాల్గొందని గుర్తు చేశారు. దాని వల్ల సింగరేణి 37.75శాతం వాటాను దక్కించుకుందని హర్షం వ్యక్తం చేశారు. పలు రాష్ట్రాల్లోని ఎన్టీపీసీలకు సింగరేణి బొగ్గు సరఫరా చేస్తోందని చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో మరో 25 ఏళ్లకు సరిపడా మాత్రమే బొగ్గు నిల్వలు ఉన్నాయని చెప్పారు. సింగరేణి సంస్థ వేలంలో పాల్గొనకపోతే బొగ్గు బ్లాకలు ప్రైవేటు– వ్యక్తులకు వెళ్తాయని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. సత్తుపల్లి, కోయగూడెం బ్లాక్‌లు ఇప్పటికే ప్రైవేటు– వ్యక్తులకు వెళ్లాయని గుర్తు చేశారు. అందుకే సింగరేణి సంస్థ వేలంలో పాల్గొనాలని సూచించారు. దాంతో సింగరేణిలో మరిన్ని ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని వివరించారు. సింగరేణి గ్రీన్ ఎనర్జీ స్టోరేజ్‌లో భాగస్వామ్యం అవుతోందని పేర్కొన్నారు. దేశానికి క్రిటికల్ మినరల్స్ అందించడంలో భాగస్వామ్యం ఉండాలనే లక్ష్యంతో సింగరేణి ముందుకు వెళ్తుందని భట్టి విక్రమార్క ధీమా వ్యక్తం చేశారు.కీలక ఖనిజాల వెలికితీతలో కూడా కేంద్రం సింగరేణి సంస్థకు అవకాశం కల్పించాలని డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క తెలిపారు. రాయచూర్, దేవదుర్గ్ బెల్ట్ లో రాగి, బంగారం ఖనిజాల అన్వేషణలో, కర్ణాటకలో రాగి, బంగారం, మైనింగ్ గనుల తవ్వకాల వేలంలో సింగరేణి సంస్థ పాల్గొన్నదని భట్టి తెలియజేశారు. కీలక ఖనిజాల తవ్వకాల కోసం సింగరేణి గ్లోబల్ అనే పేరుతో వెళ్తుందని, దేశంలో జరుగుతున్న బొగ్గు గనుల వేలంతో కొన్నాళ్లుగా సింగరేణి పాల్గొనడం లేదని చెప్పారు. సింగరేణి సంస్థ వేలంలో ఎందుకు పాల్గొనడం లేదో తాము పరిశీలించామని అన్నారు. సింగరేణి సంస్థ వేలంలో పాల్గొనకపోతే బొగ్గు బ్లాక్ లు ప్రైవేటు– వ్యక్తులకు వెళ్తాయని, సింగరేణి సంస్థకు అదనంగా రావాల్సిన బొగ్గు బ్లాక్ లు దక్కడం లేదని ఆవేదనను వ్యక్తం చేశారు. కొత్త బ్లాక్ లు కేటాయించకపోవడంతో సింగరేణి సంస్థ ఇబ్బందులు ఎదుర్కొంటోందని పేర్కొన్నారు. సింగరేణి సంస్థకు కొత్త బొగ్గు బ్లాక్ లు దక్కని పరిస్థితి వస్తోందని, కొత్త బ్లాక్ లు రాకుంటే సింగరేణి మూసి వేయాల్సిన పరిస్థితి వస్తుందని అన్నారు. సింగరేణికి కొత్త బ్లాక్ లు రాకపోవడంతో ఆ సంస్థతో పాటు– రాష్ట్రానికి నష్టం అని హెచ్చరించారు. వేలం ద్వారా పొందే రాయల్టీ ఆ రాష్ట్రాలకే చెందుతుందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

# ఎమ్మెల్యే కప్ విజేతలకు బహుమతులు అందజేసిన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

సమయజ్యోతి న్యూస్ సెప్టెంబర్ 12 బజార్ హత్నూర్

నేరడిగొండ మండల కేంద్రంలోని జడ్పీ పాఠశాలలో గత 3 రోజుల నుంచి జరుగుతున్న ఎమ్మెల్యే కప్ సాఫ్ట్ బాల్ టౌర్నమెంట్ లో విజయం సాధించిన క్రీడాకారులకు శుక్ర వారం నాడు ఆదిలాబాద్ సాఫ్ట్ బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సొంత డబ్బులతో బహుమతులు మరియు ట్రోఫీ లను అందజేశారు. ఈ సందర్భంగా సాఫ్ట్ బాల్ గర్ల్స్ లో బుగ్గరం విద్యార్థినిలు మొదటి బహుమతి, రెండవ బహుమతిగా నేరడిగొండ విజయం సాధించగా బాయ్స్ లో వచ్చేసి నెరడిగొండ మొదటి బహుమతిగా మరియు రెండవ బహుమతి సాధించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజమని అన్నారు. ఓడిన వారు ఎప్పుడూ కూడా నిరాశచెందొద్దని ఒడిపోతేనే అనుభవం తొడవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పద్మ, సాఫ్ట్ బాల్ సెక్రటరీ గంగాధర్, బుగ్గరం ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణవేణి, పిడీలు రమణ, అఖిల్, మమత, పిటి గంగమని, నాగరాజు, శ్యామ్, అనిల్, గణేష్, సాయి కిరణ్ తదితరులు ఉన్నారు




# పత్తి చేనులో గంజాయి సాగు

## ఒకరి అరెస్ట్, ఇద్దరు పరారీ

## బహిరంగ మార్కెట్లో పట్టుకున్న గంజాయి విలువ 62.7 లక్షలు

సమయజ్యోతి న్యూస్ గుడిహత్నూర్

జిల్లాలో గంజాయిని పూర్తిగా రూపుమాపే దిశగా జిల్లా పోలీస్ యంత్రాంగం అహర్నిశలు కష్టపడుతుందని, జిల్లాలో గంజాయి పండించే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తూ చట్టప్రకారం చర్యలు తీసుకుంటుందని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్ తెలియజేశారు., జిల్లాను గంజాయి రహిత జిల్లాగా నిర్మించడం జరుగుతుందని దానికి ప్రజల ప్రతి ఒకరి సహకారం తప్పనిసరి అని జిల్లా ఎస్పీ తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం గుడియాత్నూర్ పోలీస్ స్టేషన్ నందు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, గురువారం స్థానిక గుడిహత్నూర్ మండలం తోషం గ్రామ శివారులో తోషం గ్రామస్తులైన నిందితులు తమ పంటచేళ్లలో 627 ఉన్న గంజాయి మొక్కలను పండిస్తుండగా సిసిఎస్ మరియు ఇచ్చోడ సర్కిల్ పోలీసులు సంయుక్తంగా దాడి చేసి పట్టుకోవడం జరిగిందని జిల్లా ఎస్పీ తెలిపారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలని అత్యాశతో గంజాయి పండించడం జరిగిందని, వీరిపై గాంజాయ్ చట్టం ఎన్ డి పి ఎస్ ప్రకారం గుడిహత్నూర్ పోలీస్ స్టేషన్లో రెండు కేసులు నమోదు అయినట్లు తెలిపారు. జిల్లాలో గంజాయి నిర్మూలనకు ఎన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహించిన పెడచెవిన పెడుతూ ఇలాంటి గంజాయి మొక్కల పెంపకం చేస్తున్న వారిపట్ల జిల్లా పోలీస్ యంత్రాంగం కఠినంగా వ్యవహరిస్తుందని తెలిపారు. వీరికి ప్రభుత్వం పథకాలు రాకుండా సిఫార్సు చేయడం జరుగుతుందని తెలిపారు.




ఇందులో మొదటి నిందితుడు దేవరావును అరెస్టు చేసి రిమాండ్ కు తరలించడం జరిగిందని పరారీలో ఉన్న మార్సుకోల నగేష్ మార్సుకోల జగన్ ఇద్దరిని పట్టుకోవడంలో ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి అన్వేషించడం జరుగుతుందని తెలిపారు. గంజాయి యువత భవిష్యత్తును, జీవితాలను నాశనం చేస్తుందని, గంజాయి వల్ల కలుగు అనర్థాలు ఎన్నో ఉన్నాయని, గాంజాయ్ సేవించడం, వర్తకం చేయడం, రవాణా చేయడం, పండించడం లాంటివి చేయకూడదని, ఉల్లంఘించిన వారిపై కఠినంగా వ్యవహరించడం జరుగుతుందని హెచ్చరించారు. పట్టుకున్న గంజాయి మొక్కల విలువ దాదాపు బహిరంగ మార్కెట్లో 62 లక్షల 70 వేల రూపాయల వరకు ఉంటుందని తెలిపారు. ఒక్కొక్క మొక్క పదివేల చొప్పున బహిరంగ మార్కెట్లో విక్రయించడం జరుగుతుందని గంజాయి పండించడం పట్ల, మాదకద్రవ్యాల పట్ల జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తతతో ఉంటూ గంజాయిని జిల్లా నుండి తరిమి వేయడం లక్ష్యంగా విధులను నిర్వర్తిస్తుందని తెలిపారు. ప్రజలందరికీ జిల్లా ఎస్పీ సూచనలు ఇస్తూ గంజాయి పై ఎలాంటి సమాచారం ఉన్న 8712659973 నంబర్ కి వాట్సాప్ ద్వారా సమాచారం అందించవచ్చని సమాచారం జిల్లా ఎస్పీ గారికి నేరుగా అందించబడుతుందని తెలిపారు. గంజాయి పై సమాచారం అందించిన వారికి ప్రత్యేకంగా రివార్డులను అందజేయడం జరుగుతుందని సమాచారం తెలియజేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. ఇప్పటివరకు ఈ సంవత్సరం జిల్లాలో 120 గంజాయి కేసులు నమోదు కాగా అందులో 40 కిలోల వరకు ఎండు గంజాయి, 600 గంజాయి మొక్కలు స్వాధీనం చేసుకున్నట్లు, ఈ కేసులలో 240 మంది వరకు నిందితులపై కేసులు నమోదు చేసి అరెస్టు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ ఎఎస్పి కాజల్ సింగ్ ఐపీఎస్, సిసిఎస్ ఇన్స్పెక్టర్ పి చంద్రశేఖర్, ఇచ్చోడా సీఐ బండారి రాజు, ఎస్ఐ శ్రీకాంత్ సిబ్బంది, సిసిఎస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# నేడు జాతీయ లోక్ అదాలత్.. కక్షిదారులు వినియోగించుకోవాలి : జిల్లా జడ్జి పి నీరజ

సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్

ఈ నెల 13న శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్ పర్సన్, న్యాయమూర్తి పీ నీరజ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆద్వర్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని జిల్లా కోర్టు కాంప్లెక్స్ లో ఉదయం 10.30 గంటల నుంచి జాతీయ లోక్ అదాలత్ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కక్షిదారులు వారి సివిల్, క్రిమినల్ కేసులు పరిష్కరించుకోవాలని సూచించారు. జాతీయ లోక్ అదాలత్ ను వినియోగించుకోవాలని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్ పర్సన్, న్యాయమూర్తి పీ నీరజ పిలుపు నిచ్చారు.

# యూరియా కోసం వచ్చే రైతులు..పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు తేవాలి కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్

యూరియా కోసం వచ్చే రైతులు తమ వెంట తప్పనిసరిగా పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డ్ తీసుకురావాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలంలోని నిజామాబాద్, సుద్దాల గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు వేదికల్లో శుక్రవారం రైతులకు యూరియా పంపిణీ చేస్తుండగా, కలెక్టర్ పరిశీలించారు.మండలానికి మొత్తం ఎన్ని బస్తాల యూరియా వచ్చిందని జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం ను అడిగి తెలుసుకోగా, మొత్తం 1500 బస్తాలు వచ్చిందని కలెక్టర్ దృష్టికి డీఏఓ తీసుకువెళ్ళారు. వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు ఎరువులు వినియోగించాలని సూచించారు. అవసరం ఉన్న మేరకే తీసుకువెళ్లాలని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, మండల వ్యవసాయ అధికారులు ఉన్నారు.



# 22 న సోనాల లో శ్రీ సంత్ రామరావు మహారాజ్ విగ్రహము ఏర్పాటు కృషి చేస్తా మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్

సమయజ్యోతి న్యూస్ సెప్టెంబర్ 12 బజార్ హత్నూర్ బోథ్

సోనాల మండల కేంద్రంలోని బంజారా ఆరాధ్య దేవుడు శ్రీ సంత్ రామారావు మహారాజ్ విగ్రహం ఏర్పాటుకు కృషి చేస్తానని మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం సోనాల మండల కేంద్రంలో ని బంజారా సంఘం పెద్దలతో సమావేశాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ, తుల శ్రీనివాస్ వెల్ఫేర్ సొసైటీ చైర్మన్ తల శ్రీనివాస్ మాట్లాడుతూ తుల శ్రీనివాస్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శ్రీ సంత్ రామారావు మహారాజ్ విగ్రహం ఏర్పాటు చేస్తానని తన సొంత ఖర్చు లతో ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే విగ్రహ ప్రతిష్టాపన కొరకు ఈనెల 22న సోమ వారం 11 గంటలకు భూమి పూజ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే బంజారా సంఘ సభ్యులు విగ్రహ ఏర్పాటు కోసం బంజారా సేవ సంఘం నుంచి భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేస్తామని తెలిపారు. అలాగే సోనాల మండల బంజారా సేవా సంఘం నుంచి మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బంజారా సేవా సంఘం పెద్దలు పాల్గొన్నారు.



# తెలంగాణ శనగ విత్తనాలు అందుబాటులోకి బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగా రెడ్డి

సమయజ్యోతి న్యూస్ సెప్టెంబర్ 12 బజార్ హత్నూర్ బోథ్

బోథ్ మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి మాట్లాడుతూ రాబోవు రబీ సీజను సంబంధించిన శనగ విత్తనాలు బోథ్,సోనాల, బజార్ హత్నూర్, నేరడిగొండ మండల రైతులకు తెలంగాణ శనగ విత్తనాలు సీడ్స్ డీలర్ వద్ద 15 రోజులలో అందుబాటులోకి వస్తాయి అని ఒక ప్రకటనలో తెలిపారు



# ఫోటోగ్రఫర్స్, వీడియో గ్రాఫర్స్ ల ఫోటో ట్రేడ్ హైదరాబాద్ ఎక్స్పో పోస్టర్లను ఆవిష్కరించిన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

సమయజ్యోతి న్యూస్ సెప్టెంబర్ 12 బజార్ హత్నూర్

తెలంగాణ రాష్ట్ర ఫోటో గ్రాఫర్స్ మరియు వీడియో గ్రాఫర్స్ అసోషియేషన్ హైదరాబాద్ లో నిర్వహిస్తున్న ఫోటో ట్రేడ్ హైదరాబాద్ ఎక్స్పో పోస్టర్లను ఆదిలాబాద్ ఫోటో అసోసియేషన్ సభ్యులు నేరడిగొండ మండల కేంద్రంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ చే పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ ఏ పనిని అయిన గొప్పగా చూపించేది యాదిలను నెమరువేసుకోవడానికి చిత్రమే ముఖ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సంతోష్, జిల్లా ఫోటో గ్రాఫర్ల సంఘం అధ్యక్షులు, సభ్యులు ఉన్నారు




# బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ

బాల్కొండ మండల కేంద్రంలో శుక్రవారం పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సంజీవ్ గౌడ్ ఆధ్వర్యంలో ఆరుగురి బాధితులకు 1 లక్ష 36వేల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ చెక్కుల మంజూరుకి కృషిచేసిన నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి ముత్యాల సునీల్ కుమార్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు తౌట్ అరవింద్, మైనారిటీ మండల అధ్యక్షులు షేక్ జావిద్, యూత్ ఉపాధ్యక్షులు విక్కీ ,మొహమ్మద్ యునుస్ నాయకులు కుందారం శ్రీనివాస్, ఆరేపల్లి గంగాధర్, కుంట సంతోష్ గౌడ్, దయాకర్ గోపుశన్న, సన్నిత్ యాదవ్, సాయన్న, మెట్ట అశోక్, ఎర్రన్న, గడ్డం రవి, షేరు దయాకర్, పుల్లాయి నవీన్, వినేష్ కుమార్ పాల్గొన్నారు.



# సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి

సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ముందుగా ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది హాజరు వివరాలు రిజిస్టర్, అన్ని వార్డులు, మందుల గదిలో పరిశీలించారు. ప్రతి రోజూ ఆసుపత్రికి వైద్యం కోసం ఎందరు వస్తున్నారో ఆరా తీశారు. అనంతరం ఆసుపత్రికి వచ్చిన రోగులతో వారి సమస్యను అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులు పొంచి ఉన్న నేపథ్యంలో ప్రజలకు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పై అవగాహన కల్పించాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు అందుబాటులో ఉండాలని, మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ప్రభుత్వ దవాఖానల్లో అందించే సేవలపై అవగాహన కల్పించాలని, ప్రసవాలు జరిగేలా చూడాలని ఆదేశించారు.

GST NO: 36ACPPF9587L2ZM TELTEL/2013/5332
సమయజ్యోతి
ప్రతీ అక్షరం - ప్రజలకోసం
తెలుగు దిన పత్రిక

## సంపాదకీయం

# దేశాన్ని దారిలో పెట్టాల్సిన బాధ్యత యువతదే !

ఒకప్పుడు జాతీయ రాజకీయాల్లో దక్షిణాది నేతలదే హవాగా ఉండేది. ఇప్పుడు అంతగా కనిపించడం లేదు. ముఖ్యంగా తెలుగు వారు జాతీయ రాజకీయాల్లో అరుదుగా ఉన్నారు. క్రమంగా ఒక్కొకరే కనుమరుగు అవుతున్నారు. కొత్త తరం రావాల్సి ఉన్నా రావడంలేదు. యువత రాజకీయాల్లో రాణించాల్సి ఉంది. దేశం అనేక సమస్యలు ఎదుర్కొంటున్న వేళ కొత్త తరాన్ని ఆహ్వానించాలి. రాజకీయాల్లో కూడా రిజర్వేషన్లు రావాలి. రిజర్వేషన్లు వస్తేనే పదవులు పట్టుకుని వేలాడుతున్న వారి స్థానంలో కొత్త రక్తం వస్తుంది. సర్పంచ్ నుంచి, ఎమ్మెల్యేలు, ఎంపిలకు కాలపరిమితి విధించుకోవాల్సి ఉంది. దేశం మూస పద్దతిలో నడవడం వల్లనే బంగ్లాదేశం, నేపాల్‌లో తిరుగుబాట్లు వచ్చాయి. నేపాల్‌లో యువతే ముందుకు కదిలింది. రాజకీయ స్వార్థంతో తీసుకున్న నిర్ణయాలను నిరసించడం ద్వారా దేశాన్ని కదిలించారు. దేశం ఏదైనా పదవీకాంక్షతో చేస్తున్న రాజకీయాల వల్ల ఆ దేశం పురోగమించడం లేదు. మనదేశంలోనూ ఇలాంటి సమస్యలే ఉన్నాయి. వీటిని నిలదీయాల్సి ఉంది. అందువల్ల యువతరం కొత్త ఆలోచనలతో రాజకీయాల్లో అడుగు పెట్టాల్సి ఉంది. పివి నరసింహారావు, జైపాల్ రెడ్డి, పర్వతనేని ఉపేంద్ర, సీతారాం ఏచూరి, సురవరం సుధాకర్ రెడ్డి లాంటి నేతల మరణం తరవాత అంతగా ప్రభావితం చేయగలిగిన నేతలు రావడం లేదు. వెంకయ్యనాయుడు పదవీ విరమణ తరవాత రాజకీయాలకు పూర్తిగా దూరంగా ఉన్నారు. దీంతో తెలుగువారి పాత్ర అంతకంతకూ కనుమరుగు అవుతోంది. ముఖ్యంగా జాతీయ రాజకీయాల్లో తెలుగు వారి పాత్ర లేకుండా పోతోంది. పూర్వపు ఎన్‌డిఎలో చంద్రబాబు నాయుడు కన్వీనర్‌గా బాగానే రాణించారు. ఒకప్పుడు ప్రధాని, రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి స్థాయికి ఎదిగిన నేతలు ఇప్పుడు అక్కడ కనిపించడం లేదు. చక్రం తిప్పే స్థాయి నుంచి ..ఇప్పుడంతా తెరమరుగు అవుతూ వచ్చారు. గతేడాది సీతారాం ఏచూరి మరణం, మొన్నీ మధ్యనే వయోభారంతో సురవరం సుధాకర్ రెడ్డిల మరణంతో జాతీయస్థాయిలో నిలువగలిగిన నేతలు లేకుండా పోయారు. జాతీయ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన ఎర్రసూరీడు ఏచూరీ కూడా అస్తమించి ఏడాది కావస్తోంది. ఇంతకాలం ఓ తెలుగు నేత ఉన్నాడన్న ధీమా ఉండేది. చిమ్మ చీకటిలో మిణుమిణుకుమంటూ కనిపించే మిణుగురు పురుగులా సీతారం ఏచూరీ కనిపించేవారు. ఆయన జాతీయ రాజకీయాల్లో తనదైన ముద్ర వేశారు. ఒకప్పుడు సర్వేపల్లి రాధాకృష్ణ, నీలం సంజీవరెడ్డి, పివి నరసింహారావు, కోట్ల విజయ భాస్కర్ రెడ్డి వంటి ఉద్దండులు జాతీయ రాజకీయాల్లో తమదైన ముద్ర వేశారు. తరవాత జైపాల్ రెడ్డి, విద్యాసాగర్ రావు, వెంకయ్యనాయుడు, సురవరం సుధాకర్ రెడ్డి, సీతారాం ఏచూరిలు కనిపించేవారు. ఇప్పుడు ఒక్కొక్కరే అదృశ్యమవుతూ వచ్చారు. ఉపరాష్ట్రపతి పదవి విరమణ తరవాత వెంకయ్య నాయుడు కూడా జాతీయ రాజకీయాలకు దూరంగా ఉన్నారు. కరీంనగర్‌కు చెందిన సిహెచ్ విద్యాసాగర్ రావు కూడా గవర్నర్ పదవి తరవాత ఇంటికే పరిమితం అయ్యారు. సురవరం సుధాకర్ రెడ్డి కూడా సిపిఐ క్రియాశీల రాజకీయాల నుంచి తప్పుకున్నాక, ఇటీవలే మరణించారు. నిజానికి కెసిఆర్ జాతీయ రాజకీయాల్లో కొనసాగివుంటే మంచి నేతగా రాణించేవారు. ఆయన కూతురు కవితను జాతీయ రాజీయాల్లో కొనసగించినా ఆమె మంచి పట్టు సాధించేవారు. ఎందుకంటే కవిత మంచి ఇంగ్లీష్, హిందీ, ఉర్దూలలో మాట్లాడగలిగే సత్తా ఉన్న నేత. కానీ కెసిఆర్ ఎందుకనో ఆ వైపుగా ఆలోచించలేదు. ఇవాళ ఆమె ఢిల్లీ రాజకీయాల్లో ఉండివుంటే బిఆర్‌ఎస్‌కు ఇప్పుడీ దుర్గతి పట్టివుండేది కాదు. కెసిఆర్ స్వార్థ, కుటుంబ రాజకీయాల్లో పడిపోవడం వల్ల తనకున్న అవకాశాలను కోల్పోయారనే చెప్పాలి. తెలంగాణ సాధించిన తరవాత కుటుంబ రాజకీయాలను పక్కన పెట్టివుంటే కెసిఆర్ అద్భుతంగా రాణించే వారు. భాషాపటిమ, వాక్చాతుర్యం కూడా అద్భుతంగా ఉన్న నేతగా కెసిఆర్ దేశ ప్రజలకు సుపరిచితం.కుటుంబ రాజకీయాలతో ఆయన తనకున్న ఇమేజ్‌ను దెబ్బ తీసుకున్నారు. లేకుంటే జాతీయ రాజకీయాల్లో ఓ వెలుగు వెలిగేవారు. నిబద్ద రాజకీయాలు నడపకుంటే రాణించడం కష్టం. నిజాయితీ కూడా చాలా ముఖ్యం. అది లేకుంటే ఎంతటివారైనా కాల ప్రవాహంలో కొట్టుకు పోతారు. కెసిఆర్ తనయ కవిత కూడా మంచి వక్త. ఎంపిగా ఆమె బాగా రాణించారు. కానీ లిక్కర్ స్కామ్ ఆమె రాజకీయ ప్రస్థానంపై బురద జల్లింది. ఆ మరకను చెరిపేసుకోవడం అసాధ్యం. దీంతో ఆమె కూడా ఇక రాణించడం కష్టం. జాగృతి పేరుతో ఆమె రాజకీయాలు చేస్తున్నా..తెలంగాణలో ఆ కుటుంబం మొత్తం అవినీతి పంకిలంలో మునిగిన కారణంగా వారిని నమమడం కూడా కష్టమే. మొత్తంగా ఇప్పుడు జాతీయ రాజకీయాల్లో తెలుగువారు లేని లోటు స్పష్టంగా కనిపిస్తోంది. దీనిని పూడ్చాల్సిన బాధ్యత మనపైనే ఉంది. జాతీయ రాజకీయాల్లో మనపాత్ర లేకుంటే ఉత్తరాది వారి పెత్తనం సాగనుంది. ఇప్పటికే బిజెపిలో కేవలం గుజరాత్ పెత్తనమే సాగుతోంది. దేశంపై వారిద్దరే అజమాయిషీ చెలాయిస్తున్నారు. అమిత్ షాకు ఇంగ్లీష్ అంతగా వచ్చినట్లు ఎక్కడా చూడలేదు. కానీ హోంమంత్రిగా నెట్టుకు వస్తున్నారు. జాతీయ రాజకీయాల్లో రాణించాలంటే హిందీ, ఆంగ్లంపై పట్టుతో ముందుకు సాగాల్సి ఉంటుంది. అలాగే దేశ రాజకీయాలను ఔపోసన పట్టాలి. సమస్యలపై అవగాహన ఉండాలి. వాటిపై పోరాటం చేసే సత్తా ఉండాలి. అప్పుడే రాణించగలరు. తెలుగుదేశం నుంచి కేంద్ర విమానాయన మంత్రి బాధ్యతలు నిర్వహిస్తున్న రామ్మోహన్ నాయుడు కొంత లోటు పూడ్చే అవకాశాలు లేకపోలేదు. అయితే పార్టీ ఆయనకు పూర్తి స్వేచ్ఛను ఇచ్చినప్పుడే ఇది సాధ్యం. ఎందుకంటే రామ్మోహన్ నాయుడు కూడా బాగా చదువుకున్న వాడే కాకుండా యువకుడు. చంద్రబాబు ఆయనకు బాగానే ప్రోత్సాహం ఇస్తున్నారు. ఇంగ్లీష్, హిందీలపై బాగా పట్టు సాధించారు. సమస్యలపై అవగాహన ఉంది. అనర్గళంగా మాట్లాడే స్వభావం ఉంది. పార్లమెంటులో చర్చల్లో ఆయన బాగా రాణిస్తున్నారు. ఢిల్లీ స్థాయిలో పార్టీ వ్యవహారాల్లో కూడా రామ్మోహన్ నాయుడును ప్రోత్సహిస్తే తెలుగుదేశం పార్టీకి మంచి బలం లభించగలదు. తెలంగాణ కు చెందిన కెఆర్ సురేశ్ రెడ్డి కూడా మంచి వక్త. హిందీ, ఇంగ్లీష్‌లలో కూడా ఆయన దిట్ట. కానీ బిఆర్‌ఎస్ ఆయన వాణిని వినియోగంచు కోవడం లేదు. ఇకపోతే దక్షిణాదికే వస్తే...నిర్మలా సీతారామన్ కూడా మంచి వక్త. సమస్యలపై అవగాహన ఉన్న నేత. ఆంగ్లం, హిందీల్లో బాగా పట్టుంది. అయితే ఆమె కేవలం రబ్బర్ స్టాంప్ రాజకీయాలకు అలవాటు పడ్డారు. పార్టీ లైన్ కన్నా, మోడీ లైన్‌లోనే ఆమె మసలుకోవాల్సి ఉంది. ఈక్రమంలో యువత రాజకీయాల్లో రావడానికి మంచి అవకాశం ఉంది. అందుకు ప్రస్తుతం ఖాళీ కూడా ఉంది. దీనిని పూడ్చగలిగే సత్తా ఉన్న నేతలు ముందుకు సాగితే మంచిది.

# నేపాల్ యువతలో ప్రజ్వరిల్లిన ఆందోళన




సమయజ్యోతి ప్రత్యేకం తెలుగు దినపత్రిక

ఏ దేశ పాలకులు అయిన ప్రజల,యువత ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగించాలి - లేకపోతే వారి చేతిలో గుణపాఠం,తిరుగుబాటు తప్పదు అనే దానికి నేపాల్ లో జరిగిన హింసా ఖాండా నిదర్శనం అవినీతి,నిరుద్యోగం,నయా సంపన్న వర్గాల వైఖరి, సోషల్ మీడియా పై నిర్బంధం వెరసి నేపాల్ ప్రభుత్వంపై ప్రజలు,యువత తిరగబడ్డారు, గర్జించారు! ప్రభుత్వంలో అవినీతి మంత్రులపై వ్యతిరేఖత, నయా సంపన్న వర్గాల వైఖరి,సోషల్ మీడియాపై నిర్బంధం, నిరుద్యోగ సమస్య,ప్రజల వాక్ స్వాతంత్ర్యానికి కళ్లెం వేయడం వంటి ఇత్యాది కారణాలు వెరసి నేపాల్ దేశంలో వున్న యువత, ప్రజలు అక్కడి ప్రభుత్వంపై తిరుగుబాటు బావుట ఎగురవేశారు,యువ గర్జన చేశారు,ఓ అతి పెద్ద ఉద్యమానికి నాంది పలికారు.తద్వారా నేపాల్ దేశంలో ఆందోళన,అనారోగ్య,అశాంతి వాతావరణం నెలకొంది, హింస సైతం అక్కడ చేలరేగి 30 మంది విద్యార్థులు దుర్మరణం చెందడంతో ఇప్పుడు ఆ దేశంలో అగ్గికి ఆజ్యం పోసినట్లుగా నాయకత్వ మార్పు అవివార్యమైంది.ఇదేమాదిరి ఈ మధ్యకాలంలో అమెరికా ప్రెసిడెంట్ డోనాల్డ్ ట్రంప్ పై సైతం అక్కడి యువత తిరగబడ్డారు.అంతేకాదు గతంలో హంకాంగ్, శ్రీలంక,బంగ్లాదేశ్ దేశాలలో సైతం ఇలాగే ప్రజావ్యతిరేఖ నిర్ణయాలకు పాల్పడిన ప్రభుత్వంపై అక్కడి ప్రజలు,యువత ఓ పెద్ద ఉద్యమానికి,నిరసన కార్యక్రమానికి అంకురార్పణ గావించిన విషయం మనందరికి విధితమే.ముఖ్యంగా ఏ దేశ పాలకులు అయిన తమకు ఓటు వేసి గెలిపించిన ప్రజల పట్ల ఎంతో భాధ్యతగా వుంటూ వారి ఆశలకు,ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగించాలి.అలాకాకుండా తమ వద్దఅధికారం,మందిమార్భలం వుంది కదా తాము ఏమి చేసిన చెల్లుతుందనే దురహంకారంతో, నియంత్రత్వ వైఖరితో ప్రజా వ్యతిరేఖ నిర్ణయాలకు ఆజ్యం పోస్తే అయా దేశప్రజల కన్నెర్రకు గురికాకతప్పదు అనే దానికి నిదర్శనం ఈ నేపాల్ దేశ దారుణ పరిణామాలు. అంతేకాదు తమ కనుసన్నలతో న్యాయ,పోలీస్ వ్యవస్థ పనిచేస్తుందిలే అనే నిరంకుశ ధోరణిలో ప్రజల వాక్ స్వాతంత్ర్యాన్ని హరించేలా వ్యవ హరించడం,ప్రజా సమస్యలను,వారికి వచ్చే ఆపదలను విపత్తులను,వారికి ఎదురయ్యే దౌర్జన్యాలను, అక్రమాలను ప్రభుత్వం మరియు ప్రజల ముందుకు తీసుకువచ్చే,ఏకరువు పెట్టే జర్నలిస్ట్ ల పట్ల,మీడియా ప్రతినిధుల పట్ల దురుసుగా వ్యవహరించడం వంటి చర్యలకు ఏ దేశప్రభుత్వ పాలకులు పాల్పడిన అయా దేశ అశేష ప్రజల,యువత చేతుల్లో శృంగభంగం,గుణపాఠం,చేదు అనుభవం తప్పదు కాక తప్పదు.ఏదిఏమైనా ప్రస్తుత నేపాల్ దేశంలో సంభవించిన దారుణ,అన్యూహ పరిణామాలను చూసి ఏ దేశపాలకులు అయిన తక్షణమే నిద్రాణావస్థ నుండి తక్షణమే మేలుకోవాలి.అంటే అయా దేశ ప్రజల, యువత యొక్క కనీస అవసరాలు తీర్చేలా ఏ దేశ ప్రభుత్వ పాలకులు అయిన వ్యవహరించడమే కాదు చెప్పిన మాటకు,ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉండేలా ఓస్ఫూర్తిదాయకమైన,ఆదర్శ పాలనను ప్రజలకు అందించే భాద్యత ముమ్మాటికీ అయా దేశ పాలకుల భుజస్కందాలపై ఆధారపడి ఉంటుంది.అలాకాకుండా తమ పార్టీకి ఓట్లు వేసి గెలిపించిన ప్రజలను ఓ వెర్రి వెంగలయప్పలుగా భావించి ప్రజావ్యతిరేఖ నిర్ణయాలకు ఏ దేశ పాలకులు ఆజ్యం పోసిన అయా దేశప్రజల చేతిలో శృంగభంగం తప్పదు,వారి అగ్రహోజ్వాలలకు భంగపడకతప్పదు.ఏమైనా ఏ విధంగా చూసిన ప్రజల,యువత యొక్క మనోభావాలకు అనుగుణంగా,వారి కనీస అవసరాలు తీరేలా,వారు ఓ ప్రశాంతమైన వాతావరణంలో జీవించే వెసలుబాటు కల్పించేలా అయా దేశపాలకులు ఓ జనరంజక పాలనకు స్వీకారం చుట్టాలే తప్ప ప్రజా వ్యతిరేఖ పాలనకు పొరపాటున స్వీకారం చూడితే మాత్రం అయా దేశ ప్రజలు ఏ మాత్రం హర్షించరు అనే చేదు వాస్తవాన్ని ఏ దేశ పాలకులు అయిన ఎంత త్వరగా గ్రహిస్తే అంత మంచిది.ప్రజాస్వామ్యం వికసించాలి,ప్రజలు అత్యంత స్వేచ్ఛాపూరిత వాతావరణంలో జీవించేలా అయా దేశ పాలకులు తీవ్ర కృషి సల్పాలి,నిరంకుశ పాలనకు చరమగీతం పాడాలి.

**-కామిడి సతీష్ రెడ్డి**
**జయశంకర్ భూపాల్ పల్లి జిల్లా!**

# బండి సంజయ్ కుమార్.. మోడీ గిఫ్ట్ గా విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ: బిజెపి జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**



సిఎస్ఆర్ నిధులతో మోడీ గిఫ్ట్ కానుకగా కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ జన్మదినం సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు 20 వేల సైకిళ్లు పంపిణీ చేస్తున్నారు. ఇదే క్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం కేంద్రంలో శుక్రవారం బిజెపి జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి చేతుల మీదుగా 85 మంది విద్యార్థులకు సైకిళ్ళు పంపిణీ చేస్తూ మాట్లాడారు. ప్రభుత్వ స్కూళ్లలో చదువుకునే పిల్లలు పేద కుటుంబం నుండి వచ్చిన వాళ్లే ఉంటారనే విషయం తెలిసిందే. తమ ఇంటి నుండి స్కూల్ దాకా వెళ్లడానికి తగిన రవాణా సౌకర్యాల్లేక, ఆటోలు, బస్సులు వెళ్లే స్థోమత లేక ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా టెన్త్ క్లాస్ విషయానికొచ్చే సరికి స్కూల్ వేళలు ముగిసిన తరువాత స్పెషల్ క్లాస్ లకు హాజరు కావాల్సి ఉంటుంది. దీనివల్ల పొద్దుపోయేదాకా స్కూళ్లోనే ఉండాల్సి వస్తుంది. దీనిని ద్రుష్టిలో ఉంచుకుని టెన్త్ బాలబాలికలకు రవాణా ఇబ్బంది ఉండకూడదనే సదుద్దేశంతో బండి సంజయ్ కుమార్, ప్రధాని మోదీ కానుకగా సైకిళ్లను పంపిణీ చేయడం కొనియాడ దగ్గ విషయం పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ రాజి రెడ్డి, ఎస్ఐ సిహెచ్ గణేష్, మండల అధ్యక్షులు సౌల్ల క్రాంతి కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు మల్లారపు సంతోష్ రెడ్డి, జిల్లా కార్యదర్శి మీస సంజీవ్, మండల ప్రధాన కార్యదర్శులు గోపి, మహేశ్వరి, కస్తూరి కార్తీక్ రెడ్డి, మీస శంకర్, వంతడుపుల సుధాకర్, సందేవేని రాజు, పప్పుల శ్రీకాంత్, కోలా కృష్ణ, చిగురు వెంకన్న, కరెడ్ల రమేష్, మెంగని మహేందర్, కామిట్కర్ పద్మ హరిబాబు, అధ్యాపకులు, తల్లిదండ్రులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# సిఎం పైలెట్ ప్రజావాణి,జిల్లా స్థాయి అప్పీల్స్ పరిశీలన. - జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :**





జిల్లా ఆదిలాబాద్ కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరం నందు నిర్వహించిన సిఎం పైలెట్ ప్రజావాణి జిల్లా స్థాయి కార్యక్రమంలో వివిధ శాఖలకు సంబంధించిన అప్పీల్ దరఖాస్తులను జిల్లా కలెక్టర్ రాజర్షి షా స్వయంగా పరిశీలించారు.ఈ సందర్భంగా మండల్ లెవెల్ లో పరిష్కారం కానీ దరఖాస్తులు జిల్లా లెవెల్ లో పైలెట్ ప్రజావాణి నిర్వహించడం జరిగింది.ఇందులో నార్నూర్,ఉట్నూర్,జైనథ్,ఆదిలాబాద్ రూరల్ కు సంబంధించిన 38 మంది అర్జీదారులు తమ అర్జీలతో సమస్యల పరిష్కారానికి కలెక్టర్ కు విన్నవించారు.ఆయా శాఖలకు,రెవెన్యు కు సంబంధించిన దరఖాస్తులు స్వీకరించి దరఖాస్తుదారుని యొక్క సమస్య ను బట్టి పరిష్కారానికి వారం,పక్షం,నెల రోజులలో దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి నిర్ధిష్ట కాలపరిమితి లోపల పరిష్కారం చూపాలని సంబధిత అధికారులను ఆదేశించారు.దరఖాస్తుదారులతో జిల్లా కలెక్టర్ నేరుగా మాట్లాడి వారి సమస్యలపై వివరాలు సేకరించారు.ఈ సందర్భంగా వివిధ రకాల ఆయా శాఖల అర్జీదారుల దరఖాస్తులు రెవిన్యూ - 15,వ్యవసాయ శాఖ -11,మిషన్ భగీరథ - 5,విద్యుత్ - 5,పెన్షన్స్ - 3. ఈ పైలెట్ ప్రజావాణి లో ట్రైనీ కలెక్టర్ సలోని ఛాబ్రా,సీఈవో జితేందర్ రెడ్డి,డిఆర్డీఓ రవీందర్,సంబధిత అధికారులు,అర్జీదారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల్లో శాస్త్రీయ వైఖరులు పెంపొందించాలి

**సమయజ్యోతి ప్రతినిధి భూపాల్ పల్లి**



విద్యార్థుల్లో ఉపాధ్యాయులు శాస్త్రీయ వైఖరులు పెంపొందించాలని మహా దేవ్ పూర్ బాలుర స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఆర్ అనిల్ కుమార్ అన్నారు బయాలజీ టీచర్ల ఒక రోజు శిక్షణ కార్యక్రమం మహదేవు పూర్ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగింది శిక్షణ కార్యక్రమము లో వారు మాట్లాడుతూ ఖాన్ ఆకడమీ ద్వారా విద్యార్థులకు సులభంగా అర్థవంతంగా గుర్తిండి పోయేలా ఖాన్ అకాడమీ పాఠాలు రూపొందించినది అని నేర్చుకున్న అంశాలను తరగతి గదుల్లో అమలు చేయాలని అన్నారు బయాలజీ టీచర్లు ఆయా పాఠశాలల్లో అంకిత భావం తో పనిచేసి విద్యా ప్రమాణాలు పెంచాలని అన్నారు ఈ కార్యక్రమం లో రిసోర్స్ పర్సన్స్ బయాలజీ ఫోరం జిల్లా అధ్యక్షులు బి ప్రభాకర్ రెడ్డి కుర్రి శ్రీనివాస్ రాచకొండ భాస్కర్ పలు విషయాల మీద అవగాహన కల్పించారు బయాలజీ టీచర్లు సమ్మయ్య బొమ్మన తిరుపతి రెడ్డి కిషన్ నాయక్ కామిడి సతీష్ రెడ్డి కుసుమ వెంకటేశ్వర్లు పాకాల శ్రీనివాస్ రెడ్డి రవీందర్ ధార వెంకటేశ్వర్లు దయానంద స్వామి డా వసుధ ప్రియ కొమ్మ జ్యోతి మేరీ బాయి సువర్ణ సంధ్య జై రాజ్ శ్రీనివాస్ గోపి నాయక్ రాజు పాల్గొన్నారు నూతనంగా కాంప్లెక్స్ పాఠశాల హెచ్ ఎం గా వచ్చిన అనిల్ కుమార్ మరియు ఇటీవల డాక్టరేట్ సాధించిన వసుధ ప్రియ ను బయాలజీ స్కూల్ అసిస్టెంట్ గా పదోన్నతి పొందిన గోపి నాయక్ ను బయాలజీ ఫోరం సభ్యులు ఘనంగా సన్మానించారు

# శక్తివంతంగా నారీ శక్తి..కమ్యూనిటీ పోలీసింగ్‌లో కీలక పాత్ర: ఎస్పీ డా. జానకి

**సమయజ్యోతి న్యూస్ నిర్మల్ బ్యూరో సెప్టెంబర్ 12.**



"నారి శక్తి" కార్యక్రమం నిర్మల్ జిల్లా పోలీస్‌చే శక్తివంతంగా కొనసాగుతోంది. జిల్లా ఎస్పీ డా. జి.జానకి శర్మిల ఆధ్వర్యంలో మహిళా పోలీసులు కమ్యూనిటీ పోలీసింగ్‌లో కీలక పాత్ర పోషిస్తున్నారు.ప్రతి వారం నిర్వహించే వారాంత "నారి శక్తి" కార్యక్రమం భాగంగా, ఈ వారం మహిళా పోలీసు సిబ్బంది తీవ్ర పహారా విధులు నిర్వహించి, బ్లూ కాల్ట్ మరియు డయల్ 100 అత్యవసర కాల్స్‌కి వెంటనే స్పందించారు. బాధితులు తెలిపిన సమస్యలను ఆలస్యం లేకుండా పరిష్కరించారు.అలాగే, వారు గ్రామాల్లోని పాఠశాలలను సందర్శించి పిల్లలకు సైబర్ క్రైమ్‌లపై అవగాహన కల్పించారు. ప్రజలతో మమేకమై ట్రాఫిక్ నియమాలు, అప్రాయపు డ్రైవింగ్ ప్రమాదాలు, మద్యం సేవించి వాహనం నడపడం, హెల్మెట్ లేకుండా ప్రయాణం వంటి విషయాలపై విస్తృత ప్రచారం చేశారు.ఇక గ్రామాల్లో పర్యటించి కల్తీ మద్యం, డ్రగ్ వాడకం, అక్రమ రవాణా వంటి ప్రమాదాలపై ప్రజల్లో జాగ్రత్తలు తీసుకునేలా సున్నిత అవగాహన కల్పించారు.వాహన తనిఖీలు, మద్యం సేవించి వాహనం నడిపే వారిపై పరీక్షలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకున్నారు.జిల్లాలోని ప్రతి పోలీస్‌స్టేషన్ నుండి మహిళా పోలీసులు ఉత్సాహంగా పాల్గొని, ఈ కార్యక్రమం ద్వారా ప్రజల భద్రత, సురక్షిత వాతావరణం పట్ల శాఖ కట్టుబాటు మరింత బలపడింది.

# మండల స్థాయి టీఎల్ఎం మేళా పోటీలు

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ**

బాల్కొండ మండల కేంద్రంలోని జడ్పి ఉన్నత పాఠశాల కిసాన్ నగర్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మండల స్థాయి టీఎల్ఎం మేళా నిర్వహించారు. ఉపాధ్యాయులు తెలుగు ఇంగ్లీష్ గణితం విజ్ఞానం అంశాలపై సరళ బోధన సామాగ్రిని ప్రదర్శించగా, వాటిల్లో ఉత్తమమైన పదింటిని జిల్లా స్థాయికి ఎంపిక చేసినట్లుగా ఎంఈఓ బట్టు రాజేశ్వర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ న్యాయ నిర్ణీతలు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కృష్ణవేణి, వన్నెల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ప్రధానోపాధ్యాయులు రాజేశ్వర్ రెడ్డి లు న్యాయ నిర్ణయితలుగా వ్యవహరించారు




# సాంఘిక శాస్త్ర కాంప్లెక్స్ సమావేశాలు

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ**

బాల్కొండ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కిసాన్ నగర్ జెడ్పి ఉన్నత పాఠశాలలో శుక్రవారం సాంఘిక శాస్త్ర కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించారు. ఎంఈఓ బట్టు రాజేశ్వర్ మాట్లాడుతూ కాంప్లెక్స్ సమావేశాల ప్రయోజనాన్ని వివరించారు. లక్ష్యాన్ని అధిగమించాలని సూచించారు. సమావేశంలో కాంప్లెక్స్ హెచ్ఎంలు కృష్ణవేణి, రాష్ట్ర రిసోర్స్ పర్సన్స్ వేల్పూర్ శ్రీనివాస్ క్యాతం నరేందర్, ఆలూర్ ఆర్మూర్ బాల్కొండ మెండోరా, ముక్కాల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# 16న జిల్లా అభివృద్ధి సమన్వయ, మానిటరింగ్ కమిటీ (దిశ) సమావేశం


**సమయజ్యోతి న్యూస్ నిజామాబాద్, సెప్టెంబర్ 12 :**

సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో ఈ నెల 16న ఉదయం 10.30 గంటలకు నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్ అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమన్వయ, మానిటరింగ్ కమిటీ (దిశ) సమావేశం జరగనుందని డీఆర్డీఓ సాయాగౌడ్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నిధులచే వివిధ శాఖల ద్వారా అమలవుతున్న పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై దిశ సమావేశంలో చర్చించడం జరుగుతుందని అన్నారు. సంబంధిత శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

# ఎం.ఎం.పీ.టీ.ఎఫ్ అమలుకు సహాయ సహకారాలు అందిస్తాం:కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి

**సమయజ్యోతి న్యూస్**

**నిజామాబాద్, సెప్టెంబర్ 12 :**




వలసదారులు, దుర్బల కుటుంబాల స్థితి స్థాపకతను మెరుగుపర్చాలనే లక్ష్యంతో యుఎన్ఓ ద్వారా ప్రయోగాత్మకంగా నిజామాబాద్ జిల్లాలో అమలు చేస్తున్న మైగ్రేషన్ మల్టీ పార్ట్ నర్ ఫండ్ (ఎం.ఎం.పీ.టీ.ఎఫ్) కార్యక్రమాన్ని పక్కాగా అమలు పరుస్తూ, నిర్దేశిత లక్ష్యాలు సిద్ధించేలా జిల్లా యంత్రాంగం తరపున పూర్తిస్థాయిలో సహాయ సహకారాలు అందిస్తామని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమం అమలు విషయమై సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో జిల్లా స్థాయి కమిటీ సభ్యులతో కలెక్టర్ శుక్రవారం సమీక్ష సమావేశం జరిపారు. ఈ కార్యక్రమం ఉద్దేశ్యం, పైలెట్ ప్రాజెక్టుగా జిల్లాలోని సిరికొండ, ధర్పల్లి మండలాలను ఎంపిక చేయడానికి గల కారణాలు, ఎంఎంపీటీఎఫ్ ను అమలు చేస్తున్న విధానం, యూఎన్ఓ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి అందించే తోడ్పాటు తదితర అంశాలపై చర్చించారు. జిల్లాలో వలసదారులు, దుర్బల కుటుంబాల స్థితిగతులలో మార్పును తేవాలనే సంకల్పంతో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని సమర్ధవంతంగా అమలయ్యేలా జిల్లా యంత్రాంగం ద్వారా పూర్తిస్థాయిలో సహాయ సహకారాలు అందిస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. పూర్తి పారదర్శకంగా ఈ ప్రాజెక్టు అమలయ్యేలా చూస్తామని అన్నారు. సమావేశంలో జెడ్పి సీ.ఈ.ఓ సాయాగౌడ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోవిందు, డీపీఆర్ఓ ఎన్.పద్మశ్రీ, ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాస్, డీడబ్ల్యూఓ రసూల్ బీ, డీపీఓ శ్రీనివాస్, పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు రోహిత్ రెడ్డి, జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి మధు సూదన్, కార్మిక శాఖ అధికారి యాదయ్య,యూఎన్ఓ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# జీవనోపాధి, వ్యవసాయం విభాగం సెర్ప్ సమావేశం

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ**

జీవనోపాధి, వ్యవసాయం విభాగం (సెర్ప్) ప్రాజెక్టు మేనేజర్ డా.నేహా ఆధ్వర్యంలో బోర్డ్ డైరెక్టర్లు సతీష్, రవీందర్ రావు, శిరీష సమావేశం నిర్వహించారు. సమావేశంలో మొక్క జొన్న కొనుగోలు, పసుపు ప్రాసెసింగ్ ట్రేడింగ్ ఏర్పాటు చేసుకోవాలని, రైతులకు ఉపయోగపడే వ్యాపారాలు కూడా చెయ్యాలని తగు సూచనలు ఇచ్చారు. ఆర్మూర్ మండలంలోని చేపల పెంపకం ఫిష్ పాండ్ ను పరిశీలించారు. ముప్కాల్ మండలంలో నాటు కోళ్ళ పెంపకం మదర్ యూనిట్ ని, డైరీ యూనిట్ ని సందర్శించారు. ఈ కార్యక్రమం లో డిపిఎం రాచయ్య, ఏపీఎంలు, గంగారం ,భుమేష్, హిమబాల, రవి, ఎఫ్పీసీ చైర్పర్సన్ గంగామల్లు, సీఈవో నరేష్, ఐకెపి సిబ్బంది పాల్గొన్నారు.



# వ్యర్థాలను డిస్పోస్ చేయని ఆసుపత్రులపై చర్యలు

## అధికారులను ఆదేశించిన కలెక్టర్

**సమయజ్యోతి న్యూస్ నిజామాబాద్, సెప్టెంబర్ 12**

ఆసుపత్రుల వ్యర్థాలను నిబంధనలకు అనుగుణంగా సరైన విధానంలో డిస్పోస్ చేయని హాస్పిటల్స్ పై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. జక్రాన్ పల్లి మండలం పడకల్ గ్రామ శివారులో శ్రీ మెడికేర్ సర్వీసెస్ ఏజెన్సీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెడికల్ వేస్టేజీని నిర్వీర్యం చేసే ప్లాంట్ ను కలెక్టర్ శుక్రవారం సందర్శించారు. ప్రతి రోజు ఎన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల నుండి వ్యర్థాలను సేకరిస్తున్నారు, వాటిని ఎలా నిర్వీర్యం చేస్తున్నారు అని వివరాలు అడిగి తెలుసుకుని రికార్డులను తనిఖీ చేశారు. జిల్లాలో 900 వరకు ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు కొనసాగుతుండగా, సగానికి పైగా ఆసుపత్రుల నుండి వ్యర్థాలను సేకరించడం లేదని కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసుపత్రుల వ్యర్థాలను హాస్పిటల్స్ నుండి ఏజెన్సీ వారు ప్రతిరోజూ సేకరిస్తూ ఈ ప్లాంట్ లో నిర్వీర్యం చేయాల్సి ఉండగా, ఈ ప్రక్రియ పూర్తి స్థాయిలో ఎందుకు నిర్వహించడం లేదని నిలదీశారు. మెడికల్ వేస్టేజీని పక్కాగా సేకరించని కారణంగా ప్రైవేట్ ఆసుపత్రులకు చెందిన అనేక మంది వ్యర్థాలను ఎక్కడబడితే అక్కడ పారవేస్తున్నారని, ఇది ప్రజల ఆరోగ్యాలకు ప్రమాదకరంగా పరిణమిస్తుందని కలెక్టర్ ఆందోళన వ్యక్తం చేశారు. కాంట్రాక్ట్ ఏజెన్సీకి వ్యర్థాలు అందించని ఆసుపత్రులకు నోటీసులు జారీ చేయాలని, అయినప్పటికీ మెడికల్ వేస్టేజీ విషయంలో నిబంధనలు అమలు చేయకపోతే అలాంటి ఆసుపత్రుల అనుమతులను రద్దు చేయాలని కలెక్టర్ డీఎంహెచ్ఓ డాక్టర్ రాజశ్రీని ఆదేశించారు. అదేవిధంగా ఒప్పంద సేవలు కలిగి ఉన్న జిల్లాలోని అన్ని ఆసుపత్రుల నుండి వ్యర్థాలను కాంట్రాక్ట్ ఏజెన్సీ ప్రతిరోజు సేకరించేలా పకడ్బందీ పర్యవేక్షణ చేయాలని, ఒకవేళ వ్యర్థాల సేకరణలో నిర్లక్ష్యంగా వ్యవరిస్తే ఏజెన్సీని రద్దు చేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. వ్యర్థాలను నిర్వీర్యం చేసే పనులలో పాల్గొంటున్న సిబ్బంది ఆరోగ్య పరిరక్షణ విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, వారు అనారోగ్యాల బారిన పడకుండా తగిన టీకాలు ఇప్పించాలని ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. ఏజెన్సీ పనితీరును క్రమం తప్పకుండా పర్యవేక్షణ జరపాలని కాలుష్య నియంత్రణ మండలి ఏ.ఈ మానసను ఆదేశించారు.



# సెంట్రల్ డ్రగ్స్ స్టోర్ తనిఖీ చేసిన కలెక్టర్

**సమయజ్యోతి న్యూస్ నిజామాబాద్, సెప్టెంబర్ 12 :**

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని గంగాస్తాన్ ఫేజ్-1 లో గల సెంట్రల్ డ్రగ్స్ స్టోర్ (సి.డీ.ఎస్)ను కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సి.డీ.ఎస్ లో రికార్డులలో పొందుపరచిన దానికి అనుగుణంగానే ఔషధ నిల్వలు అందుబాటులో ఉన్నాయా అని పరిశీలించారు. ఔషధాలను ఎక్కడి నుండి సమకూరుస్తారు, సి.డీ.ఎస్ ద్వారా వివిధ పీ.హెచ్.సిలకు వాటిని ఎలా చేరవేస్తారు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇండెంట్ వచ్చిన వెంటనే తాత్సారం చేయకుండా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ఔషధాలు పంపించాలని, ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలె ప్రమాదం ఉన్నందున అన్ని రకాల ఔషధాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఫార్మసిస్ట్ గంగాధర్ ను ఆదేశించారు.




# డిఫాల్ట్ మిల్లర్లపై రెవెన్యూ రికవరీ యాక్టు అమలు చెయ్యండి కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి

**సమయజ్యోతి న్యూస్ నిజామాబాద్, సెప్టెంబర్ 12 :**

సీ.ఎం.ఆర్(కస్టమ్ మిల్లింగ్ రైస్) అందించడంలో విఫలమైన డిఫాల్ట్ రైస్ మిల్లర్లపై నిబంధనల మేరకు రెవెన్యూ రికవరీ యాక్టును అమలుపర్చాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి తహసీల్దార్ లను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుండి కలెక్టర్ తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. డిఫాల్ట్ మిల్లర్లపై ఇప్పటివరకు చేపట్టిన చర్యలు, వారి నుండి రావాల్సిన మొత్తం ఎంత, ఇప్పటి వరకు ఎంత రికవరీ చేశారు తదితర వివరాలను ఒక్కో డిఫాల్ట్ రైస్ మిల్ వారీగా సంబంధిత మండల తహసీల్దార్ ను అడిగి తెలుసుకున్నారు. డిఫాల్ట్ రైస్ మిల్లులతో పాటు, మిల్లర్లకు చెందిన ఆస్తులను బ్లాక్ చేయించాలని, అవసరమైతే ఆస్తులను వేలం వేసి సీఎంఆర్ నిధులను రాబట్టే దిశగా చర్యకు తీసుకోవాలని కలెక్టర్ కరాఖండిగా తేల్చి చెప్పారు. సీ.ఎం.ఆర్ నిధులు పూర్తి స్థాయిలో రికవరీ కావాల్సిందేనని, నిబంధనల ప్రకారం కఠిన చర్యలతో ముందుకు వెళ్లాలని సూచించారు. ఇకనుండి తాను సీఎంఆర్ రికవరీపై ప్రతీ వారం సమీక్ష జరుపుతానని, ఎప్పటికప్పుడు ప్రగతి కనిపించాలని అన్నారు. ఈ సందర్భంగా భూభారతి పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ తహసీల్దార్లను ఆదేశించారు. జాతీయ కుటుంబ ప్రయోజన పథకానికి అర్హులైన వారు దరఖాస్తు చేసుకునేలా చూడాలన్నారు. కొత్త రేషన్ కార్డుల కోసం, సభ్యుల పేర్లను చేర్చాలని కోరుతూ వచ్చే దరఖాస్తులను వెంటనే పరిశీలిస్తూ, అర్హులైన వారికి ఆమోదం తెలుపాలని అన్నారు. ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పక్కాగా విచారణ చేయాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, డీఎస్ఓ అరవింద్ రెడ్డి, సివిల్ సప్లైస్ డీఎం శ్రీకాంత్ రెడ్డి, కలెక్టరేట్ డీ-సెక్షన్ సూపరింటెండెంట్ శ్రీనివాస్, అన్ని మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.




# పదోన్నతులలో లెఫ్ట్ ఓవర్ వేకెన్సీ పోస్టులు భర్తీ చేయాలి

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

ఉపాధ్యాయ పదోన్నతులలో మిగిలిపోయిన లెఫ్ట్ ఓవర్ వేకెన్సీ/నాన్ జైనింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని శుక్రవారం బిసిటిఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్లమ్మల లక్ష్మణ్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు వికుర్తి లక్ష్మీనారాయణ, రాష్ట్ర కార్యదర్శి బండారు మల్లేశం, జిల్లా అధ్యక్షులు పులి రామ్ గోపాల్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇటికాల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



# పాడి పశువుల యూనిట్లను సద్వినియోగం చేసుకోవాలి

## : కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డి

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

పాడి పశువుల యూనిట్లను సద్వినియోగం చేసుకొని, ఆర్థిక వనరులను వృద్ధిపర్చుకోవాలని సిరిసిల్ల నియోజకవర్గం కేకే మహేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఆయన రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం నామాపూర్ గ్రామంలో శుక్రవారం జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ స్వప్న, మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఏళ్ల బాల్రెడ్డి, ఏఎంసి చైర్మన్ తలారి రాణి నర్సింహులు, వెటర్నరీ వైద్యురాలు నిఖిల లతో కలిసి ఎస్సీ కార్పొరేషన్ 24 యూనిట్ల పాడి పశువులను లబ్ధిదారులకు అందజేస్తూ మాట్లాడారు. హర్యానా పాడి గేదెల పెంపకంలో మెలుకువలు పాటించాలని, వీటితో రోజుకు 2 వేల ఆదాయం అందుతుందని, పాడి పశువులకు బీమా సౌకర్యం కల్పించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి వైస్ చైర్మన్ వెలుముల రామ్ రెడ్డి, ఎంపీడీవో లచ్చాలు, కాంగ్రెస్ శ్రేణులు కొండం రాజిరెడ్డి, గజ్జల రాజు, గుండెల్లి శ్రీనిగౌడ్ గౌడ్, ఉచ్చిడి బాల్ రెడ్డి, ఎం.శ్రీనివాసు, శీల ప్రశాంత్, రంజాన్ నరేష్, భాను, పశువైద్య సిబ్బంది, విజయ్ గోపాల్మిత్ర భాస్కర్, శ్రీకాంత్



# కర్ణాటక బస్సును ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతి

**సమయజ్యోతి న్యూస్ కృష్ణ... నారాయణపేట జిల్లా**

కర్ణాటక బస్సును ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం కృష్ణ మండలంలోని కృష్ణ బ్రిడ్జి పై జరిగింది. కృష్ణ ఎస్సై నవీద్ తెలిపిన వివరాల ప్రకారం శక్తి నగర్ గ్రామానికి చెందిన సుగుర్ రెడ్డి వయసు 40 సంవత్సరాలు సాయంత్రం నాలుగు గంటల సమయంలో టై రోడ్డు నుండి శక్తినగర్ కు ద్విచక్ర వాహనంపై అతివేగంతో వెళ్తుండగా కర్ణాటక బస్సును ఢీకొన్నాడు. ప్రమాదంలో రెండు కాళ్లు విరిగిపోయాయి. గాయపడిన వ్యక్తిని అంబులెన్స్ సిబ్బంది రాయచూరు ప్రభుత్వ ఆసుపత్రి (రిమ్స్) తరలించగా మార్గమధ్యంలో చనిపోయాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్సై తెలిపారు.



# గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ పనులు సమయానికి పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశం

**సమయజ్యోతి న్యూస్ నిర్మల్ బ్యూరో సెప్టెంబర్ 12.**

జిల్లా కలెక్టర్ నిర్మల్అభిలాష అభినవ్ జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న పనులన్నీ నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్లో వివిధ ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించిన కలెక్టర్, అంగన్వాడీ భవనాలు, పాఠశాల మరుగుదొడ్లు, ఉద్యోగ హామీ పథకం నిధులతో జరుగుతున్న పనులపై అధికారుల నుండి సమగ్ర సమాచారం సేకరించారు.పనుల అమలు పై అధికారులు వ్యక్తిగతంగా పర్యవేక్షణ చేయాలని, ప్రజలకు ఉపయోగపడేలా తక్షణ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. అభివృద్ధి కార్యక్రమాలు సమయానికి పూర్తయ్యేలా నిర్లక్ష్యం, ఆలస్యం ఏవీ సహించబోవని ఆమె స్పష్టం చేశారు.ఈ సమీక్షా సమావేశానికి డి ఆర్ డి ఓ విజయలక్ష్మి, పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చందునాయక్ మరియు ఇతర శాఖాధికారులు హాజరయ్యారు.



# 15, 16న డిగ్రీ కళాశాలలో నేరుగా ప్రవేశాలు

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ**

బాల్కొండ మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న బి.ఎ. హెచ్-33, బి.కాం(సి.ఎ)-33, బి.ఎస్సీ (లైఫ్ సైన్సెస్) 33, బి.ఎస్సీ (ఫిజికల్ సైన్స్) - 47 గ్రూపుల్లో నేరుగా ప్రవేశాలకై, ఈనెల 15, 16 తేదీల్లో సంప్రదించాలని శుక్రవారం ఇన్చార్జి ప్రిన్సిపల్ డా.వై. వేణు ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.10వ మెమో, ఇంటర్ మెమో, ఆధార్ కార్డుకుల ధృవీకరణ పత్రం, ఆదాయ ధృవీకరణ పత్రంబదిలీ ధృవీకరణ పత్రం, 6 నుండి ఇంటర్ బోనఫైడ్ సర్టిఫికేట్లు, 2 పీపీ ఫోటోలు వెంట తీసుకురావాలన్నారు.

# ఏక్ పేడ్ మా కే నామ్

**సమయజ్యోతి న్యూస్ కృష్ణ... నారాయణ పేట జిల్లా**

భారత ప్రభుత్వం మరియు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన ఏక్ పేడ్ మా కే నామ్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ముడుమాల్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణంలో శుక్రవారం మేగా ప్లాంటేషన్ ను 1నుండి 5వ తరగతి వరకు నిర్మాణాత్మక మూల్యాంకనం(యఫ్ఏ -1)లో తెలుగు, ఇంగ్లీషు, గణితం, పరిసరాల విజ్ఞానం విషయాల యందు ఉత్తమ ప్రతిభ కనబర్చిన మొదటి ర్యాంకు విద్యార్థులతో వారి తల్లిదండ్రుల పేర్ల మీద మునగ, మిక్సిడ్ రాయల్ గ్రీన్ మరియు అశోక మొక్కలను నాటించడం జరిగింది. ప్రధానోపాధ్యాయుడు దండు శేఖర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చెట్లను పెంచి పర్యావరణాన్ని కాపాడాలని వివరించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దండు శేఖర్, పంచాయతీ కార్యదర్శి రాజు, ఉపాధ్యాయ బృందం,ఆరోగ్య సిబ్బంది, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.



# జిపి కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నదాస్ గణేష్ పేర్కొన్నారు. ఆయన ముస్తాబాద్ మండల కేంద్రంలో శుక్రవారం పంచాయతీ కార్మికులతో కలిసి నిరసన తెలిపిన సందర్భంగా మాట్లాడారు. నెలనెలా జీతాలు చెల్లించాలని, కనీస వేతనం 26వేలు చెల్లించాలని, ఉద్యోగాలు రెగ్యులరైజేషన్ చేయాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ మండల అధ్యక్షులు లోకిని శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి పల్లాటి బాబు, జల్లి లక్ష్మణ్, బడుగు బిక్షపతి, రాజు, స్వరూప, దేవరాజు మెరుగు లక్ష్మి, రాజు, కార్మికులు పాల్గొన్నారు.



# కలెక్టరేట్ భవనాన్ని పరిశీలించిన ప్రభుత్వ నిపుణుల కమిటీ

**సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :**

జిల్లా ఆదిలాబాద్ కలెక్టరేట్ కార్యాలయ భవనం పై అంతస్తు కూలిన ఘటన స్థానికుల్లో కలకలం రేపింది.అయితే ఈ ఘటన పై విచారణ జరుపడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ శుక్రవారం పరిశీలన జరిపింది.హైదరాబాద్ నుండి వచ్చిన నిపుణుల కమిటీ,ఆర్ అండ్ బి అధికారులతో కలిసి కూలిపోయిన భవన భాగాలను,అలాగే మిగతా భవనాన్ని క్షుణ్ణంగా పరిశీలన చేశారు.భవనం వినియోగానికి పనికొస్తుందా లేదా అనే విషయంపై సమగ్ర సమీక్షను జరిపి,పూర్తిస్థాయి నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామని కమిటీ సభ్యులు తెలియజేశారు.



# మేడారంలో ఆధునీకరణ పనులు

## మంత్రులు,అధికారులతో పొంగులేటి సమీక్ష

## సిఎం ఆమోదం తీసుకుని వందరోజుల్లో పూర్తి

**హైదరాబాద్,సెప్టెంబర్12(సమయజ్యోతి):**

ఆసియా ఖండంలో అత్యంత ప్రసిద్ధిగాంచిన సమ్మక్క, సారలమ్మ దేవాలయాన్ని గిరిజన సంస్కృతి సంప్రదాయాలు వారి మనోభావాలకు అనుగుణంగా ఆధునీకరణను చేపడుతున్నామని ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు ఆధునీకరణకు సంబంధించిన మాస్టర్ ప్లాన్ పై శుక్రవారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో పంచాయితీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఎస్.సి. అభివృద్ధి మైనారిటీ- సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు బలరామ్ నాయక్ తో కలిసి మంత్రి సమీక్షించారు.

# సమకాలీన రాజకీయాల్లో సమున్నత నేత

## దేశం కోసం పరితపించిన సీతారాం ఏచూరి

## ప్రథమ వర్ధంతి సందర్భంగా నివాళి

హైదరాబాద్,సెప్టెంబర్12(సమయజ్యోతి):

సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారం ఏచూరి మరణించి అప్పుడే ఏడాది పూర్తయ్యింది. గతేడాది సెప్టెంబర్ 12 మరణించిన ఏచూరి జాతీయ రాజకీయాల్లో తనదైన ముద్ర వేశారు. ఆయన పోయిన ఏడాది లోపే ఇటీవల సిపిఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి కూడా వయోభారంతో గతించారు. కానీసీతారం మాత్రం అనూహ్యంగా మరణించారు. ఇకపోతే సీతారాం ఏచూరి మరణం తెలుగువారికి తీరని లోటు. నిబద్ధ రాజకీయాలకు ఆయన పెట్టింది పేరు. అహంకారం కనిపించని మృదుస్వభావిగా జాతీయ రాజకీయాల్లో రాణించారు. సిపిఎం లాంటి పార్టీకి సారథిగా రాణించడం ఆషామాషీ వ్యవహారం కాదు. సమకాలీన రాజకీయాల్లో మంచి పట్టు ఉండడంతో పాటు, పలు భాషల్లో ప్రావీణ్యం సంపాదించడం, ముక్కుసూటిగా మాట్లాడడం, అవసరమున్నంత మేరకే మాట్లాడడం ద్వారా జాతీయ రాజకీయాల్లో ఏచూరి తనదైన ముద్ర వేసారు. జీవితంలో ఆయన ఎక్కడా రాజీపడలేదు. దేశ సమస్యలపై పోరాటం విషయంలో ఆయన రాజీలేని ధోరణితోనే రాజకీయాలు సాగించారు. సంకీర్ణ రాజకీయాలలో సీపీఐ (ఎం) నిర్వహించిన పాత్ర ఎనలేనిది. దానిని ఏచూరి మరింతగా ముందుకు తీసికెళ్లారు. 1996లో యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం కోసం కాంగ్రెస్ నేత పి. చిదంబరంతో కలిసి కనీస ఉమ్మడి కార్యక్రమం ముసాయిదాను రూపొందించారు. 2004లో యూపీఏ ప్రభుత్వ ఏర్పాటు సమయంలో సంకీర్ణ కూటమి నిర్మాణంలో క్రియాశీలక పాత్ర పోషించారు. ప్రజల ప్రాథమిక హక్కుల పరిరక్షణ కోసం ఆయన అలుపెరుగని పోరాటం చేశారు. 'భిన్నత్వంలో ఏకత్వం' అనే సిద్ధాంతాన్ని విశ్వసించారు. దేశంలో ఎక్కడ హింస జరిగినా దానికి వ్యతిరేకంగా గళం విప్పే వారు. పార్టీ అంతర్జాతీయ విభాగానికి ఏచూరి నేతృత్వం వహించారు. పలు సోషలిస్ట్ దేశాలలో పార్టీ మహాసభలు జరిగినప్పుడు సౌహార్ధ ప్రతినిధిగా ఆయన హాజరయ్యేవారు.ఏచూరి 2005లో పశ్చిమ బెంగాల్ నుండి రాజ్యసభకు ఎన్నికయ్యారు. అనేక కీలక అంశాలను పార్లమెంట్ దృష్టికి తెచ్చే వారు. ముఖ్యమైన విషయాలపై ప్రశ్నలు సంధించే వారు. పార్లమెంట్ సమావేశాలకు తరచూ అంతరాయం కలిగిస్తున్నారంటూ పాలక పక్షం విమర్శలు చేస్తుంటే 'సమావేశాలకు ఆటంకం కలిగిస్తున్నాయని ప్రతిపక్షాలను నిందించడం ద్వారా ప్రభుత్వం తన బాధ్యతల నుండి తప్పించుకోలేదు' అని బదులిచ్చారు. పార్లమెంటును అడ్డుకోవడం ప్రజాస్వామ్యంలో చట్టబద్ధమైన ప్రక్రియ అని చెప్పారు. భారత్-అమెరికా అణు ఒప్పందం కోసం సంప్రదింపులు జరుగుతున్న సమయంలో దానికి తమ పార్టీ విధించిన అన్ని షరతులను ఏచూరి రాజ్యసభలో ప్రస్తావించారు.



జెఎన్‌యూ విద్యార్థిగా ప్రస్థానం మొదలు పెట్టిన సీతారం ఏచూరి సిపిఎం పార్టీకి జనరల్ సెక్రటరీగా అద్వితీయమైన భూమిక పోషించారు. భారత రాజకీయాల్లో తనకంటూ ఓ పేజీని లిఖించుకున్నారు. ఆయన పాత్ర చిరస్మరణీయం. ఏచూరి తెలుగువాడు కావడం మనకు గర్వకారణం.

# పూర్తి కావస్తున్న బతుకమ్మ కుంట పనులు

## ఈసారి అక్కడే బతుకమ్మ ఉత్సవాలకు ప్లాన్

## యాకుతుపురా ఘటనపై బాధ్యులపై చర్యలు

## హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పష్టీకరణ

హైదరాబాద్,సెప్టెంబర్12(సమయజ్యోతి):

బతుకమ్మ కుంట పనులు పూర్తి కావొస్తున్నాయని, త్వరలో సీఎం ఆధ్వర్యంలో బతుకమ్మ కుంట ప్రారంభిస్తాం అని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నార . ఈసారి బతుకమ్మ పండుగ అక్కడే నిర్వహించేలా ప్లాన్ చేస్తున్నాం అని కమిషనర్ తెలిపారు.సున్నం చెరువులో పనులు ఆపమని కోర్టు నుంచి ఎలాంటి ఆర్డర్ రాలేదన్నారు. ఇకపోతే యాకుత్‌పురాలో ఐదేళ్ల బాలిక పాఠశాలకు వెళ్తూ ప్రమాదవశాత్తూ మ్యాన్ హోల్‌లో పడిపోయిన ఘటనపై హైడ్రా స్పందించింది. అయితే ఘటనపై వెంటనే గమనించిన బాలిక నాయనమ్మ, స్థానికులు సురక్షితంగా కాపాడారు. హైడ్రా సిబ్బంది నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో ఘటనపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పందించారు. యాకుత్‌పురా ఘటనపై రాజకీయపరంగా చేసే విమర్శలపై స్పందించను. భవిష్యత్‌లో మళ్లీ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకుంటాం అన్నారు. హైడ్రా వల్లే తప్పు జరిగిందని గుర్తించామని, ఘటనకు బాధ్యులైన సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. నగరంలో ఉన్న మ్యాన్‌హోల్స్‌పై ఆడిట్ చేస్తున్నాం. మూతలు సరిగాలేనివి గుర్తించి.. సంబంధిత ఏజెన్సీకి సెక్రటరీ ద్వారా రిఫర్ చేస్తాం. జీహెచ్‌ఎంసీ, వాటర్ బోర్డు, హైడ్రా మధ్య ఎలాంటి సమన్వయ లోపం లేదు. బ్లేమ్ గేమ్ కాకుండా సమన్వయంతో ముందుకెళ్లాల్సి ఉందన్నారు. మాన్‌సూన్ ఎమర్జెన్సీ టీమ్ ఇన్‌ఛార్జి ఈ ఘటనకు బాధ్యుడు.. అతనిపై చర్యలు తీసుకుంటాం. ఆ చుట్టుపక్కల నాలుగైదు మ్యాన్ హోల్స్ ఉన్నాయి.. అందులో ఒకటి వాటర్ బోర్డు వాళ్లు క్లీన్ చేశారు. ఘటన జరిగిన మ్యాన్ హోల్ మాత్రం హైడ్రా సిబ్బంది క్లీన్ చేశారు. మంచి చేస్తేనే మా ఖాతాలో వేసుకోవడం కాదు.. తప్పు జరిగినప్పుడు కూడా అంగీకరిస్తున్నాం. ఇతర శాఖలతో చిన్న చిన్న సమస్యలు తప్ప పెద్ద ఇబ్బందులు లేవు. జీహెచ్‌ఎంసీ పెద్ద ఆర్గనైజేషన్.. మేము ఎవరిపై పెత్తనం చెలాయించట్లేదు. మా అందరికీ బాస్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఉన్నారు. మా శాంక్షన్ అయిన బడ్జెట్‌లో 3 నెలలది మాత్రమే రిలీజ్ అయింది. హైడ్రా పోలీస్ స్టేషన్‌లో త్వరలో కేసులు నమోదు చేస్తాం.

# హ్యూమన్ ట్రాఫికంగ్ అండ్ బాండెండ్ లేబర్

## మీడియా అకాడమీ ఆధ్వర్యంలో

## 16న వర్క్ షాప్

హైదరాబాద్,సెప్టెంబర్12(సమయజ్యోతి):

తెలంగాణ మీడియా అకాడమీ మరియు ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ సంయుక్తంగా ఈనెల 16న మంగళవారం ఉదయం 10:00 గంటలకు 'హ్యూమన్ ట్రాఫికింగ్ మరియు బాండెడ్ లేబర్' అంశాలపై ప్రత్యేక మీడియా వర్క్ షాప్‌ను నిర్వహిస్తున్నాయి. ఈ కార్యక్రమం మీడియా ప్రతినిధులకు అవగాహన పెంపొందించేలా, ఈ నేరాల తీవ్రతను అర్థం చేసుకోవడం, బాధితుల పట్ల ప్రదర్శించే వైఖరి లక్ష్యంతో ఏర్పాటు చేసారు. ఈ వర్క్ షాప్‌లో 'హ్యూమన్ ట్రాఫికింగ్ బాండెడ్ లేబర్' బాధితుల పునరావాసం, న్యాయపరమైన, సమాజపరమైన మద్దతు అంశాలపై నిపుణులు ప్రసంగించ నున్నారు. అలాగే, మీడియా పాత్ర, బాధితుల గౌరవాన్ని కాపాడుతూ సమగ్ర కథనాలను తయారు చేయడం వంటి అంశాలపై ప్రత్యేక చర్చలు జరుగుతాయి. సివిల్ సొసైటీ- ప్రతినిధులు, న్యాయ నిపుణులు, అనుభవజ్ఞులు పాల్గొని తమ అభిప్రాయాలను పంచుకోనున్నారు. ఈ వేదిక జర్నలిస్టులు, ఎడిటోరియల్ టీంలకు అత్యంత ఉపయోగకరంగా ఉండనుంది. తెలంగాణ మీడియా అకాడమీ ఈ సమస్యపై జర్నలిజానికి అవసరమైన అవగాహనను పెంచే లక్ష్యంతో ఇటువంటి శిక్షణా కార్యక్రమాలను నిత్యం నిర్వహిస్తూ వస్తోంది. ఈ రంగంలో దేశవ్యాప్తంగా చేసిన అవిశ్రాంత సేవను మనందరికీ పరిచయం చేస్తూ, న్యాయ వ్యవస్థతో కలిసి పని చేస్తోంది. ఈ వర్క్ షాప్‌లో పాల్గొనదలచిన మీడియా ప్రతినిధులు 15న మధ్యాహ్నం 1-00 గంట వరకు తమ పేరు, సంస్థ పేరు, హోదా మరియు పని చేస్తున్న ప్రదేశంతోపాటు- తమ మొబైల్ నెంబర్ ను ఈ కార్యాలయ మేనేజర్ సెల్ నెంబర్ 7093600977 కు వాట్సాప్ ద్వారా రిజిష్టర్ చేసుకోవాల్సిందిగా కోరుతున్నాము. ముందుగా నమోదు చేసుకున్న మొదటి 70 మంది జర్నలిస్టులకు మాత్రమే ఈ వర్క్ షాప్ లో పాల్గొనుటకు అనుమతించబడును.

# జిల్లాల్లో కదులుతున్న బిఆర్ఎస్ పునాదులు

## ఆజ్యం పోస్తున్న కాషాయ నేతలు

హైదరాబాద్,సెప్టెంబర్12(సమయజ్యోతి):

పలు జిల్లాల్లో గులాబీదళం టిఆర్ఎస్‌లోనూ అసంతృప్తి జ్వాలలు కనిపిస్తున్నాయి. పైకి కనిపించనంతగా నివురుగప్పిన నిప్పులా ఉన్నాయి. పార్టీ అగ్రనేతల అవినీతి కారణంగా దాని పతనం స్పష్టంగా కనిపిస్తోంది. కాళేశ్వరం, ఫార్ములా రేస్, గొర్రెల కుంభకోణం, చెరువులు, మిషన్ భగీరథ ఇలా అన్ని కేసులకు సంబంధించి చర్చ గ్రామస్థాయిలో జోరుగా సాగుతోంది. నిప్పులేనిదే పొగరాదన్న రీతిలో సాగుతోంది. దీనికితోడు ఇక్కడా బిజెపి చాపకిందనీరులా మెల్లగా ఆజ్యం పోస్తోంది. అసంతృప్త నేతలను బుజ్జగిస్తోంది. ఈ అవినీతి పార్టీలో ఉంటూ సమాధానం చెప్పుకోలేక కిందిస్థాయిలో నేతలు అపసోపాలు పడుతున్నారు. ఓ రకంగా చెప్పాలంటే బిఆర్ఎస్ పై అవినీతి బురద స్పష్టంగా కనిపిస్తోంది. దీంతో పార్టీలో రెండోశ్రేణి నాయకత్వం కొంత ఇబ్బందికర పరిస్థితిని ఎదుర్కొంటోంది. బిఆర్ఎస్‌లో మంత్రులు, మాజీమంత్రులు అసంతృప్తి రాగం వినిపిస్తున్న క్రమంలో జిల్లా రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కేసీఆర్ గత ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన జోగు రామన్న.. మంత్రిపదవి కోల్పోయాక పెద్దగా చురుకుగా ఉండడం లేదు. తొలిదశలో ఉమ్మడి ఆదిలాబాద్ నుంచి నిర్మల్ ఎమ్మెల్యే ఇంద్రకరణ్‌రెడ్డికి మాత్రమే చాన్స్ దక్కింది. ఇప్పటికే ఇంద్రకరణ్, వేణుగోపాలాచారిలో బిఆర్ఎస్‌ను వీడారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో జరుగుతున్న పరిణామాలపై బిజెపి వర్గాలు కన్నేసినట్లు సమాచారం. పదవులు లేకుండా,ప్రాధాన్యం లేకుండా ఉన్న నేతలపై బిజెపి నేతలు దృష్టి సారించారని సమాచారం. పలు జిల్లాల్లో బిసిలకు టిక్కెట్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వంలో ఉన్నా లేకున్నా పదవులు దక్కక పోవడంపై పలువురు నేతలు అసంతృప్తితో ఉన్నట్టుగా వార్తలు వెలువడ్డాయి. గులాబీ కోటలో ముళ్లు గుచ్చుకుంటున్నాయి. కొందరు మెల్లగా స్వరం పెంచుతున్నారు. బిజెపి గాలం వేస్తోందన్న భయాలు ఉన్నాయి. నివురుగప్పిన నిప్పులా ఉన్న అసమ్మతి జ్వాలలు ఎప్పుడైనా దహించే ప్రమాదం లేకపోలేదు. రాజకీయాల్లో ఎల్లకాలం ఒకేలా ఉంటారని అనుకోవడానికి లేదని అంటున్నారు. మొత్తంగా ఈ పరిస్థితిని బిజెపి జాగ్రత్తగా గమనిస్తోంది. ఈ నేపథ్యంలోనే పలువురు బిఆర్ఎస్



సీనియర్ నేతలు పార్టీని వీడతారని సోషల్ మీడియాలో ప్రచారం సాగుతుంది. దీంతో కొందరు నేతలు మీడియాకు ముందుకు వచ్చి వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు. అలాగే మాజీ మంత్రి రాజయ్య కూడా కడియం శ్రీహరి లక్ష్యంగా తన అసంతృప్తిని వెళ్ల గక్కుతున్నారు. ఇప్పటికే బాహాటంగా విమర్శలు చేశారు. మొత్తంగా గులాబీకోటలో ఏదో జరుగుతుందన్న ప్రచారం మాత్రం ఊపందుకుంది. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో పనిచేయడంతో పాటు పార్టీకి నమ్మిన బంటుగా ఉన్న పలువురు తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నది నిజం.పార్టీ కోసం ఎంతచేసినా పక్కన పెడుతున్నారని ఆయన అనుచరులు వాపోతున్నారు. మొత్తంగా ఇప్పుడు అసంతృప్త నేతల వ్యవహారం జిల్లాల్లో చర్చనీయాంశంగా మారింది. ఎప్పుడు ఏం జరుగుతుందో చెప్పలేమని అంటున్నారు. బిజెపి నేతలు మాత్రం కాచుకుని కూర్చున్నారు. ఇకపోతే అవినీతి కేసుల్లో కెటిఆర్, హరీష్ రావులు అరెస్ట్ అయితే పరిస్థితి మరింత తారుమారు కావచ్చు.

# సాగు విస్తీర్ణంపై దెబ్బకొట్టిన వానలు

## యూరియా కష్టాలతో రైతుల కుదేలు

నిజామాబాద్,సెప్టెంబరు12(సమయజ్యోతి):

జిల్లాలో ఈ వానకాలంలో అత్యధికంగా వరిసాగు చేశారని అధికారులు తెలిపారు. నిజాంసాగర్, శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టులు ముందే నిండడంతో ఆయకట్టులో పంటల విస్తీర్ణం భారీగా పెరిగింది. అయతే ఇటీవలి వర్షాలు రైతుల ఆశలపై నీళ్లు జల్లాయి. అనేక ప్రాంతాల్ల వరినీట మునిగింది. దీనికితోడు యూరియా కొరత కూడా రైతులను వేధిస్తోంది. జిల్లాలోని అన్ని చెరువులు, కుంటలు నిండడంతో పంటల సాగు భారీగా పెరిగింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా భారీగా ఈ పంటల విస్తీర్ణం పెరిగింది. ఆరుతడి పంటలకన్నా వరిసాగునే ఎక్కువమంది రైతులు చేశారు. జిల్లాలో పంటల విస్తీర్ణం పెరిగినట్లు ఈ క్రాప్ బుకింగ్ ద్వారా వ్యవసాయ అధికారుల సర్వే ద్వారా ప్రభుత్వానికి నివేదించారు. జిల్లాలో పంటల విస్తీర్ణం భారీగా పెరిగిన రుణాల పంపిణీ మాత్రం అనుకున్నవిధంగా జరగలేదు. ఇప్పటి వరకు 50శాతంలోపే రుణపంపిణీ చేశారు. జిల్లాలో భారీ వర్షాలు పడి పంటల విస్తీర్ణం పెరిగినప్పటికీ రుణ పంపిణీ మాత్రం లక్ష్యాలకు అనుగుణంగా జరగడంలేదు. మే నుంచి సెప్టెంబరు వరకు వానకాలం పంటల రుణాలు ఇవ్వాల్సి ఉన్న ఆగస్టు చివరి నాటికి 50శాతం రుణాలను కూడా పంపిణీ చేయలేదు. జూన్ నుంచి సెప్టెంబరులోపు వందశాతం పంట రుణాలను రైతులకు అందించాలని బ్యాంకుల వారీగా లక్ష్యాలను నిర్ణయించారు. దీనికితోడు ఇటీవల వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. వేసిన పంటలు నీట మునిగాయి. ఇప్పటి వరకు ఎన్నిమార్లు సమీక్షించినా వానకాలం పంట రుణాలు మాత్రంలక్ష్యం చేరలేదని అంటున్నారు లక్ష్యంలో 50శాతం మేరకు పంపిణీ చేశారు. ఈ నెలాఖరులో వానకాలం పంట రుణాల పంపిణీ కాలం ముగుస్తోంది. ఇంకా మూడు వారాలే గడువు ఉన్న ఇప్పటి వరకు మాత్రం ఏ బ్యాంకు కూడా లక్ష్యాలను చేరుకోలేదు. సెప్టెంబరు నెలంతా రుణాల పంపిణీ చేసిన 70శాతంలోపే పంట రుణాలు రైతులకు అందే అవకాశం ఉంది. బ్యాంకుల ద్వారా రుణాలు అందకపోవడం వల్ల రైతులు ఇతర మార్గాల్లో పంట రుణాలను తెచ్చుకుని పెట్టుబడి పెడుతున్నారు. ఇకపోతే ఆరుతడి పంటలపై ప్రభుత్వం ఎంతగా ప్రచారం చేస్తున్నా.. రైతులు వరికే మొగ్గు చూపుతున్నారు. వాణిజ్య పంటలు, సేంద్రియ పంటలకు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. దీనికితోడు కోతుల భయంతో ఎక్కువమంది వరినే వేస్తున్నారు.జిల్లాలో అత్యధికంగా ఈ వానకాలంలో వరిసాగువైపు రైతులు మొగ్గుచూపారు. బోధన్ డివిజన్ పరిధిలో జూన్, జూలై నెలలో వరినాట్లు పూర్తిచేశారు. నిజామాబాద్, ఆర్మూర్ డివిజన్ పరిధిలో ఆగస్టు నెలలో ఎక్కువగా ఈ పంటను వేశారు. ఆరుతడి పంటలు ముఖ్యంగా మొక్కజొన్న, సోయా ఎక్కువగా సాగుచేశారు. వర్షాలు ఎక్కువగా ఉండడం వల్ల ఎక్కువ మొత్తంలో ఇతర పంటలను సాగుచేయలేదు. వర్షాలు ఉండడం వల్ల ఈ వానకాలంలో వరిసాగు ఎక్కువగా జరిగినట్లు ఏఈవోలు నిర్వహించిన క్రాప్ బుకింగ్ సర్వేలో బయటపడింది. ఈ వానకాలంలో పసుపు సాగు కూడా 22వేల ఎకరాల్లో చేశారని అంటున్నారు. .జిల్లాలో ఈ వానాకాలంలో సాగు బాగా పెరిగిందని జిల్లా వ్యవసాయ అధికారులు తెలిపారు. రైతులకు కావాల్సిన అన్ని ఏర్పాట్లను శాఖ తరఫున చేశామన్నారు. శ్రీరామ్‌సాగర్, నిజాంసాగర్ ప్రాజెక్టులు నిండడం వల్ల భూగర్భ జలాలు భారీగా పెరిగాయి. భారీ వర్షాలతో అన్ని చెరువులు జూలై నెలలోనే నిండడంతో సెప్టెంబరు మొదటి వారం వరకు ఆరుతడి పంటలతో పాటు




వరిసాగును ఎక్కువమంది రైతులు చేశారు. ఆరుతడి పంటలకు అవకాశం లేకపోవడంతో రైతులు వరిసాగువైపే మొగ్గుచూపారు. ఈ సంవత్సరం ఎక్కువ మొత్తంలో వరిసాగు కావడం వల్ల జిల్లా యంత్రాంగా నికి సవాల్‌గానే మారనుంది. ఈ సంవత్సరం సాగు విస్తీర్ణం పెరగడం వల్ల ధాన్యం కొనుగోలు భారీ మొత్తంలో ఏర్పాటు చేస్తే తప్ప కొనే పరిస్థితి లేదు.

# సుప్రీంకోర్టు ఆవరణలో నిషేధాజ్ఞలు

## రీల్స్ తదితర కార్యకలాపాల నిషేధం

న్యూఢిల్లీ,సెప్టెంబర్12(సమయజ్యోతి):

సుప్రీంకోర్టు ప్రాంగణంలోని హై సెక్యూరిటీ జోన్‌లో ఫొటోలు, రీల్స్ చేయడం, వీడియోలు తీయడంపై సర్వోన్నత న్యాయస్థానం నిషేధం విధిస్తూ సర్క్యులర్ జారీ చేసింది. సెప్టెంబరు 10న జారీచేసిన ప్రకటనలో మీడియా సిబ్బంది ఇంటర్వ్యూలు, వార్తలకు సంబంధించిన ప్రత్యక్ష ప్రసారాలను కేవలం భద్రతా ప్రమాణాలకు అనుగుణమైన జోన్‌లో మాత్రమే నిర్వహించాలని సుప్రీంకోర్టు పేర్కొంది. కోర్టు ప్రాంగణంలో అధికారిక వినియోగానికి మినహా, వీడియోగ్రఫీ, రీల్స్ చేయడానికి, ఫొటోలు తీయడం కోసం ఉపయోగించే ఫోన్స్, కెమెరా, -ట్రైపాడ్, సెల్ఫీ స్టిక్ వంటి పరికరాలను న్యాయస్థానం నిషేధించింది. ఈ మార్గదర్శకాలను ఉల్లంఘించిన వారిపై బార్ అసోసియేషన్ లేదా రాష్ట్ర బార్ కౌన్సిల్ తగిన చర్యలు తీసుకోవాలి. మీడియా సిబ్బంది, నిబంధనలను అతిక్రమిస్తే ఆ మీడియాకి నెల పాటు- ప్రాంగణంలోకి అడుగు పెట్టకుండా ఆదేశాలు ఇవ్వవచ్చు. కోర్టు సిబ్బంది లేదా రిజిస్ట్రీ, సంబంధిత ఉన్నత అధికారులు ఉల్లంఘనలకు పాల్పడితే తీవ్రంగా పరిగణిస్తూ.. వారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటాం అని సర్క్యులర్‌లో పేర్కొంది. హై సెక్యూరిటీ-జోన్‌లో సిబ్బంది, న్యాయవాదులు లేదా ఇతరులు ఫొటోలు లేదా వీడియోలు తీయకుండా నిరోధించే హక్కు భద్రతా సిబ్బందికి ఉంటుందని జారీ చేసిన సర్క్యులర్‌లో పేర్కొంది.




# రాష్ట్రపతి భవన్‌లో జగదీప్ ధన్‌ఖడ్

## రాజీనామా తరవాత తొలిసారి దర్శనం

## వెంకయ్యనాయుడుతో కులాసా కబుర్లు

న్యూఢిల్లీ,సెప్టెంబర్12(సమయజ్యోతి):

మాజీ ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ ఎట్టకేలకు దర్శనమిచ్చారు. ఉపరాష్ట్రపతిగా సీపీ రాధాకృష్ణన్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరయ్యారు. రాజీనామా అనంతరం ఆయన బాహ్య ప్రపంచానికి కనిపించడం ఇదే తొలిసారి. ప్రొటోకాల్ ప్రకారం.. ఉపరాష్ట్రపతి ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి హాజ రయ్యారు. ఉపరాష్ట్రపతి పదవికి జగదీప్ ధన్‌ఖడ్ అనూహ్యంగా రాజీనామా చేసిన విషయం తెలిసిందే. జూలై 21న రాజీనామా లేఖను రాష్ట్రపతికి పంపారు. ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వడం, వైద్యుల సలహాను పాటించడం కోసమే తాను ఉప రాష్ట్రపతి పదవికి రాజీనామా చేస్తున్నానని ధన్‌ఖడ్ తన రాజీనామా లేఖలో పేర్కొన్నారు. ఆయన నిర్ణయం అందరినీ షాక్‌కు గురి చేసింది. మరో రెండేండ్లు పదవీకాలం ఉండగానే ధన్‌ఖడ్ రాజీనామా చేయడం చర్చనీయాంశంగా మారింది. ధన్‌ఖడ్ రాజీనామాపై ప్రతిపక్షాలు పలు అనుమానాలు వ్యక్తం చేశాయి. మరోవైపు రాజీనామా తర్వాత నుంచి ఆయన ఎక్కడా కనిపించడం లేదు. ఆయన్ని కలిసేందుకు పలువురు రాజ్యసభ సభ్యులు ప్రయత్నించినా ఎలాంటి ఫలితం లేదు. ఆయన్ని సంప్రదించలేకపోయారు. దీంతో 'జగదీప్ ధన్‌ఖడ్ ఎక్కడ..?' అంటూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ వచ్చారు. ధన్‌ఖడ్ గృహనిర్బంధంలో ఉన్నారంటూ ప్రచారం కూడా జరిగింది. ధన్‌ఖడ్‌ను తాము చేరుకోలేకపోతున్నామని, ఆయన ఎక్కడ ఉన్నారంటూ ప్రశ్నించారు. ఆయన ఆరోగ్యంపై స్పష్టత ఇవ్వాలని కోరారు. రాజీనామా చేసినప్పటి నుంచి ధన్‌ఖడ్ గురించి ఎలాంటి సమాచారం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన భద్రతపై స్పష్టత ఇవ్వాలని కోరారు. ధన్‌ఖడ్‌కు ఏం జరిగింది..? ఆయన క్షేమంగానే ఉన్నారా? ఆరోగ్యంగానే ఉన్నారా..? అని ప్రశ్నించారు. ఆయన్ని కలిసేందుకు పలువురు రాజ్యసభ ఎంపీలు ప్రయత్నించినట్లు- చెప్పారు. కానీ, ఆయన్ని చేరుకోలేకపోతున్నట్లు- వెల్లడించారు. ఆయన ఆరోగ్యం ఎలా ఉంది?వంటి ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని కోరారు. ఈ క్రమంలో జూలై 21 రాజీనామా తర్వాత అదృశ్యమైన ధన్‌ఖడ్.. ఇప్పుడు రాష్ట్రపతి భవన్‌లో జరిగిన అధికారిక కార్యక్రమానికి హాజరై తనపై వస్తున్న వార్తలకు చెక్ పెట్టారు. ప్రమాణ స్వీకరం కార్యక్రమంలో మరో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పక్కనే



కూర్చుని సంభాషిస్తూ కనిపించారు. ఎంతో ఉల్లాసంగానూ ఉన్నారు. జులై 21న పార్లమెంట్ వర్షాకాల సమావేశాల తొలిరోజే ధన్‌ఖడ్ రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఆ రోజు ఉదయమంతా రాజ్యసభ కార్యక్రమాలను సజావుగా నిర్వహించిన ఆయన.. రాత్రికల్లా అనూహ్య నిర్ణయాన్ని ప్రకటించారు. అనారోగ్య కారణాల వల్లే తాను పదవి నుంచి దిగిపోతున్నట్లు- తెలిపారు. అయితే, నోట్ల కట్టల కేసుకు సంబంధించిన జస్టిస్ యశ్వంత్‌వర్మ అభిశంసన వ్యవహారంలో కేంద్రంతో విభేదాలు రావడం వల్లే ఆయన వైదొలిగినట్లు- విపక్షాలు ఆరోపించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పదవిని వీడిన తర్వాత తొలిసారి ధన్‌ఖడ్ బయట కనిపించారు.

# సుప్రీంలో కంగనాకు చుక్కెదురు

## పరువు నష్టం పిటిషన్ వెనక్కు

న్యూఢిల్లీ,సెప్టెంబర్12(సమయజ్యోతి):

తనపై దాఖలైన క్రిమినల్ పరువునష్టం దావాను కొట్టివేయాలని కోరుతూ నటి, బిజెపి ఎంపి కంగనా రనౌత్ సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌ను శుక్రవారం వెనక్కి తీసుకున్నారు. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం ఆమె పిటిషన్‌ను విచారణకు స్వీకరించేందుకు నిరాకరించడంతో పాటు- ట్రయల్ కోర్టులోనే పరిష్కరించుకోవాలని సూచించిన తర్వాత ఆమె తరఫున న్యాయవాది ఈ పిటిషన్‌ను ఉపసంహరించుకున్నారు. 2020-21లో కేంద్రం అమలు చేసిన వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా రైతులు చేపట్టిన నిరసనలకు సంబంధించి ఆమె చేసిన రీటీ-÷-వట్‌పై పరువునష్టం కేసు దాఖలైన సంగతి తెలిసిందే. గతంలో పంజాబ్ మరియు హర్యానా హైకోర్టు ఆమె పిటిషన్‌ను తోసిపుచ్చడంతో ఆమె సుప్రీంకోర్టుకు వెళ్లారు. ఈ కేసు విచారణకు వచ్చిన సమయంలో జస్టిస్ మెహతా కంగనా వ్యాఖ్యలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. మీ వ్యాఖ్యల సంగతేంటి. ఇది రీటీ-÷-వట్ మాత్రమే కాదని, సొంత వ్యాఖ్యలతో పాటు- కొంత మసాలాను కూడా జోడించారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ వ్యాఖ్యలపై వివరణను ఆమె తరపు న్యాయవాది సుప్రీంకోర్టుకు సమర్పించారు. ఈ వివరణను ట్రయల్ కోర్టుకి సమర్పించాలని జస్టిస్ మెహతా ఆదేశించారు. ?2022-21 వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలంటూ జరిగిన రైతుల నిరసనల సమయంలో మహిళా రైతుపై పోస్ట్‌కు కంగనారనౌత్ అనుచిత వ్యాఖ్యను జోడించి రీట్వీట్ చేశారు. రీట్వీట్‌పై మహీందర్ కౌర్ పంజాబ్‌లోని భటిండా కోర్టులో ఫిర్యాదు చేశారు.

# స్పైస్‌జెట్ విమానానికి తప్పిన ముప్ప

## టేకాఫ్ సమయంలో ఊడిన చక్రం

## ముంబైలో క్షేమంగా దిగిన విమానం

ముంబై,సెప్టెంబర్12(సమయజ్యోతి):

ఓ స్పైస్‌జెట్ విమానానికి ఊహించని ప్రమాదం ఎదురైంది. టేకాఫ్ సమయంలోనే విమాన చక్రాల్లో ఒకటి ఊడిపోయింది. అయినప్పటికీ ప్రయాణాన్ని కొనసాగించిన ఆ విమానం ముంబయి విమానాశ్రయంలో సురక్షితంగా దిగింది. దీంతో ప్రయాణికులు సహా సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. ముందస్తుగా ఎమర్జెన్సీ ప్రకటించిన అధికారులు సంబంధిత చర్యలు చేపట్టారు. విమాన ల్యాండింగ్‌కు సంబంధించి వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. గుజరాత్‌లోని కండ్లా నుంచి ముంబయికి క్యూ400 స్పైస్‌జెట్ విమానం శుక్రవారం మధ్యాహ్నం బయలుదేరింది. ఆ సమయంలో విమానంలో 75 మంది ప్రయాణికులు ఉన్నారు. అయితే, టేకాఫ్ అయిన వెంటనే విమాన చక్రాల్లో ఒకటి రన్‌వేపైనే ఊడిపోయింది. విమానం నుంచి ఏదో వస్తువు పడినట్లు- గుర్తించిన ఎయిర్‌పోర్టు టవర్ కంట్రోల్ అధికారులు.. రన్‌వేపైకి తనిఖీ బృందాలను పంపించారు. విమానం -టైరు అని గుర్తించిన వెంటనే అప్రమత్తమయ్యారు. ముంబయి విమానాశ్రయ అధికారులకు సమాచారం అందించారు. కుడివైపు ఉన్న రెండు-టైర్లలో ఒకటి ఊడిపోయినట్లు- సమాచారం. దీంతో ఎమర్జెన్సీ ప్రకటించిన పైలట్లు-.. సురక్షితంగా దించారు. ఈ ఘటనను విమానయాన సంస్థ ధ్రువీకరించింది. విమానం సొంతశక్తితోనే -టె-ర్మినల్‌కు చేరుకుందని, ప్రయాణికులు సురక్షితంగా దిగారని వెల్లడించింది.

# కాంగ్రెస్ గెలుస్తుందో లేదో..-మంత్రి జూపల్లి సంచలన వ్యాఖ్యలు

ఆదిలాబాద్,సెప్టెంబర్12(సమయజ్యోతి):

మంత్రి జూపల్లి కృష్ణారావు సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను హామీలు ఇవ్వనని.. ఎందుకంటే వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందో లేదో తెలియదని షాకింగ్ కామెంట్స్ చేశారు. అందుకే తాను హామీలు ఇవ్వనని చెప్పుకొచ్చారు. తన వంతుగా ప్రయత్నం మాత్రం చేస్తానని పేర్కొన్నారు మంత్రి జూపల్లి కృష్ణారావు. తన నియోజకవర్గంలోనూ హామీలు ఇవ్వనని తెలిపారు. ప్రజలకు ఏం పనులు కావాలో వాటిని మాత్రమే చేస్తానని స్పష్టం చేశారు. శుక్రవారం బోథ్‌లో ఇందిరమ్మ నమూనా గృహం ప్రారంభోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఈ క్రమంలో మంత్రి జూపల్లి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. అయితే, మంత్రి జూపల్లి చేసిన ఈ వ్యాఖ్యలపై టీపీసీసీ ఎలాంటి చర్యలు తీసుకుంటు-ందోనని కాంగ్రెస్ శ్రేణులు మాట్లాడుకుంటున్నారు.

# విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి

## కేజీబీవీ ఎస్ ఓ షాలిని

సమయజ్యోతి న్యూస్ కృష్ణ.... నారాయణ పేట జిల్లా

ఉత్తమ ఉపాధ్యాయురాలుగా అవార్డును అందుకున్న హిందీ పండితులు పద్మా ను శు క్రవారం కృష్ణ కేజీబీవీ ఎస్ ఓ షాలిని,సిఆర్పి అమిన్ రెడ్డి, ఉపాధ్యాయ బృందం మరియు బోధ నేతర సిబ్బంది ఘనంగా సన్మానించడం జరిగింది. ఎస్ఓ షాలిని మాట్లాడుతూ ఉమ్మడి మండలంలో కేజీబీవీ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు దాదాపుగా 15 సంవత్సరాల నుండి ఎంతోమంది అనాథ బడుగు బలహీన వర్గాల పిల్లల్ని విద్యార్థులను కేజీబీవీలో చేర్చుతూ వారి విద్యాభివృద్ధికి కృషి చేసినటువంటి పద్మ కేజీబీవీ కృష్ణ నందు పని చేయడం తమ అదృష్టంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. పద్మ ను స్ఫూర్తిగా తీసుకొని మిగతా ఉపాధ్యాయ బృందామంతా తమ కర్తవ్యాన్ని బాధ్యత గా బావించాలని కేజీబీవీ లలో విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో కేజీబీవీ ఉపాధి బృందం,మండల సిఆర్పి అమిన్ రెడ్డి పాల్గొన్నారు.



# మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి చిత్ర పటానికి పాలాభిషేకం

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి ఆత్మకూరు వనపర్తి జిల్లా.

ఆత్మకూరు మండల కేంద్రం నుండి జూరాల గ్రామం మీదుగా కృష్ణనది లో బ్రిడ్జి నిర్మాణానికి 120 కోట్ల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేయడం జరిగింది.ఆత్మకూరు ప్రజల చిరకాల కళ జూరాల మీదిగా బ్రిడ్జి నిర్మించాలని గత పాలకులకు విన్నవించిన వారు పెడచెవిన పెట్టారని అన్నారు. ప్రజల రవాణావసరాలను దృష్టిలో ఉంచుకొని ఈ ప్రాంతం అభివృద్ధి చెందే విధంగా రాష్ట్ర పాడి పరిశ్రమల మత్స్య క్రీడల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి పట్టు పట్టి సీఎం రేవంత్ రెడ్డి సహాయ సహకారంతో బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారని అన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్న మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి చిత్రపటానికి ఆత్మకూరు గాంధీ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశం నాగరాజు గౌడ్, మార్కెట్ చైర్మన్ ఎండి రహమతుల్లా, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నల్లగొండ శీను, మండల అధ్యక్షుడు పరమేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కే రామ లక్ష్మారెడ్డి, వెంకట నరసింహారావు, బంగారు భాస్కర్, మణి వర్ధన్ రెడ్డి,కోట్ల వెంకటేష్, నాగేష్, బుచ్చన్న, వెంకటేష్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.



# నేపాల్‌లో చిక్కుకున్న 44మంది నంద్యాల వాసులు

## తమవారిని రప్పించాలంటూ మంత్రి ఫరూఖ్‌కు వినతి

## వెంటనే అధికారులతో మాట్లాడిన మంత్రి ఫరూక్

నంద్యాల,సెప్టెంబర్12(సమయజ్యోతి):

నేపాల్‌లో 'జెన్‌జీ' ఉద్యమం తీవ్ర ఉద్రిక్తతలు, విధ్వంసానికి దారి తీసింది.. నేపాల్‌లో కొనసాగుతున్న ఉద్రిక్తతల వేళ.. అక్కడ చిక్కుకున్న తెలుగు వారిని క్షేమంగా తీసుకురావడానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తుండగా.. ఈ సమయంలో.. ఏపీకి చెందిన మరో 44మంది టూరిస్టులు అక్కడ చిక్కుకున్న వార్తలు కలవరపెడుతున్నాయి.. నంద్యాల నుండి ముక్తినాథ్ యాత్రకు వెళ్లి , నేపాల్ లో చిక్కుకున్నారు 44 మంది యాత్రికుల బృందం.. దీంతో, మంత్రి ఫారూఖ్ ను యాత్రికుల కుటుంబ సభ్యులు ఆశ్రయించారు.. వెంటనే హోంమంత్రి అనిత , జిల్లా కలెక్టర్ రాజకుమారితో మాట్లాడిన మంత్రి ఫరూక్.. ఆ కుటుంబ సభ్యులకు ధైర్యాన్ని చెప్పారు.. ఇక, 14వ తేదీన యాత్రికులను రప్పించడానికి ఏర్పాట్లు- చేశారు కలెక్టర్ రాజకుమారి.. అయితే, షోలే ట్రావెల్స్ ద్వారా 3వ తేదీన 12 రోజుల ముక్తినాథ్ యాత్రకు బయలుదేరి వెళ్లింది 44 మంది భక్తుల బృందం.. ఈ టీమ్‌లో నంద్యాల, కర్నూలు, ప్రొద్దుటూరు, పోరుమామిళ్ల, సున్నిపెంటవాసులు ఉన్నట్టుగా చెబుతున్నారు.. నేపాల్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో.. రాజధాని ఖాట్మాండ్ లో రెండు రోజులుగా రూమ్‌లకే పరిమితమయ్యారు యాత్రకులు.. మొత్తంగా మంత్రి ఫారూఖ్ చొరవతో యాత్రికులను రప్పించడానికి ఏర్పాట్లు- జరుగుతున్నాయి.. రేపు ఖాట్మాండ్ నుండి నేపాల్ - ఇండియా సరిహద్దుల్లోని భైరవ్ ప్రాంతానికి విమానంలో బయలుదేరనున్నారు యాత్రికులు.. అక్కడినుండి వోల్వా బస్సులో యూపీలోని గోరకపూర్ కు , అక్కడి నుండి విమానంలో హైదరాబాద్ కు వస్తారు.. ఈ నెల 14వ తేదీ సాయంత్రం హైదరాబాద్ చేరుకోనుంది యాత్రికుల బృందం.. యాత్రికులు క్షేమంగా ఉన్నారని , కుటుంబ సభ్యులు ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి ఫరూఖ్ అన్నారు ..

# లిక్కర్ కేసుతో సంబంధం లేదు

## తనకు లిక్కర్ అంటేనే

## పడదన్న చెవిరెడ్డి

విజయవాడ,సెప్టెంబర్12(సమయజ్యోతి):

విజయవాడలో కోర్టు వద్ద మరోసారి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి హల్‌చల్ చేశారు.. ఏపీ మద్యం స్కాం కేసులో అరెస్ట్ అయిన ఆయన.. అప్పటి నుంచి కోర్టుకు తీసుకొచ్చిన ప్రతీసారి.. ఏదో హాల్ చల్ చేస్తూ వస్తున్నారు.. అయితే, తాను ఏ తప్పు చేయకపోయినా కేసు నమోదు చేసి జైల్లో పెట్టారంటూ ఆవేదన వ్యక్తం చేశారు.. మీడియాలో కూడా ఇష్ట రీతిన అసత్య వార్తలు రాస్తున్నారని.. వారిపై న్యాయపోరాటం చేస్తానన్నారు చెవిరెడ్డి.. తానెప్పుడూ మద్యం వ్యాపారం చేయలేదని.. మద్యం నుంచి ఒక్క రూపాయి ఆదాయం కూడా ఆశించలేదని.. ప్రమాణానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు.. మనసా వాచా కర్మణా లిక్కర్ జోలికి ఎప్పుడు పోలేదు.. లిక్కర్ కేసుతో నాకు సంబంధం లేదని పేర్కొన్నారు. నేను ఏడో తరగతి చదివేటప్పుడే మా నాన్న తాగుడు వల్ల మా అమ్మ ఆత్మహత్య చేసుకుంది.. ఇదే తాగుడు వల్ల మా నాన్న చనిపోయాడు.. తాడుగుతోనే మా తమ్ముడు చనిపోయాడు.. దాంతో.. నేను లిక్కర్‌ను ద్వేషిస్తాను.. లిక్కర్ జోలికి పోను అన్నారు చెవిరెడ్డి.. చిన్నప్పటి నుంచి ఇది ఉద్దేశంతో ఉన్నాను.. లిక్కర్ ని ద్వేషించే నన్ను లిక్కర్ కేసులో అరెస్ట్ చేయడం నాకు బాధేసింన్నారు.. పత్రికల్లో విచక్షణారహితంగా అసత్యాలు రాస్తున్నారు..10 శాతం తప్పు చేస్తే 90 శాతం యాడ్ చేయండి.. కానీ, 100 శాతం యాడ్ చేయొద్దు అని సూచించారు.. మనసుకు బాధ వేస్తుంది.. అరెస్టు చేసినందుకు బాధ లేదు.. లిక్కర్ కేసులో అరెస్ట్ చేసినందుకు బాదేస్తుందన్నారు.. 13 ఏళ్లుగా వేద పాఠశాల నడుపుతున్న.. 160 మంది పిల్లలు చదువుతున్నారు. తాగుడు వ్యాపారం చేస్తే నైతికగా హక్కు కోల్పోతాం.. ఇది ధర్మం కూడా కాదన్నారు. ప్రతి మనిషి బతకాలంటే వ్యాపారం చేయాలి. నేను వ్యాపారం చేసుకుంటు-న్నాను.. లిక్కర్ తో సంబంధం ఉండి.. పెట్టు-బడి పెట్టినా.. ఆస్తులు అటాచ్‌మెంట్ కాదు స్వాధీనం చేసుకోండి అని సవాల్ చేశారు.. కానీ, లిక్కర్ తో సంబంధం లేకుండా మా వ్యాపారం మీద, మా కొడుకు మీద పడుతున్నారు.. ఇది న్యాయం కాదు.. దేవుడు ఉన్నాడు అన్నారు.. అయితే, ఏ తప్పు చేయకుండా నేను శిక్ష అనుభవిస్తున్నాను అన్నారు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి..

# రుషికొండపై 500 కోట్లు తగలేసారు

## ఆడబ్బుతో మెడికల్ కాలేజీలు పూర్తయ్యేవి

## జగన్ ఫ్రస్టేషన్‌లో విమర్శలు: గంటా

విశాఖపట్నం,సెప్టెంబర్12(సమయజ్యోతి):

రూ.500 కోట్లతో రుషికొండ ప్యాలెస్ కట్టారని, ఆ ఖర్చు మెడికల్ కాలేజీలపై పెట్టి ఉంటే అవి పూర్తయ్యేవని టిడిపి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు.. వైకాపా ఐదేళ్ల పాలనపై ఎక్కడైనా చర్చకు సిద్ధం అన్నారు.. విశాఖ ఎంవీపీ కాలనీలోని తన నివాసంలో నిర్వహించిన మీడియా సమావేశంలో గంటా మాట్లాడారు. గత ప్రభుత్వం కంటే అధిక మొత్తంలో పింఛను అందిస్తున్నామని వెల్లడించారు. దివ్యాంగులకు పింఛను పెంచి ఇస్తున్నాం. విశాఖకు పెద్ద ఎత్తున ఐటీ- పరిశ్రమలు వస్తున్నాయి. నేపాల్‌లో తెలుగువాళ్లు చిక్కుకుంటే మంత్రి నారా లోకేశ్ నిరంతరం పర్యవేక్షించి వారిని రాష్ట్రానికి తీసుకొచ్చేలా చర్యలు చేపట్టారని గంటా శ్రీనివాసరావు అన్నారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను చూసి వైఎస్ జగన్ ఫస్ట్రేషన్‌కు గురవుతున్నారని మాజీ మంత్రి, తెదేపా ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. వైకాపా కేవలం 11 సీట్లకు పరిమిత మవడంతో ఆయన ఏదేదో మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. కాంట్రాక్టర్లను జగన్ బెదిరిస్తున్నారని.. ఆయన మానసిక పరిస్థితిపై అనుమానం ఉందని వ్యాఖ్యానించారు. అనంతపురంలో నిర్వహించిన సూపర్ సిక్స్.. సూపర్‌హిట్ సభ విజయవంతమైంది. చెప్పిన మాట చేసి చూపిస్తే ఎలా ఉంటు-ందో చెప్పేందుకు ఆ సభ ఉదాహరణ. జగన్ తీరు దారుణంగా ఉంది. సీఎం, హోం, వ్యవసాయ మంత్రులపై ఇష్టారీతిన ఆయన మాట్లాడారు. జగన్ ప్రజలు ప్రతిపక్ష హోదా ఇవ్వలేదు. 18 సీట్లు- వస్తే తప్ప ఆ హోదా రాదు. వచ్చే ఎన్నికల్లో 11 సీట్లు- కూడా రావు. వైకాపా హయాంలో నర్సీపట్నంలో వైద్యకళాశాలను కేవలం 8 శాతమే పూర్తిచేశారు. పార్టీ కార్యాలయాలు తప్ప జగన్ ఇంకేమీ నిర్మించలేదన్నారు.

# రియల్ వ్యాపారి దారుణహత్య

మేడ్చల్,సెప్టెంబర్12(సమయజ్యోతి):

మేడ్చల్ జిల్లా కాప్రాలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో దారుణం చోటు- చేసుకుంది. నడిరోడ్డు మీద అందరూ చూస్తుండగానే రియల్ ఎస్టేట్ వ్యాపారి శ్రీకాంత్‌రెడ్డిని ఓ దుండగుడు హత్య చేశాడు. అడ్డువచ్చిన వ్యక్తిని కత్తితో బెదిరించి.. అక్కడి నుంచి పారిపోయాడు. సమాచారం అందుకున్న కుషాయిగూడ పోలీసులు.. ఘటనా స్థలిని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు- తెలిపారు. శ్రీకాంత్ వ్యాపార భాగస్వామే చంపి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.


# రానున్న దశాబ్దకాలంలో మారనున్నరూపురేఖలు

## ఖరిన చర్యలతో అభివృద్ధి వైపు దూసుకెళ్తున్నాం

## స్వర్ణాంధ్ర విజన్ లక్ష్యంతో అభివృద్ధి ప్రణాళికలు

## అమరావతిలో నిర్వహించినకాన్క్లేవ్‌లో చంద్రబాబు

అమరావతి,సెప్టెంబర్12(సమయజ్యోతి):



భారతదేశానికి నాలుగోసారీ ప్రధానిగా నరేంద్రమోదీనే ఉంటారని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు చెప్పారు. వచ్చే దశాబ్దంలో ఏపీతోపాటు, దేశంలో అద్భుతాలు జరుగు తాయని ఆయన అన్నారు. ఒక సీఎంగా భావితరాల కోసం ఆలోచన చేయాలని చంద్రబాబు స్పష్టం చేశారు. అమరావతిలో నిర్వహించిన ఓ ప్రైవేట్ కాంక్లేవ్‌లో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ వ్యాఖ్యలు చేశారు. వచ్చే దశాబ్ద కాలంలో ఏపీ రూపురేఖలు ఎలా ఉండబోతున్నాయనే అంశాన్ని సీఎం చంద్రబాబు ఈ సందర్భంగా ఆవిష్కరించారు. 1994లో చాలా కఠిన నిర్ణయాలు తీసుకున్నా. 1999లో గెలిచా. 1999 ప్రభుత్వం వచ్చాక ఓ తపనతో పని చేశా. కొంచెం బ్యాలెన్స్ చేయలేకపోయాం. కానీ ఇప్పుడు పూర్తి బ్యాలెన్స్ చేస్తున్నాం. సంపద సృష్టిస్తున్నాం.. పేదలకు అందిస్తున్నాం. భారత ప్రధానిగా నాలుగోసారి కూడా మోదీనే వస్తారు. రాష్ట్రంలో కూడా ఎన్డీఏ ప్రభుత్వమే వస్తుంది. ఎలాంటి అనుమానాలు అక్కర్లేదు అని చంద్రబాబు తేల్చి చెప్పారు. ఏపీలోని స్టేక్ హోల్డర్లను భాగస్వాములను చేస్తూ ఈ తరహా కాంక్లేవ్ నిర్వహించడం మంచి పరిణామం అని సీఎం చంద్రబాబు అన్నారు. విజన్ రూపకల్పన చేయడమే కాదు.. దాన్ని సాధ్యం చేసే దిశగా పని చేయాలని ఆయన సూచించారు. జాతీయ స్థాయిలో వికసిత్ భారత్-2047, రాష్ట్ర స్థాయిలో స్వర్ణాంధ్ర-2047 డాక్యుమెంట్లను సిద్ధం చేశామని తెలిపారు. భారతీయులకు సరైన గుర్తింపు లేని సమయంలో తెలుగు బిడ్డ పీవీ నరసింహారావు సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. అప్పటి నుంచి భారతదేశం అభివృద్ధి అన్ స్టాపబుల్ గా మారింది. 2038 నాటికి భారతదేశం నెంబర్-1 అవుతుంది. ఇందులో తెలుగు వారి పాత్ర ప్రధానంగా ఉండాలని భావిస్తున్నానని అన్నారు.



# ఏపీలో కొత్త జిల్లాలపై కసరత్తు

## మార్పులు, చేర్పులపైనా ప్రజాభిప్రాయ సేకరణ

## ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే నివేదిక సమర్పణ

అమరావతి,సెప్టెంబర్12(సమయజ్యోతి):

ఏపీలో కొత్త జిల్లాలపై కసరత్తు వేగవంతమైంది. అసెంబ్లీ వర్షాకాల సమావేశాలలోపే ప్రభుత్వానికి నివేదికని ఇవ్వాలని మంత్రివర్గ ఉపసంఘం భావిస్తోంది. ఆ నివేదికపై చర్చించి నిర్ణయం తీసుకోనుంది. అయితే పెద్దగా మార్పులు ఉండకపోవచ్చని తెలుస్తోంది. రెండు మూడు జిల్లాల ఏర్పాటుతో పాటు- కొన్ని చోట్ల హద్దులు మార్చే అవకాశం ఉందని సమాచారం. వైస్సార్సీపీ హాయాంలో పరిపాలన సౌలభ్యం కోసం 13 జిల్లాలను 26 జిల్లాలుగా విభజించారు. అయితే, ఇందులోని గందరగోళం ఉందని మార్పులు అవసరమని భావించింది ప్రస్తుత కూటమి ప్రభుత్వం. ఇందులో భాగంగా కొత్త జిల్లాల ఏర్పాటుతో పాటు- మండలాలు గ్రామాల సరిహద్దులు పేర్ల మార్పు సర్దుబాట్లపై అధ్యయనానికి ఏడుగురు మంత్రులతో ఉపసంఘాన్ని ఏర్పాటు- చేసింది. ఈ సబ్ కమిటీ- ఇప్పటికే ప్రజలు ప్రజా ప్రతినిధుల అభిప్రాయాలను సేకరించింది. అంతేకాకుండా వినతలను కూడా స్వీకరించింది. వీటన్నిటిపై త్వరలో ఉపసంఘం చర్చించి అసెంబ్లీ సమావేశాలకు ముందే ప్రభుత్వానికి నివేదికను ఇవ్వనుంది. కేంద్రం జనగణన చేయనున్నడంతో 2026 నుంచి 27 వరకు జిల్లాలు, మండలాలు, గ్రామాల సరిహద్దులు పేర్లు మార్చేందుకు వీలుండదు. కాబట్టి, 2025 డిసెంబర్ 31 లోపు జిల్లాల పునర్విభజన హద్దుల్లో మార్పులు చేర్పులు పూర్తి చేసి అమల్లోకి తీసుకురావాల్సి ఉంటుంది. ప్రకాశం జిల్లా మార్కాపురం కేంద్రంగా కొత్త జిల్లాను ఏర్పాటు- చేయాలన్న ప్రతిపాదన ఎప్పటినుంచో ఉంది. గిద్దలూరు, కనిగిరి, మార్కాపురం, ఎర్రగుణపాలం, దర్శి కలిపి ఐదు నియోజక వర్గాలతో కొత్త జిల్లా ఏర్పాటు- చేసే అవకాశాన్ని ప్రభుత్వం పరిశీలించే అవకాశం ఉంది.అలాగే బాపట్ల జిల్లాలోని అద్దంకి నెల్లూరు జిల్లాలోని కందుకూరు నియోజక వర్గాలని మళ్ళీ ప్రకాశం జిల్లాలో కలిపితే అక్కడి ప్రజలకు సౌకర్యంగా ఉంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దాన్ని కూడా పరిశీలించే అవకాశం ఉంది. ఇక అమరావతి కేంద్రంగా కొత్తగా అర్బన్ జిల్లా ఏర్పాటు- ప్రతిపాదన కూడా ఉంది. రాజధాని పరిధిలోని 29 గ్రామాలు గుంటూరు జిల్లా మంగళగిరి, తాడికొండ నియోజక వర్గాల్లోకి వస్తాయి. వీటితో పాటు- పెదకూరుపాడు, నందిగామ, జగ్గయపేట నియోజక వర్గాలు భౌగోళికంగా అమరావతికి దగ్గరగా ఉంటాయి. వీటితో కొత్త అర్బన్ జిల్లా ఏర్పాటు చేస్తే ఐదు నియోజక వర్గాలు అయ్యే అవకాశం ఉంటుంది. ఇక గుంటూరు జిల్లాలోనూ గుంటూరు తూర్పు, పశ్చిమ, పత్తిపాడు, పొన్నూరు, తెనాలి కలిపి ఐదు నియోజక వర్గాలు అవుతాయి. ప్రస్తుతం కృష్ణా జిల్లాలో ఉన్న గన్నవరం పెనమలూరు నియోజక వర్గాలని ఎన్టీఆర్ జిల్లాలో కలపొచ్చు. దీంతో ఎన్టీఆర్ జిల్లాలో విజయవాడ తూర్పు, పశ్చిమ, మధ్య, తిరువూరు, మైలవరం, గన్నవరం, పెనమలూరు సహా ఏడు నియోజక వర్గాలు అవుతాయి. కృష్ణా జిల్లాలో ఐదు నియోజక వర్గాలు ఉండే అవకాశం ఉంది.

# మూడు రాజధానులు కాదు..వికేంద్రీకరణ అన్నాం

## విజయవాడ-గుంటూరు మధ్య రాజధానితో ఖర్చు తగ్గుతుంది

## మాయాబజార్‌తో కోటరీ జేబులు నింపే పనిలో చంద్రబాబు-రాజధానిపై మాట మార్చిన వైకాపా నేత సజ్జల

అమరావాతి,సెప్టెంబర్12(సమయజ్యోతి):



రాజధాని అమరావతిపై వైసీపీ స్టేట్ కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు.. మూడు రాజధానులని అనలేదని, వికేంద్రీకరణ గురించే మాట్లాడామని మాట మార్చారు. విజయవాడ, గుంటూరు మధ్య రాజధాని పెడితే ఖర్చు తక్కువ అవుతుందన్నారు.. అయితే, ఇంతకు ముందు అమరావతిని రాజధానిగా తీసేస్తామని మేం అనలేదన్నారు.. అమరావతిని కలుపుకొని డీసెంట్రలైజ్ అన్నాం.. అభివృద్ధి వికేంద్రీకరణ మా విధానం అన్నాం.. మూడు రాజధానులు అని తప్పుడు ప్రచారం చేశారన్నారు.. విజయవాడ, గుంటూరు మధ్య రాజధాని పెడితే శాశ్వత పరిష్కారం అవుతుందన్నారు.. చంద్రబాబు తాను, తన కోటరీ జేబులు నింపుకునే ఆలోచన చేస్తున్నారు.. రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు..

# తురకపాలెం సమస్యలపై ప్రత్యేక దృష్టి

## పరీక్షల నివేదికలు రాగానే చర్యలు

## న్యూ రాజరాజేశ్వరి పేటలో అదుపులోడయేరియా

## వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్

విజయవాడ,సెప్టెంబర్12(సమయజ్యోతి):

తురకపాలెంలో అనారోగ్య సమస్యలు, పలువురి మృతికి గల కారణాలపై రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో దృష్టి సారించిందని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ అన్నారు. అక్కడి ప్రజలకు అన్ని రకాల పరీక్షలు చేయిస్తున్నామని.. నివేదికలు రాగానే చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎన్టీఆర్ జిల్లా నందిగామలో వంద పడకల ఏరియా ఆస్పత్రి భవన నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం ఎంపీ కేశినేని చిన్ని, ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్యతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. డయేరియాపై ఏపీ ప్రభుత్వ పరంగా అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటున్నామని సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. న్యూ రాజరాజేశ్వరి పేటలో ప్రస్తుతం డయేరియా పరిస్థితి అదుపులో ఉందని చెప్పుకొచ్చారు. న్యూ రాజరాజేశ్వరి పేటలో మంత్రి సత్యకుమార్ యాదవ్, మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ, ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), కలెక్టర్ లక్ష్మీశా, మున్సిపల్ కమిషనర్ ధ్యాన చంద్ర పర్యటించారు. మెడికల్ క్యాంపులో రోగులతో మంత్రులు సత్యకుమార్, నారాయణ, ఎంపీ కేశినేని చిన్ని మాట్లాడారు. అనంతరం మీడియాతో మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడారు.తాగునీటి పైపులైన్, అండర్ గ్రౌండ్ వాటర్‌ను పరీక్షలకు పంపామని వెల్లడించారు. నెగిటివ్ రిపోర్ట్ వచ్చినా తాగునీటి సరఫరా నిలిపి వేశామని చెప్పుకొచ్చారు. బయట నుంచి మినరల్ వాటర్ క్యాన్లతో నీటిని సరఫరా చేస్తున్నామని తెలిపారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తున్నారని పేర్కొన్నారు. ఇక్కడ ప్రజలతో కూడా మాట్లాడి ప్రస్తుత పరిస్థితి గురించి కూడా తెలుసుకున్నామని అన్నారు. ఇంటింటికీ వెళ్లి మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్‌లు ఇచ్చామని తెలిపారు. న్యూ రాజరాజేశ్వరి పేటలో 141 మంది డయేరియా (ఉశససర।శ ఈశ।) బారిన పడ్డారని చెప్పుకొచ్చారు. డయేరియా బారిన పడ్డా అందరికీ చికిత్స చేశామని.. ఇప్పుడు 68 మందికి చికిత్స జరుగుతోందని తెలిపారు మంత్రి సత్యకుమార్ యాదవ్. డయేరియా వల్ల ఎవరూ చనిపోలేదని.. వదంతులు నమ్మొద్దని పేర్కొన్నారు. డయేరియా వచ్చిన వారు పలు రకాల కారణాలు చెబుతున్నారని తెలిపారు. పానీపూరీ తిన్నారని, నీళు అని, వంకాయ, ఎండుచేప కూర తినడం వల్ల డయేరియా వచ్చిందని వారు అంటు-న్నారని చెప్పుకొచ్చారు. ఈ రిపోర్టులో కూడా నెగిటివ్ వచ్చిందని.. రెండో విడుత కూడా ల్యాబ్‌కు పంపామని వెల్లడించారు. బుడమేరు ప్రాంతం కాబట్టి.. భూగర్భ జలాలు కలుషితం అయ్యాయనే కోణంలో పరిశీలన జరుగుతోందని తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి పరిణామాలు రాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటామని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.డయేరియా ప్రబలిన వెంటనే అధికారులు వేగంగా స్పందించారని ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు. అవసరమైన చర్యలు తీసుకుని ప్రజలకు వైద్య సేవలు అందించారని అన్నారు. మంత్రులు నారాయణ, సత్యకుమార్‌లు ఇక్కడకు వచ్చి ప్రజలతో మాట్లాడారని చెప్పుకొచ్చారు. భవిష్యత్తులో ఇక్కడ చేపట్టాల్సిన చర్యలపై ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, తాను ప్రజల నుంచి అభిప్రాయాలు తీసుకున్నామని అన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పరిష్కరిస్తామని ఎంపీ కేశినేని శివనాథ్ పేర్కొన్నారు.



### జగన్ హయాంలో

# వైద్య విద్య మరీ అధ్వానం

## - మెడికల్ కాలేజీలు కట్టకుండానే ప్రచారం- పిపిపి పద్ధతిలోనే కళాశాలల నిర్వహణ

## - తేల్చి చెప్పిన సిఎం చంద్రబాబు- జగన్ హయాంలో నిర్లక్ష్యంపై మండిపడ్డ అనిత

## - టెండర్లను రద్దుచేసే అధికారం లేదన్న సత్యకుమార్

అమరావతి,సెప్టెంబర్12(సమయజ్యోతి):

జగన్ మెడికల్ కాలేజీలు కట్టకుండా... కట్టేశామని చెబుతున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎద్దేవా చేశారు. తాము ప్రైవేట్ వారికి అప్పగించడం లేదని .. పీపీపీ పద్ధతిలోనే చేపడుతున్నామన్నారు. ఏ ఒక్కరికీ అన్యాయం జరగదని, నిర్వహణ ప్రభుత్వానిదేనని తేల్చి చెప్పారు. వైద్య విద్యార్థులకు, వైద్య సేవలకు ఇబ్బంది రాకుండా చేసే బాధ్యత ప్రభుత్వానిదన్నారు. బెదిరిస్తే బెదిరిపోయే పరిస్థితి లేదని తెలిపారు. ఒకప్పుడు రాయలసీమలో పదేళ్లలో 8 ఏళ్లు కరవు ఉండేదన్నారు. దేశంలో ఇప్పటికీ అతి తక్కువ వర్షపాతం ఉన్న జిల్లా అనంతపురం.. కానీ నీళ్లు ఇవ్వడంతో అక్కడ పరిస్థితి మారిందన్నారు. గోదావరి జిల్లాల కంటే అనంతపురం జిల్లానే జీఎస్‌డీపీలో అగ్రస్థానంలో ఉందన్నారు. హార్టీకల్చర్ సాగు వల్లే ఇది సాధ్యమైందని గుర్తు చేశారు. వృథా జలాలను మాత్రమే బనకచర్లకు వినియోగించుకుంటామని స్పష్టం చేశారు. ఇదిలావుంటే గతంలో జగన్ శంకుస్థాపన చేసిన వైద్య కళాశాలలన్నీ పునాదుల దశలోనే ఉన్నాయని, మొండి గోడల మధ్య వైద్య విద్యార్థులు చదువుకుంటారా? అని ఏపీ హోం మంత్రి అనిత మండిపడ్డారు. పునాదుల దశలోనే వైద్య కళాశాలలు ఉంటే.. అడ్మిషన్లు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. విజయవాడలో ఏర్పాటు-చేసిన మీడియా సమావేశంలో.. మెడికల్ కాలేజీలపై వైకాపా నేతలు చేస్తున్న విమర్శలకు ఆమె కౌంటర్ ఇచ్చారు. వైద్య కళాశాలల నిర్మాణానికి కేంద్రం ఇచ్చిన నిధులను గత వైకాపా ప్రభుత్వం దుర్వినియోగం చేసిందని విమర్శించారు. నోటికొచ్చినట్లు- జగన్ అబద్ధాలు చెబుతున్నారు. వైద్య కళాశాలల నిర్మాణానికి రూ.5,800 కోట్లు- అవసరం. కానీ, ఐదేళ్లలో జగన్ ఖర్చు చేసింది కేవలం రూ.1,450 కోట్లే. పీపీపీ విధానం అంటే జగన్ ఎందుకు భయపడుతున్నారో అర్థం కావట్లేదు. ఈ విధానంలో వైద్య కళాశాలలు నిర్మించి, మౌలికవసతులు కల్పిస్తారు. నిర్వహణ మొత్తం ప్రభుత్వమే చేపడుతుంది. కళాశాలలు తొందరగా నిర్మించాలనే ఉద్దేశంతోనే ఈ విధానం తీసుకొచ్చాం అన్నారు. జగన్ చేసిన పాపం వల్ల.. వైద్య విద్య అడ్మిషన్లు తీసుకురాలేక పోయాం. పీపీపీ విధానంలో టెండర్లు వేసేందుకు ముందుకొస్తే జగన్ బెదిరిస్తున్నారు. అభివృద్ధిని అడ్డుకుంటున్నారు. మళ్లీ అధికారం లోకి వస్తామని జగన్ పగటి కలలు కంటున్నారు. ఆహా అంటున్న వైద్య కళాశాలలు ఎక్కడున్నాయో చెబితే.. జగన్‌ను నేనే అక్కడికి తీసుకెళ్తా. ఆయన ఆహా అంటారో.. ఓహో అంటారో చూద్దామని అనిత అన్నారు. వైకాపా హయాంలో ఐదేళ్లలో వైద్యకళాశాల భవన నిర్మాణాలను పూర్తిచేయకుండా జగన్ నిద్రపోయారని మంత్రి సత్యకుమార్ విమర్శించారు. వైకాపా నేతలు ప్రభుత్వంపై అసత్యాలు ప్రచారం చేస్తూ రాజకీయ లబ్ధికి యత్నిస్తున్నారన్నారు. ఆ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు వైద్యకళాశాలకు భవనాలు నిర్మించక పోవడంతో వేలాది మెడికల్ సీట్లను విద్యార్థులు కోల్పోయారని చెప్పారు. లక్షలాది మందికి వైద్యం అందలేదని ఆక్షేపించారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంపై సోషల్ మీడియాలో వైకాపా అసత్య ప్రచారాలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మెడికల్ కాలేజీల నిర్మాణ టెండర్లు రద్దు చేస్తానని జగన్ ప్రకటించడం దారుణమని.. అలా రద్దు చేయడం ఎవరి తరమూ కాదన్నారు.



# భారత్ పర్యాటక బస్సుపై దుండగుల దాడి

ఖాట్మండ్,సెప్టెంబర్12(సమయజ్యోతి):

రాజకీయ అవినీతికి వ్యతిరేకంగా నేపాల్ యువత చేపట్టిన నిరసన కార్యక్రమాలు హింసాత్మకంగా మారిన సంగతి తెలిసింది. ఈ అల్లర్ల నేపథ్యంలో ప్రధాని కేపీ శర్మ ఓలితో పాటు- చాలా మంది మంత్రులు తమ పదవులకు రాజీనామా చేశారు. మరోవైపు, అల్లర్లలో చాలా మంది లూటీలకు తెగబడ్డారు. ప్రైవేట్ ఆస్తులను ధ్వంసం చేశారు. ఈ అల్లర్లలో ఇప్పటి వరకు 51 మంది మరణించారు. మరణించిన వారిలో ఒక భారతీయురాలు కూడా ఉంది. ఇదిలా ఉంటే, ఖాట్మాండ్ లోని పశుపతినాథ్ ఆలయాన్ని సందర్శించి తిరిగి వస్తున్న భారతీయ యాత్రికుల బృందంపై గురువారం దాడి జరిగింది. ఉత్తర్ ప్రదేశ్ రిజిస్ట్రేషన్ నంబర్ కలిగి బస్సు భారతదేశానికి తిరిగి వస్తుండగా ఈ దాడి జరిగింది. దుండగులు బస్సుపై రాళ్లు విసిరి, అద్దాలను ధ్వంసం చేశారు.

# విశాఖవాసుల కొంగుబంగారం కనకమహాలక్ష్మి అమ్మవారు

**విశాఖపట్టణం,సెప్టెంబర్12(సమయజ్యోతి):**

శరన్నవరాత్రుల్లో విశాఖ శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపడతారు. విశాఖవాసుల కొంగుబంగారం శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారు. ఉత్తరాంధ్ర వాసులకే గాక సకల తెలుగు జనావళికి సత్యం గల తల్లిగా, కల్పవల్లిగా కోరిన వరాలిచ్చే అమృతమూర్తిగా భాసిల్లుతోంది. బంగారం కొన్నా వెండి కొన్నా తమ ఇంట వివాహ వేడుకలు జరుగుతున్నా బిడ్డ పుట్టినా విశాఖ ప్రాంతవాసులు ఆ విశేషాన్ని కనకమహాలక్ష్మికి నివేదించి, ఆశీస్సులు అందుకోవడం ఇక్కడి ఆచారం. ఇది గోపురం లేని గుడి. మూలవిరాట్టుకు భక్తులు స్వయంగా పూజలు నిర్వహించుకోవడం ఈ క్షేత్ర విశిష్టత. ఏ వేళలో అయినా దర్శించుకునేందుకు వీలుగా 24 గంటలూ తెరిచి ఉంచే ఆలయం ఇది. ఈ అమ్మవారిని సేవించుకున్నా, స్మరించుకున్నా సకల ఐశ్వర్యాలు సిద్ధిస్తాయని నమ్మకం. కనకమహాలక్ష్మి అమ్మవారు ఈ ప్రాంతాన్ని పాలించిన విశాఖ రాజుల ఇలవేల్పు. ఆమె నెలకొన్న ఈ ప్రాంతంలో ఒకప్పుడు విశాఖ రాజుల కోటబురుజు ఉండేదని, అందుచే తల్లి ఉన్న ఈ ప్రాంతాన్ని బురుజుపేటగా పిలుస్తున్నారు. కనకమహాలక్ష్మి ఆలయం మొదటి నుంచీ ప్రస్తుతం ఉన్న ప్రాంతంలోనే ఉంది. 1912 కాలంలో వీధి వెడల్పు చేస్తున్నప్పుడు అమ్మ వారి విగ్రహం కదపకుండా వీధి మధ్యలోనే ఉంచేసినా 1917లో రోడ్డు మధ్యభాగం నుంచి 30 అడుగుల దూరంలో ఒక మూలగా జరిపారు. అప్పుడే విశాఖలో ప్లేగు వ్యాధి ప్రబలింది. దీంతో ప్రజలు భయభ్రాంతులై అమ్మవారి విగ్రహాన్ని కదిలించడం వల్లే ఈ విపత్తు జరిగిందని భావించి అమ్మవారి విగ్రహాన్ని యథాస్థానంలోకి చేర్చారు. దాంతో ప్లేగు వ్యాధి తగ్గి జనం స్వస్థత చెంది ఇదంతా అమ్మవారి మహాత్మ్యం వల్ల జరిగిందన్న ప్రగాఢ విశ్వాసం ప్రబలింది. అప్పటి నుంచి ప్రజలు అమ్మవారికి ఇతోధికంగా పూజలు చేయడం ప్రారంభించారు. కాగా, ఈ గుడికి పైకప్పు కట్టడానికి జరిగిన ప్రయత్నాలు సఫలం కాలేదు. అంటే అమ్మకు అది ఇష్టం లేదని గ్రహించి ఆ తర్వాత ఆ ప్రయత్నాలను విరమించారు. అమ్మ సకల జనులకు అందు బాటులో ఉంటుంది. కనుకనే పూజలు చేసుకోవడానికి వచ్చిన భక్తులు ఎవరికి వారే అమ్మవారికి పసుపు, కుంకుమలతో పూజలు చేసి, కొబ్బరికాయలు కొట్టి నివేదించి సేవించుకొనే సంప్రదాయం ఉంది. ముఖ్యంగా స్త్రీలు అమ్మను ఐదవతనాన్ని ఇనుమడింప జేసే దేవతామూర్తిగా భావిస్తారు. అమ్మవారికి గురువారం ప్రీతికరమైన రోజు. ఆ రోజున



తెల్లవారినది మొదలు రాత్రి వరకు అమ్మను దర్శించి పసుపు, కుంకుమలతో పూజించి నారికేళం సమర్పించడానికి వచ్చే భక్తులకు అంతుండదు.

# రాష్ట్రంలో ఎరువుల కొరత లేదు

## అన్ని రకాల ఎరువులు సరిపడా నిల్వలు

## మరోమారు స్పష్టం చేసిన అచ్చన్నాయుడు




**విజయవాడ,సెప్టెంబర్12(సమయజ్యోతి):**

రాష్ట్రంలో ఎరువులకు ఎటువంటి కొరత లేకుండా అందుబాటులో ఉన్నాయని ఏపీ వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చె న్నాయుడు మరోమారు స్పష్టంచేశారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. విజయవాడలోని క్యాంప్ ఆఫీస్ లో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రస్తుతం యూరియా, డీఏపీ, పొటాష్, కాంప్లెక్స్ ఎరువులు సహా అన్నిరకాల ఎరువులు సరిపడా నిల్వలుగా ఉన్నాయని తెలిపారు. జిల్లాల వారీగా ఎరువుల నిల్వలను పరిశీలిస్తూ, కలెక్టర్లు, వ్యవసాయ శాఖాధికారులతో ప్రతిరోజూ సమీక్షలు జరుగుతున్నాయని అన్నారు. మార్కెట్‌లో ఎరువుల కొరత లేకుండా, రైతుల అవసరాలకు అనుగుణంగా సరఫరాలు కొనసాగుతున్నాయని స్పష్టం చేశారు. రైతుల కోసం కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని, ఒక్క రైతు కూడా ఇబ్బందులు పడకుండా చూడటమే లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. రైతు సంతోషంగా ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది. అందుకే రైతుల సమస్యల పరిష్కారం మా మొదటి కర్తవ్యం అని మంత్రి స్పష్టం చేశారు. ఎరువుల కొరత పేరుతో రైతులను మోసం చేయాలనుకునే డీలర్లు, డిస్ట్రిబ్యూటర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు అచ్చెన్నాయుడు. రైతుల సమస్యలు వెంటనే పరిష్కరించేలా జిల్లా కలెక్టర్లు, వ్యవసాయ శాఖాధికారులు 24 గంటలు పనిచేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలోని సహకార సంస్థలు, రైతు సేవా కేంద్రాలు, ప్రైవేట్ వ్యాపారుల వద్ద 82,054 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటు-లో ఉందని తెలిపారు. వివిధ పోర్టుల నుండి మరియు తయారీ సంస్థల నుండి 29,236, మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాలకు రవాణా దశలో ఉందన్నారు. 1,06,412 మెట్రిక్ టన్నుల యూరియా పలు పోర్టులు, తయారీ సంస్థల ద్వారా రాష్ట్రానికి సెప్టెంబర్ నెలాఖరకు చేరుకుంటాయని అన్నారు. రైతుల అవసరాలను గుర్తించిన కేంద్రం రాష్ట్రానికి మరో 24,894 మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయించారని, ఈనెల 15 తేదీ నుండి 22వ తేదీ లోపు విశాఖపట్నం పోర్టుకు యూరియా చేరుకుంటుందని తెలిపారు. ఈ యూరియా నిల్వలతో కరీఫ్ సీజన్ కు సరిపడా యూరియా అందరికి లభిస్తుందని, రాష్ట్రంలో ఎక్కడా కూడా యూరయా కొరత అనే మాట వినిపించదన్నారు.

# సూపర్ సిక్స్‌లో 90 శాతం అమలు

## ఆర్థిక ఇబ్బందులు ఉన్నా అమలుచేసి చూపాం

## పురపాలక శాఖమంత్రి నారాయాణ వెల్లడి

**విజయవాడ,సెప్టెంబర్12(సమయజ్యోతి):**

సూపర్ సిక్స్‌లో 90 శాతం అమలు చేసేశామని మంత్రి నారాయణ తెలిపారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ల ప్రమాణస్వీకార కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి నారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రమాణ స్వీకారం చేసిన డైరెక్టర్లను సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన స్వచ్ఛ భారత్‌కు అనుగుణంగా స్వచ్ఛంధ్ర కార్పొరేషన్ ఏర్పా-టైందని తెలిపారు. స్వచ్ఛమైన తాగు నీరు, ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ ప్రజలకు ఎంతో కీలకమైందని చెప్పారు.రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులున్నా.. ఇప్పటికే సూపర్ సిక్స్‌లో 90 శాతం అమలు చేశామన్నారు. స్వచ్ఛంధ్ర కార్పొరేషన్ ద్వారా అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు- వివరించారు. 85 లక్షల మెట్రిక్ టన్నుల లెగసీ వేస్ట్‌ను ఏడాదిలోగా తొలగించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారని వెల్లడించారు. ఇప్పటివరకూ 81 లక్షల టన్నుల చెత్త తొలగించినట్లు- చెప్పారు. ముఖ్యమంత్రి ఇచ్చిన టార్గెట్ అక్టోబర్ రెండో తేదీకి ముందుగానే 85 లక్షల టన్నుల వేస్ట్‌ను తొలగిస్తామని పేర్కొన్నారు. చంద్రబాబు ఆదేశాలతో మున్సిపాలిటీ-ల్లో అనేక సంస్కరణలు తీసుకొస్తున్నామని.. రాష్ట్రంలో 10 వేస్ట్ టు- ఎనర్జీ ఎ÷-లాంట్‌లు ఏర్పాటు- చేయాలని 2014లో నిర్ణయించినట్లు- గుర్తుచేశారు. ఇప్పటికే ఉన్న రెండు ఎ÷-లాంట్లకు అదనంగా త్వరలో కొత్తగా ఆరు ఎ÷-లాంట్ల నిర్మాణాలు ప్రారంభం కానున్నాయని వివరించారు. ఈ ఎ÷-లాంట్లు- అందుబాటు-లోకి వస్తే ప్రతి రోజూ వచ్చే 7000 టన్నుల చెత్తలో 6500 టన్నుల చెత్త విద్యుత్‌గా మారిపోతుందన్నారు. అదే జరిగితే దేశంలోనే ఏపీ నెంబర్ వన్ అవుతుందని చెప్పుకొచ్చారు.రాబోయే మూడేళ్లలో ప్రతి ఇంటి నుంచి వచ్చే నీటిని ట్రీ-ట్‌మెంట్ ఎ÷-లాంట్ల ద్వారా ట్రీ-ట్ చేసి బయటకు పంపిస్తామన్నారు. మున్సిపాలిటీ-లు, పంచాయతీల్లో డ్రైనేజీల నిర్మాణానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు- పేర్కొన్నారు. రాబోయే మూడేళ్లలో ప్రతి ఇంటికీ 100 శాతం స్వచ్ఛమైన తాగు నీరు కుళాయిల ద్వారా అందిస్తామని ప్రకటించారు. కార్పోరేషన్ బోర్డు చైర్మన్, డైరెక్టర్లు, అధికారులతో కలిసి స్వచ్ఛ ఏపీ దిశగా పని చేస్తారని కోరుకుంటు-న్నట్లు- నారాయణ చెప్పారు.



# అంతర్జాతీయ పర్యాటకుల గమ్యస్థానంగా తిరుపతి

## టూరిజం పాలసీపై ఇన్వెస్టర్ మీట్‌లో మంత్రి దుర్గేశ్

**తిరుపతి,సెప్టెంబర్12(సమయజ్యోతి):**

తిరుపతిని యాంకర్ హబ్‌గా చేసి జాతీయ, అంతర్జాతీయ పర్యాటకుల గమ్యస్థానంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని బలోపేతం చేయడం, ప్రైవేట్ పెట్టుబడులు ఆకర్షించడమే లక్ష్యంగా శుక్రవారం తిరుపతిలోని తాజ్ హోటల్‌లో మంత్రి దుర్గేష్ అధ్యక్షతన రీజనల్ టూరిజం ఇన్వెస్టర్స్ సమ్మిట్ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో జరుగుతున్న పర్యాటక రంగ అభివృద్ధి, పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అవకాశాలు, పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పన, నూతన పర్యాటక పాలసీ 2024-29, పర్యాటక భూ కేటాయింపుల విధానం, పర్యాటక రంగానికి కూటమి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను వివరించారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో పాటు- పర్యాటకంగా తిరుపతిలో ఉన్న అవకాశాలను తెలియజేశారు. ఇన్వెస్టర్స్, హోమ్ స్టే ఆపరేటర్స్‌తో మంత్రి ప్రత్యేకంగా చర్చలు జరిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోనే దాదాపు రూ.12,000 కోట్లు- పర్యాటక పెట్టుబడులు సాధించామంటే ఇన్వెస్టర్లలో ప్రభుత్వంపై ఉన్న విశ్వాసం స్పష్టమవుతోందన్నారు. తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయశ్రీ, టూరిజం స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్, ఏపీటీడీసీ ఎండీ, ఏపీటీఏ సీఈవో ఆమ్రపాలి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.







# ఏపీలో ఎన్ఎస్‌డీ క్యాంపస్ ఏర్పాటు యోచన

## తెలుగు సినిమా గ్లోబల్ అవుతోందన్న పవన్ కళ్యాణ్

**న్యూఢిల్లీ,సెప్టెంబర్12(సమయజ్యోతి):**

తెలుగు సినిమా ఇప్పుడు గ్లోబల్ సినిమా అవుతోందని ఏపీ ఉప ముఖ్యమంత్రి, సినీనటు-డు పవన్ కల్యాణ్ అన్నారు. దిల్లీ పర్యటనలో భాగంగా నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా(ఎన్ఎస్‌డీ) కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్ఎస్‌డీని చూస్తే మినీ ఇండియాలా దర్శనమిస్తోందని చెప్పారు. తనకు నటన నేర్పిన సత్యానంద్ ఎస్ఎస్‌డీ గురించి గొప్పగా చెప్పేవారని గుర్తు చేసుకున్నారు. కళలు లేకపోతే సమాజంలో హింస ప్రబలుతుందని వ్యాఖ్యానించారు. ఏపీలో ఎన్ఎస్‌డీ క్యాంపస్ ఏర్పాటు- చేసే ఆలోచనలో ఉన్నామన్నారు. క్యాంపస్ ఏర్పాటు-పై సీఎం చంద్రబాబుతో చర్చిస్తానని తెలిపారు.



# పాకిస్తాన్‌తో మ్యాచ్‌లో కుల్దీప్ యాదవ్ ఆడేనా?



ఆసియా కప్ లో శుభారంభం చేసిన టీమిండియా ఇప్పుడు పాకిస్థాన్‌తో జరిగే మ్యాచ్‌కు సిద్ధమవుతోంది. రెండు దేశాలకు ఇది ప్రతిష్ఠాత్మకమైన మ్యాచ్. కాబట్టి, రెండు జట్లు గెలవాల్సిన ఒత్తిడిలో ఉన్నాయి. అందువల్ల, రెండు జట్లు బలమైన జట్టుతో మైదానంలోకి దిగనున్నాయి. ఇదిలా ఉండగా, టీమిండియా గురించి మాట్లాడితే, యూఏఈతో జరిగిన మ్యాచ్‌లో ఒకే ఓవర్‌లో 3 వికెట్లు తీసిన కుల్దీప్ యాదవ్‌కు పాకిస్థాన్‌తో జరిగే జట్టులో చోటు దక్కడం సందేహమేనని సంజయ్ మంజ్రేకర్ అన్నారు. దుబాయ్ ఇంటర్నేషనల్ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో యూఏఈ జట్టు కేవలం 57 పరుగులకే ఆలౌట్ అయింది. ఇంత తక్కువ స్కోరుకే జట్టును ఆలౌట్ చేయడంలో కీలక పాత్ర పోషించిన కుల్దీప్ 2.1 ఓవర్లలో కేవలం 7 పరుగులకు 4 వికెట్లు తీసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు. అయితే, తదుపరి మ్యాచ్‌లో కుల్దీప్‌కు అవకాశం లభించదని సంజయ్ మంజ్రేకర్ సోషల్ మీడియాలో ఒక పోస్ట్‌ను షేర్ చేశాడు. ప్రముఖ వ్యాఖ్యాత సంజయ్ మంజ్రేకర్ తన %శ% ఖాతాలో 'ఒకే ఓవర్‌లో 3 వికెట్లు తీసిన తర్వాత కుల్దీప్ యాదవ్ తదుపరి మ్యాచ్ ఆడకపోవచ్చు' అని రాసుకొచ్చాడు. ఇంత మంచి ప్రదర్శన ఇచ్చినప్పటికీ, కుల్దీప్ తదుపరి మ్యాచ్‌లో అవకాశం రాకపోవచ్చు అని మంజ్రేకర్ ఎందుకు అన్నాడోనని మీరందరూ ఆలోచిస్తుండవచ్చు. కానీ సమాధానం ఏమిటంటే, మంజ్రేకర్ ఈ పోస్ట్‌ను టీమిండియా మేనేజ్‌మెంట్‌ను ఎగతాళి చేస్తూ షేర్ చేశాడన్నమాట.నిజానికి, మంజ్రేకర్ ప్రకటన వెనుక కారణం టీం ఇండియాలో కుల్దీప్ కెరీర్. కుల్దీప్ 2017 లో టీం ఇండియా తరపున అరంగేట్రం చేశాడు. కానీ, అప్పటి నుంచి చాలాసార్లు జట్టు నుంచి తొలగించారు. చాలా సందర్భాలలో, అతని మంచి ప్రదర్శన ఉన్నప్పటికీ, అతను ప్లేయింగ్ 11 నుంచి లేదా జట్టు నుంచి తొలగించారు. ముఖ్యంగా టెస్ట్ క్రికెట్‌లో అతని ప్రస్థానం ప్రశ్నార్థకంగా మారింది. 2019 లో, ఆస్ట్రేలియాతో జరిగిన సిడ్నీ టెస్ట్‌లో 5 వికెట్లు పడగొట్టినప్పటికీ, అతన్ని తొలగించారు. ఆ తర్వాత 2021 లో, అతనికి 1 టెస్ట్ మ్యాచ్ మాత్రమే ఆడే అవకాశం లభించింది. ఆ తర్వాత డిసెంబర్ 2022 లో, అతనికి మళ్ళీ ఆడే అవకాశం లభించింది. బంగ్లాదేశ్‌తో జరిగిన ఆ మ్యాచ్‌లో కుల్దీప్ మళ్లీ 5 వికెట్లు పడగొట్టాడు. అయినప్పటికీ, అతన్ని తొలగించారు. 2024లో నేరుగా జట్టులోకి తిరిగి వచ్చిన కుల్దీప్, గత సంవత్సరం మంచి ప్రదర్శన ఇచ్చినప్పటికీ ఆస్ట్రేలియా పర్యటన, ఆ తరువాత ఇంగ్లాండ్ పర్యటనలో ఒక్క టెస్ట్ మ్యాచ్ కూడా ఆడే అవకాశం రాలేదు. అదేవిధంగా, గత సంవత్సరం జరిగిన టీ20 ప్రపంచ కప్‌లో, అతనికి గ్రూప్ దశ మ్యాచ్‌లలో ఆడే అవకాశం రాలేదు. సూపర్-4 రౌండ్‌లో ఆడే అవకాశం వచ్చినప్పుడు అతను అద్భుతంగా రాణించాడు. దీని కారణంగా, అతని మంచి ప్రదర్శన తర్వాత టీం ఇండియా మేనేజ్‌మెంట్ చాలాసార్లు కుల్దీప్‌ను జట్టు నుంచి తప్పించడానికి ప్రయత్నించింది. అందుకే మంజ్రేకర్ అలాంటి పోస్ట్‌ను షేర్ చేశాడు.

# షాహిద్ అఫ్రిదీ వివాదాస్పద వ్యాఖ్యలు

భారత్, పాకిస్థాన్ మ్యాచ్‌కి ముందు పాక్ మాజీ క్రికెటర్ షాహిద్ అఫ్రిదీ వివాదాస్పద వ్యాఖ్యలు చేశాడు. ఆసియా కప్ 2025లో భాగంగా ఈ నెల 14న అంటే ఆదివారం దుబాయ్ వేదికగా భారత్, పాక్ జట్లు తలపడనున్నాయి. ఈ క్రమంలో ఓ టీవీ షోలో పాల్గొన్న అఫ్రిదీ టీమిండియా మాజీ క్రికెటర్ ఇర్ఫాన్ పఠాన్‌పై పరోక్షంగా విమర్శలు గుప్పించాడు. కొంతమంది టీమిండియా క్రికెటర్లు తాము భారతీయులం అని నిరూపించుకునేందుకు ఆరాట పడుతున్నారని అన్నాడు. అలాగే పాకిస్థాన్‌తో భారత్ క్రికెటర్ ఆడేందుకు వేదికలు, టోర్నమెంట్లు అంటూ భారత్ సాకులు చెబుతోందని విమర్శించారు. ఇలా ద్వంద్వ వైఖరి అవలంభించడం సరికాదని అన్నాడు. ఆసియా కప్‌లో పాకిస్థాన్‌తో మ్యాచ్ ఆడొద్దనే డిమాండ్ వ్యక్తం అయినప్పటికీ.. బీసీసీఐ పాక్‌తో మ్యాచ్‌కు ఓకే చెప్పింది. కానీ, అంతకంటే ముందు రిటైర్డ్ ఆటగాళ్లు పాల్గొన్న లెజెండ్స్ టోర్నీలో మాత్రం భారత మాజీ క్రికెటర్లు పాకిస్థాన్‌తో మ్యాచ్ ఆడేందుకు నిరాకరించారు. లీగ్ దశలో ఒక మ్యాచ్‌లో, అలాగే సెమీ ఫైనల్ మ్యాచ?ను పాకిస్థాన్‌తో ఆడాల్సి ఉండగా.. యువరాజ్ సింగ్ కెప్టెన్సీలోని టీమిండియా తమకు దేశం ముఖ్యం అంటూ పాకిస్థాన్‌తో మ్యాచ్‌ను రద్దు చేసుకుంది. దీనిపై ఆ టోర్నీలో పాక్ కెప్టెన్‌గా వ్యవహరించిన అఫ్రిదీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాడు. అప్పుడు ఆడని వాళ్లు, ఇప్పుడు ఆసియా కప్‌లో పాకిస్థాన్‌తో ఎలా ఆడతారంటూ ప్రశ్నించాడు. ఈ ద్వంద్వ వైఖరి సరికాదని, పూర్తిగా పాకిస్థాన్‌తో క్రికెట్ ఆడటమే మానుకోవాలని కూడా అన్నాడు.





# మ్యాథ్యూ హేడెన్ కీలక వ్యాఖ్యలు

క్రికెట్?లో అత్యంత ప్రతిష్ఠాత్మక టెస్టు సిరీసుల్లో యాషెస్ ఒకటి. ఆస్ట్రేలియా- ఇంగ్లాండ్ జట్ల మధ్య జరిగే ఐదు టెస్టు మ్యాచ్?ల యాషెస్ సిరీస్?పై సర్వత్రా ఆసక్తి ఉంటుంది. ఇందులో సెంచరీ చేసినా, ఐదు వికెట్లు కూల్చినా ఆ ప్లేయర్ల పేరు మార్మోగిపోతుంది. అయితే ఈ నవంబర్ 21న యాషెస్ సిరీస్ ప్రారంభం కానుంది. ఈ సిరీస్?కు ఆస్ట్రేలియా వేదిక కానుంది. ఈ నేపథ్యంలో ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ మ్యాథ్యూ హేడెన్ హాట్ స్టేట్?మెంట్ ఇచ్చాడు. రీసెంట్?గా ఓ యూట్యూబ్ ఛానెల్?లో మాట్లాడిన హేడెన్ ఇంగ్లాడ్? జట్టులోని ఓ బ్యాటర్ సెంచరీ చేయకపోతే, తాను 'నగ్నంగా నడుస్తా' అని అన్నాడు. ఈ స్టేట్?మెంట్ వైరల్?గా మారింది. దీంతో అతడిని సెంచరీ చేయాలంటూ హేడెన్ కుమార్తె గ్రేస్ హేడెన్ సదరు బ్యాటర్?కు విజ్ఞప్తి చేసింది. ఇంగ్లాండ్ సీనియర్ బ్యాటర్ జో రూట్ ప్రస్తుతం టెస్టు ఫార్మాట్?లో సూపర్ ఫామ్?లో ఉన్నాడు. టెస్టుల్లో అత్యధిక పరుగులు చేసిన సచిన్ తెందూల్కర్ (15,921 పరుగులు) తర్వాత రెండో స్థానంలో రూట్ ఉన్నాడు. ప్రస్తుతం రూట్ 13543 పరుగులతో ప్రపంచంలోనే అత్యధిక టెస్టు పరుగులు చేసిన రెండో బ్యాటర్?గా కొనసాగుతున్నాడు. అతడు తొలి స్థానంలోకి వెళ్లాలంటే కావల్సింది ఇంకా 2,400 పరుగులే. ఈ క్రమంలో రానున్న యాషెస్ రూట్?లో అత్యంత కీలకం కానుంది. అయితే ఆస్ట్రేలియా గడ్డపై రూట్ గణాంకాలు గొప్పగా ఏమీ లేవు. ఇప్పటివరకు ఆసీస్?లో 14 టెస్టులు ఆడితే 35.68 సగటుతో 892 పరుగులే చేశాడు. ఇందులో 9 సెంచరీలు ఉన్నాయి. కానీ ఒక్క సెంచరీ లేకపోవడం గమనార్హం. ఈ క్రమంలో ఆసీస్ మాజీ క్రికెటర్ హేడెన్, రూట్‌పై ఒత్తిడి పెంచేలా ఈ సవాల్ విసిరాడు. ఒకవేళ యాషెస్‌లో రూట్ ఒక్క సెంచరీ కూడా చేయకపోతే నేను మెల్‌బోర్న్ క్రికెట్ మైదానం చుట్టూ నగ్నంగా నడుస్తా" అని సోషల్ మీడియాలో పోస్టు పెట్టాడు. అయితే హేడెన్ స్టేట్?మెంట్ తెగ వైరల్ అయ్యింది. దీంతో అతడి కుమార్తె ఈ పోస్ట్?కు స్పందించింది. ఈ సందర్భంగా రూట్‌కు ఓ రిక్వెస్ట్ చేసింది. 'ప్లీజ్ రూట్. ఒక్క సెంచరీ అయినా బాదు' అని కామెంట్ సెక్షన్?లో కామెంట్ రాసుకొచ్చింది. తండ్రి అలా బోల్డ్ స్టేట్?మెంట్ ఇవ్వడంతో, ప్రత్యర్థి జట్టు బ్యాటర్?ను కూడా సెంచరీ కొట్టమనే పరిస్థితి గ్రేస్?కు వచ్చింది. ప్రస్తుతం ఇది క్రీడావర్గాల్లో హాట్?టాపిక్?గా మారింది. కాగా, మెల్?బోర్న్ వేదికగా నాలుగో టెస్టు జరగనుంది. కాగా, ఈ సిరీస్? 1882- 83లో ప్రారంభమైంది. ఇరుదేశాలకు ఈ సిరీస్ ప్రతిష్ఠాత్మకం. చివరిసారిగా 2023లో సిరీస్ జరిగింది. అప్పుడు ఆస్ట్రేలియా విజేతగా నిలిచింది. ఓవరాల్?గా ఆసీస్? 34సార్లు నెగ్గగా, ఇంగ్లాండ్ 32సార్లు సిరీస్?లో దక్కించుకుంది. 5 సిరీస్?లు డ్రా గా ముగిశాయి.



# ప్రభుత్వం సలహా మేరకు నడుచుకుంటాం

## భారత్-పాక్ మ్యాచ్‌పై అరుణ్ ధుమాల్



ఆసియా కప్ 2025లో భాగంగా భారత్, పాకిస్థాన్ జట్లు తలపడనున్నాయి. పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా ఉగ్రవాదుల ఏరివేతే లక్ష్యంగా భారత్ నిర్వహించిన ఆపరేషన్ సింధూర్ తర్వాత ఈ రెండు దేశాలు తలపడటం ఇదే తొలిసారి. ఈ నేపథ్యంలో భారత్-పాక్ మ్యాచ్‌పై ఐపీఎల్ ఛైర్మన్ అరుణ్ ధుమాల్ ఓ కీలక ప్రకటన చేశారు. ప్టెంబర్ 14న భారత్, పాకిస్థాన్ మధ్య ఆసియా కప్ 2025లో భాగంగా కీలక మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్ కోసం ఇప్పటికే సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. భారత జట్టు ఇప్పటికే టోర్నమెంట్?లో తన ప్రయాణాన్ని ప్రారంభించింది. సెప్టెంబర్ 10న యూఏఈతో జరిగిన మ్యాచ్‌లో భారత్ 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి శుభారంభం చేసింది. అయితే ఈ భారత్-పాకిస్థాన్ మ్యాచ్‌ను చాలా మంది వ్యతిరేకిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఐపీఎల్ ఛైర్మన్ అరుణ్ ధుమాల్ దీనిపై తన అభిప్రాయానని వెల్లడించారు.అరుణ్ ధుమాల్ మాట్లాడుతూ.. " ఆసియా కప్ కోసం భారత జట్టుకు నా శుభాకాంక్షలు. ద్వైపాక్షిక మ్యాచ్‌ల విషయంలో పాకిస్తాన్‌తో ఆడబోమని ప్రభుత్వం తమ వైఖరిని స్పష్టం చేసింది. అయితే ఏసీసీ లేదా ఐసీసీ టోర్నమెంట్లు ఉన్నప్పుడు మనం వాటిలో పాల్గొనాల్సి ఉంటుంది. అందుకే మనం ప్రభుత్వం సలహా మేరకు నడుచుకుంటాం" అని తెలిపారు. అరుణ్ ధుమాల్‌తో పాటు దేశంలోని అనేక ప్రముఖులు భారత్-పాకిస్థాన్ మ్యాచ్‌పై తమ స్పందనలు తెలియజేశారు. ఆసియా కప్ చరిత్రను చూస్తే భారత్ అత్యధిక సార్లు టైటిల్‌ను గెలుచుకుంది. ఇప్పటివరకు టీమిండియా మొత్తం 8 టైటిళ్లు గెలుచుకోగా.. శ్రీలంక 6 టైటిళ్లతో రెండో స్థానం ఉంది. పాకిస్థాన్ రెండు టైటిళ్లను గెలుచుకుంది. బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్, యూఏఈ, ఇతర ఆసియా దేశాలు తమ మొదటి ట్రోఫీ కోసం ఎదురుచూస్తున్నాయి. భారత్ 1984, 1988, 1990/91, 1995, 2010, 2016, 2018, 2023లో టైటిళ్లను గెలుచుకుంది. ఆసియా కప్ 2025లో కూడా భారత్ తన టైటిల్‌ను నిలబెట్టుకోవడానికి సిద్ధంగా ఉంది. తొలిసారిగా సూర్యకుమార్ యాదవ్ భారత జట్టుకు ఆసియా కప్‌లో కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నారు. సూర్యకుమార్ యాదవ్‌పై భారీ అంచనాలు ఉన్నాయి.



# బంగ్లా చేతిలో హాంకాంగ్ ఓటమి

ఆసియా కప్ లో బంగ్లాదేశ్ శుభారంభం చేసింది. గురువారం అబుధాబిలోని షేక్ జయేద్ స్టేడియంలో జరిగిన మ్యాచ్ లో హాంకాంగ్ పై ఏడు వికెట్లతో గెలుపొందింది. అన్ని రంగాల్లో రాణించిన బంగ్లా.. కంఫర్టబుల్ విక్టరీని తన సొంతం చేసుకుంది. అంతకుముందు టాస్ ఓడి ఫస్ట్ బ్యాటింగ్ చేసిన హాంకాంగ్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 143 పరుగులు చేసింది. మిడిలార్డర్ బ్యాటర్ నిజఖాత్ ఖాన్ (40 బంతుల్లో 42, 2 ఫోర్లు, 1 సిక్సర్) తో టాప్ స్కోరర్ గా నిలిచాడు. తస్కిన్ అహ్మద్, తంజిమ్ హసన్ షకీబ్, రిషాద్ హుస్సేన్ లకు తలో రెండు వికెట్లు లభించాయి. అనంతరం టార్గెట్ ను 17.4 ఓవర్లలోనే మూడు వికెట్లు కోల్పోయి 144 పరుగులు చేసి, బంగ్లా ఛేదించింది. లిటన్ దాస్ కెప్టెన్ ఇన్నింగ్స్ (39 బంతుల్లో 59, 6 ఫోర్లు, 1 సిక్సర్)తో సూపర్ ఫిఫ్టీ కొట్టి, టాప్ స్కోరర్ గా నిలిచాడు. బౌలర్లలో అతీఖ్ ఇక్బాల్ కు రెండు వికెట్లు దక్కాయి. ఈ ఫార్మాట్ లో హాంకాంగ్ పై బంగ్లాకిదే తొలి విక్టరీ కావడం విశేషం. ఇక ఈ పరాజయంతో హాంకాంగ్ దాదాపుగా టోర్నీ నుంచి నిష్క్రమించింది. తొలి మ్యాచ్ లో ఆఫ్గానిస్తాన్ చేతిలోనూ ఓడిన హాంకాంగ్.. రెండు పరాజయాలతో అట్టడుగున నిలిచింది. ఏదైనా అద్భుతం జరిగితే తప్ప, ఆ జట్టు ఇంటిముఖం పట్టడం ఖాయమే.టాస్ గెలిచి ప్రత్యర్థిని బ్యాటింగ్ కు ఆహ్వానించిన బంగ్లాకు బౌలర్లు చక్కని సహకారం అందించారు. వరుస విరామాల్లో వికెట్లు తీస్తూ, ప్రత్యర్థిపై పై చేయి సాధించేలా చేశారు. ఈ ఇన్నింగ్స్ లో ఒక్క ఫిఫ్టీ భాగస్వామ్యం కూడా లేక పోవడం విశేషం. నిజఖత్ తోపాటు ఓపెనర్ జీషాన్ అలీ (30), కెప్టెన్ యాసిమ్ ముర్తుజా (28) మాత్రమే కాస్త ఫర్వాలేదనిపించారు. మిగతా వాళ్లు బ్యాట్లు ఎత్తేయడంతో హాంకాంగ్ ఓ మాదిరి స్కోరుకే పరిమితమైంది. దీంతో ప్రత్యర్థి ముందు కాస్త చిన్న టార్గెట్ నే నిర్దేశించింది. ఇక చిన్న టార్గెట్ తో బరిలోకి దిగిన బంగ్లాకు శుభారంభం దక్కలేదు. ఆరంభంలోనే ఓపెనర్లు పర్వేజ్ హుస్సేన్ ఈమన్ (19), తంజిద్ హసన్ (14) వికెట్లను కోల్పోయింది. వన్ డౌన్ బ్యాటర్ గా బరిలోకి దిగిన కెప్టెన్ లిటన్ దాస్ తన సత్తా చాటాడు. తౌహిద్ హృదయ్ (36 బంతుల్లో 35 నాటౌట్, 1 ఫోర్) తో కలిసి ఇన్నింగ్స్ నిర్మించాడు. ఒక ఎండ్ లో తౌహిద్ యాంకర్ రోల్ పోషించగా, దాస్ మాత్రం కాస్త వేగంగా ఆడాడు. ప్రత్యర్థి బౌలర్లను సునాయసంగా ఎదుర్కొన్న దాస్.. 33 బంతుల్లోనే ఫిఫ్టీ కొట్టాడు. ఈ క్రమంలో మూడో వికెట్ కు 95 పరుగులు జోడించాక, ఆఖర్లో దాస్ ఔటయ్యాడు. ఆ తర్వాత జాకీర్ అలీ తో కలిసి తౌహిద్ మిగతా లాంఛనాన్ని పూర్తి చేశాడు. అర్ధ సెంచరీ చేసిన దాస్ కే ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు దక్కింది. తర్వాత మ్యాచ్ లో శనివారం (ఈనెల 13న) శ్రీలంకతో బంగ్లా, సోమవారం (ఈనెల 15న) శ్రీలంకతోనే హాంకాంగ్ తలపడనుంది.


# మనం మ్యాచ్ గెలుస్తామని నమ్మకం ఉంది

## పదే పదే మ్యాచ్ రద్దు చేయాలని అడగకూడదు

## టీమ్‌ఇండియా దిగ్గజం కపిల్ దేవ్

2025 ఆసియా కప్‌లో భారత్- పాకిస్థాన్ మ్యాచ్ కోసం క్రికెట్ లవర్స్ ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు. మరో రెండు రోజుల్లో ఈ మోస్ట్ అవెయిటెడ్ మ్యాచ్ జరగనుంది. దుబాయ్ ఇంటర్నేషనల్ స్టేడియం వేదికగా ఆదివారం (సెప్టెంబర్ 14)న రాత్రి 8 గంటలకు మ్యాచ్ ప్రారంభం కానుంది. దీంతో అందరి కళ్లీ ఈ పోరుపైనే ఉన్నాయి. టోర్నీ మొత్తంలో ఇదే హై వోల్టేజ్ మ్యాచ్ అనడంలో సందేహం లేదు. అయితే ఈ ఫైట్?? కోసం ఓవైపు ఫ్యాన్స్? వెయిట్ చేస్తుంటే, మరోవైపు ఈ మ్యాచ్?ను రద్దు చేయాలంటూ మరికొందరు అభిమానులు సోషల్ మీడియాలో ట్రెండ్ చేస్తున్నారు. పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో పాక్?తో టీమ్‌ఇండియా క్రికెట్ ఆడవద్దంటూ కొందరు పోస్ట్?లు షేర్ చేస్తున్నారు. మ్యాచ్?ను రద్దు చేయాలంటూ కోరుతున్నారు. అయితే ఈ కాంట్రవర్సీపై టీమ్‌ఇండియా దిగ్గజం కపిల్ దేవ్ స్పందించారు. షెడ్యూల్ ప్రకారం ఈ మ్యాచ్? జరగనివ్వాలని కపిల్ దేవ్ ఫ్యాన్స్?ను కోరాడు. పదే పదే మ్యాచ్? రద్దు చేయాలని అడగకూడదని అన్నాడు. మ్యాచ్?ను రద్దు చేయడం బీసీసీఐ చేతుల్లోనో, పీసీబీ చేతుల్లోనో లేదని చెప్పాడు. ఆ నిర్ణయం తీసుకోవాల్సింది ఇరుదేశాల ప్రభుత్వాలని కపిల్ దేవ్ రీసెంట్?గా మీడియాతో చిట్?చాట్?లో పేర్కొన్నాడు. "ఇది అద్భుతమైన జట్టు. టీమ్‌ఇండియాకు గుడ్ లక్. మనం మ్యాచ్? గెలుస్తామని నమ్మకం ఉంది. మన టీమ్ ట్రోఫీతో ఇంటికి తిరిగివస్తుందని ఆశిస్తున్నా. ఆటపైనే పూర్తిగా దృష్టి పెట్టండి. మ్యాచ్? నెగ్గడంపైనే ఫోకస్ ఉంచండి. మీ పని క్రికెట్ ఆడడమే. ఎవరూ కూడా మ్యాచ్ ఆడడాన్ని పెద్ద సమస్యగా మార్చకండి. ప్రభుత్వం తమ పని తాము చేసుకుంటుంది. ఆటగాళ్లు మీ పని మీరు చేయండి" అని కపిల్ దేవ్ అన్నాడు. కాగా, ఈ మ్యాచ్?ను ఆపాలని కొందరు ఇటీవల సుప్రీంకోర్టును కూడా ఆశ్రయించారు. మ్యాచ్ జరగాడానికి కొన్ని రోజులే ఉన్న నేపథ్యంలో తమ పిటిషన్‌ను త్వరగా విచారించాలని పిటిషన్లు విజ్ఞప్తి చేశారు. అయితే దానికి కోర్టు నిరాకరించింది. ఇది క్రికెట్ మ్యాచ్ మాత్రమే. ఇందులో తొందరేం లేదని కోర్టు పేర్కొంది. పహల్గామ్ టెర్రర్ ఎటాక్ తర్వాత భారత్- పాక్ మధ్య రాజకీయ సంబంధాలు మరింత క్షీణించాయి. దీంతో ఆసియా కప్ షెడ్యూల్ ప్రకటించినప్పటి నుంచి టోర్నీలో భారత్- పాక్ మ్యాచ్ ఉండడాన్ని కొందరు తప్పుబడుతున్నారు. ఈ పోరును బాయ్?కట్ చేయాలంటూ ట్రెండ్ చేస్తున్నారు. అయితే ద్వైపాక్షిన సిరీస్?లు తప్పా, మల్టీనేషనల్ టోర్నీల్లో పాక్?తో ఆడేందుకు భారత ప్రభుత్వ పాలసీకి తాము కట్టుబడి ఉన్నామని బీసీసీఐ ఇప్పటికే స్పష్టం చేసింది. ఈ క్రమంలోనే భారత్ మల్టీనేషనల్ టోర్నీల్లోనే పాత్?తో ఆడుతుంది. ద్వైపాక్షిక సిరీస్?ల్లో ఎప్పటిలాగే నిషేధం కొనసాగుతుంది.కాగా, ఈ టోర్నీలో గడిచిన 16 ఎడిషన్లలో మొత్తం 19సార్లు ఢీ కొట్టాయి. ఇందులో భారత్ అత్యధికంగా 10 మ్యాచ్?ల్లో నెగ్గింది. పాకిస్థాన్ ఆరు మ్యాచ్?ల్లోనే విజయం సాధించింది. మరో 3 మ్యాచ్?ల్లో ఫలితం తేలలేదు.






# మిరాయ్ వీఎఫ్ఎక్స్ అద్భుతం
## సోషల్ మీడియాలో ప్రశంసలు

తేజ సజ్జా, మంచు మనోజ్ కీలక పాత్రల్లో యువ దర్శకుడు కార్తీక్ ఘట్టమనేని రూపొందించిన ఫాంటసీ ఫిల్మ్ 'మిరాయ్' భారీ అంచనాల మధ్య ప్రేక్షకుల ముందుకువచ్చింది. దీని వీఎఫ్ఎక్స్‌పై సోషల్ మీడియాలో ప్రశంసలు కురుస్తున్నాయి. వీఎఫ్ఎక్స్ వర్క్ అద్భుతంగా ఉందంటూ నెటిజన్లు చిత్రబృందాన్ని అభినందిస్తున్నారు. తాజాగా దీనిపై నిర్మాత విశ్వప్రసాద్ పోస్ట్ పెట్టారు. దీని విడుదలకు ముందు విశ్వప్రసాద్ పలు ఇంటర్వ్యూల్లో ఈ సినిమా వీఎఫ్ఎక్స్‌పై ధీమా వ్యక్తంచేసిన విషయం తెలిసిందే. తాజాగా సినిమా విడుదలయ్యాక ఆయన ఇదే విషయాన్ని ప్రస్తావించారు. 'మా టీ-మ్‌ను చూస్తుంటే నాకు చాలా గర్వంగా ఉంది. -ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో కూడా నేను వీఎఫ్ఎక్స్ గురించి ప్రత్యేకంగా చెప్పాను (ఃసశ ÷ఎఎ÷ౄ). ఎంతో అద్భుతంగా దీన్ని తీర్చిదిద్దారు. ఫ్రేమ్ టూ ఫ్రేమ్ చెక్ చేసినా బ్లర్ లేకుండా స్పష్టంగా కనిపిస్తున్నాయి. నిజంగా అసాధారణమైన పనిని చేశారు' అంటూ టీ-మ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సినిమా విడుదల సందర్భంగా సోషల్ మీడియాలో సందడి నెలకొంది. మూవీ టీ-మ్‌కు ఆల్ ది బెస్ట్ చెబుతూ అభిమానులు పోస్ట్‌లు పెడుతున్నారు. మంచు మనోజ్ కీలక పాత్రలో కనిపించిన ఈ సినిమాకు మంచు విష్ణు ఆల్ ది బెస్ట్ చెప్పారు. మంచి విజయం సాధించాలని కోరుకున్నారు.

# విజువల్ ఎఫెక్ట్స్ పెద్ద అసెట్
## కొత్తదనంతో వచ్చిన మిరాయ్

హను-మాన్'తో భారీ విజయాన్ని అందుకున్న తేజ సజ్జా 'మిరాయ్'తో సూపర్ యోధాగా యాక్షన్ హంగామా చూపించేందుకు సిద్ధమయ్యాడు. 'ఈగల్' తర్వాత కార్తీక్ ఘట్టమనేని తెరకెక్కించిన చిత్రమిది. మంచు మనోజ్ ప్రతినాయకుడిగా నటించడం టీజర్, -ట్రైలర్లు అద్భుతమైన విజువల్స్‌తో ఆకట్టు-కోవడం.. ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలేర్పడ్డాయి.సామ్రాట్ అశోక్ కళింగ యుద్ధం గెలిచాక.. జరిగిన విధ్వంసాన్ని తలచుకుని పశ్చాత్తాప్పడతాడు. ఆ వినాశనానికి తనలోని దైవశక్తే ఓ కారణమని భావించి.. ఆ శక్తిని తొమ్మిది గ్రంథాల్లో నిక్షిప్తం చేసి.. వాటి రక్షణ బాధ్యతను తొమ్మిది మంది యోధుల చేతుల్లో పెడతాడు. కొన్ని శతాబ్దాల తర్వాత ఆ గ్రంథాలపై దుష్టశక్తి మహావీర్ లామా (మంచు మనోజ్) కన్నుపడుతుంది. అతను తనకున్న తంత్ర శక్తులతో ప్రపంచంలోని వివిధ ప్రదేశాల్లో ఉన్న ఎనిమిది మహిమాన్విత గ్రంథాల్ని.. దానికి రక్షణగా ఉన్న యోధుల్ని తుద ముట్టించి హస్తగతం చేసుకుంటాడు. అయితే అతను కోరుకున్నట్లుగా అమరత్వాన్ని సాధించి.. ప్రపంచాన్ని శాసించే శక్తిగా ఎదగాలంటే తొమ్మిదో గ్రంథం అవసరమవుతుంది. కానీ, అమరత్వానికి సంబంధించిన ఆ గ్రంథాన్ని సొంతం చేసుకోవడం అంత తేలిక కాదు. ఎందుకంటే దానికి రక్షణగా ఉండేది అంబిక. మహావీర్ రూపంలో ప్రపంచానికి ఎదురు కానున్న ముప్పును ముందే జ్ఞాన దృష్టితో చూసిన అంబిక.. అతన్ని ఎదుర్కొనేందుకు తనకు పుట్టిన బిడ్డ వేద (తేజ సజ్జా)ను పసికందుగా ఉన్నప్పుడే దూరం చేసుకుంటుంది. మరి ఆ తర్వాత ఏమైంది? అనాథగా వివిధ ప్రాంతాల్లో పెరిగిన వేద తన బాధ్యతను.. తల్లి ఆశయాన్ని ఎలా తెలుసుకుంటాడు? మహావీర్ లామా నుంచి ప్రపంచానికి ఎదురు కానున్న ముప్పును తప్పించేందుకు అతనేం చేశాడు? ఇందుకు అతనికి రాముడు సృష్టించిన మిరాయ్ అస్త్రం ఎందుకు అవసరమైంది? చివరికి యుద్ధంలో ఎవరు గెలిచారు? అన్న అంశాలే కథగా చిత్రం తెరకెక్కింది. తొమ్మిది మహిమాన్విత గ్రంథాల సాయంతో అమరత్వాన్ని పొంది, తాను కోరుకున్నట్లు-గా సరికొత్త ప్రపంచాన్ని సృష్టించాలనుకునే ఓ దుష్టశక్తికి.. ఆ వినాశాన్ని అడ్డుకునేందుకు దైవ సంకల్పంతో పుట్టిన ఓ సామాన్య మానవుడికి మధ్య జరిగిన సంగ్రామమే క్లుప్తంగా ఈ చిత్ర కథాంశం. కథను త్రేతాయుగంలోని శ్రీరాముడి నేపథ్యంతో ముడిపెట్టిన తీరు.. ఆయన కోదండాన్ని మిరాయ్ అస్త్రంలా సినిమాలో వినియోగించుకున్న విధానం.. ఈ మొత్తాన్ని తల్లి సెంటిమెంట్‌తో ముడివేసిన తీరు.. ఇలా అన్నీ ఇటు పిల్లల్ని అటు పెద్దల్ని థ్రిల్ చేసేలా ఉంటాయి. ఓ కొత్త సినిమాటిక్ అనుభూతిని అందిస్తాయి.టైటిల్ కార్డ్స్‌తోనే ప్రభాస్ వాయిస్‌తో కళింగ యుద్ధ నేపథ్యాన్ని.. తొమ్మిది గ్రంథాలకి ఉన్న విశిష్ఠతను, శక్తిని పరిచయం చేసిన తీరు ప్రేక్షకులకు ఓ సర్‌ప్రైజ్ ఎలిమెంట్. దీంతో కథ మొదలైన దగ్గరి నుంచే ప్రేక్షకుడు దానితో కలిసి ప్రయాణం చేయడం ప్రారంభిస్తాడు. ఆ తర్వాత ఒకవైపు అంబిక.. మరోవైపు మహావీర్ లామా పాత్రల్ని తెరపైకి తెచ్చి.. వాళ్ల లక్ష్యాల్ని.. వారివల్ల కథలో సంఘర్షణ ఎలా పుట్టనుందన్నది రుచి చూపించారు. ఇక లామా నుంచి ఎదురు కానున్న ముప్పు అడ్డుకునేందుకు అంబిక బిడ్డను వెతికి తీసుకొచ్చేందుకు కథానాయిక సిద్ధమవ్వడం.. ఈ క్రమంలో చార్మినార్ కుర్రాడిగా హీరో తెరకు పరిచయమైన తీరు.. ఈ మధ్యలో వచ్చే యాక్షన్ సీక్వెన్స్ అలరిస్తాయి. హీరో ఎప్పుడైతే తన జన్మ రహస్యాన్ని.. తల్లి సంకల్పాన్ని తెలుసుకుని మిరాయ్ అస్త్రాన్ని సాధించేందుకు ప్రయాణం ప్రారంభిస్తాడో అక్కడి నుంచే కథ మరింత రసవత్తరంగా మారుతుంది. ఈ క్రమంలో కళ్లు చెదిరేలా సంపాతి ఎపిసోడ్‌తో విరామ సన్నివేశాల్ని తీర్చిదిద్దుకున్న విధానం ప్రేక్షకుల్ని థ్రిల్ చేస్తుంది.మిరాయ్ వేద చేతికి వచ్చాక అతను యోధాగా ఎలా మారాడు.. తల్లి జాడను వెతుక్కుంటూ వెళ్లిన ప్రయాణంలో అతను తెలుసుకున్న నిజమేంటి? ఆమె తొమ్మిదో గ్రంథాన్ని దాచి పెట్టిన ప్రాంతాన్ని అతనెలా కనిపెట్టాడు? అక్కడికి ఎలా చేరుకున్నాడు? ఆ గ్రంథం కోసం మహావీర్ లామాకు వేదకు మధ్య ఎలాంటి పోరు సాగిందన్నది ద్వితీయార్ధానికి కీలకం. వీటిలో వేద మిరాయ్ శక్తిని అర్థం చేసుకుని.. దాన్ని తన అస్త్రంగా చేసుకుని యోధగా మారడం.. ఈ క్రమంలో దాని సాయంతో మహావీర్ లామా గ్యాంగ్‌ను చితక్కొటడం థియేటర్లో ప్రేక్షకులకు మంచి కిక్ ఇస్తుంది. మహావీర్ లామాగా మనోజ్ విలనిజం.. తన లుక్, స్క్రీన్ ప్రజెన్స్ చక్కగా కుదిరాయి. అయితే ఆ పాత్ర గతాన్ని ఇంకాస్త శక్తిమంతంగా తీర్చిదిద్దాల్సింది. హీరో తల్లిగా అంబిక పాత్రలో శ్రియ ఆకట్టుకుంటుంది. కథలో ఎంతో ప్రాధాన్యమున్న పాత్ర ఆమెది. జగపతిబాబు, జయరామ్ పాత్రల పరిధి చిన్నదే అయినా కథలో ప్రాముఖ్యత ఉంది. రితికా హీరోకి దారి చూపే పాత్రగా కనిపించింది.

# రాజాసాబ్ షూటింగ్ పార్ట్ పూర్తి
## నటి మాళవికా మోహనన్ వెల్లడి

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ప్రస్తుతం ఫుల్ ఫామ్‌లో ఉన్నాడు. వరుసగా భారీ సినిమాలతో బిజీగా మారిపోయిన ఆయన, ఇప్పుడు ఓ వినూత్న కాన్సెప్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రానున్నాడు. మారుతీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'రాజా సాబ్' సినిమా సంక్రాంతికి థియేటర్లలో సందడి చేయడానికి రెడీ అవుతోంది. ఇప్పటి వరకు యాక్షన్, రొమాన్స్, ఫాంటసీ సినిమాల్లో అలరించిన ప్రభాస్, తన కెరీర్‌లో మొదటి సారి హారర్ అండ్ కామెడీ నేపథ్యంలో రూపొందిన సినిమాలో నటిస్తున్నాడు. ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రంలో మలయాళ బ్యూటీ- మాళవిక మోహనన్ హీరోయిన్‌గా నటిస్తోంది. ప్రభాస్‌తో కలిసి పనిచేయడం తనకు ప్రత్యేక అనుభవంగా మారిందని ఆమె తాజాగా వెల్లడించింది. ప్రభాస్ చాలా శాంతంగా ఉంటారు. ఆయన వయసు నాకంటే ఎక్కువే అయినా, ఆయనను చూస్తే అలానే అనిపించదు. సహజంగా ఉంటారు. 'రాజా సాబ్'లో మా జంట చాలా బాగా వర్కౌట్ అయిందని ఆమె అన్నారు. ఈ కామెంట్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. అయితే మూవీకి సంబంధించిన పనిలో పనిగా అప్‌డేట్ కూడా వచ్చింది. సినిమా కూడా పూర్తయ్యింది. కొన్ని పాటలను చిత్రీకరించాల్సి ఉందని పేర్కొంది ఈ బ్యూటీ-. ప్రస్తుతం మాళవిక చేసిన ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మాళవికతో పాటు- ప్రభాస్ సరసన మరియు రిద్ధి కుమార్ నిధి అగర్వాల్ కూడా కథానాయికలుగా నటి స్తున్నారు. ముగ్గురు హీరోయిన్లతో వస్తున్న ఈ ఫామిలీ ఎంట్టంల్గ÷నర్‌లో ప్రతి పాత్రకూ ప్రత్యేకత ఉందని యూనిట్ చెబుతోంది. ఈ సినిమాకి థమన్ సంగీతం అందిస్తున్నాడు. అక్టోబర్ 23 ప్రభాస్ బర్త్‌డే సందర్భంగా 'రాజా సాబ్' నుంచి ఫస్ట్ సాంగ్ రాబోతున్నట్లు- బలమైన సమాచారం. అయితే ఈ విషయంపై ఇంకా అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.






# దెయ్యం బ్యాక్ డ్రాప్‌లో మరో మూవీ
## బెల్లంకొండ, అనుపమల కిష్కింధపురి

రాఘవ్ (బెల్లంకొండ సాయిశ్రీనివాస్), మైథిలి (అనుపమ) ప్రేమికులు. ఆ ఇద్దరూ మరొక స్నేహితుడు (సుదర్శన్)తో కలిసి ఘోస్ట్ వాకింగ్ పేరుతో హాంటెడ్ హౌసెస్ టూర్స్‌ని నిర్వహిస్తుంటారు. థ్రిల్ కోరుకునే వాళ్లందరినీ కలిపి ఓ పాడుబడిన బంగ్లాల్లోకి తీసుకెళ్లి అక్కడ దెయ్యాలు ఉన్నాయని నమ్మిస్తూ థ్రిల్ పంచడమే ఆ టూర్ ఉద్దేశం. అలా ఓసారి 11 మందితో కలిసి కిష్కింధపురి అనే ఊరి పరిసరాల్లో ఉన్న సువర్ణమాయ అనే రేడియో స్టేషన్‌కి వెళతారు. 1989లోనే పాడుబడిన స్టేషన్ అది. అందులోకి అడుగు పెట్టాక రేడియో నుంచి ఓ వాయిస్ వినిపిస్తుంది. అది దెయ్యంలా మారిన వేదవతి వాయిస్ అని ఆ తర్వాత తెలుస్తుంది. సువర్ణమాయలోకి అడుగు పెట్టిన 11 మందిలో ఎవ్వరినీ వదిలిపెట్టనని వార్నింగ్ ఇస్తుంది వేదవతి. చెప్పినట్టుగానే వెంటనే ఆ బృందంలో ముగ్గురు చనిపోతారు. ఆ తర్వాత అందులోని ఓ చిన్నారి టార్గెట్ అవుతుంది. అది పసిగట్టిన రాఘవ్ తన ప్రాణాల్ని అడ్డుపెట్టి దెయ్యానికి ఎదురెళతాడు. అసలు ఆ వేదవతి ఎవరు? ఎందుకు దెయ్యంలా మారింది? సువర్ణమాయ స్టేషన్‌తో ఆమెకున్న సంబంధం ఏమిటి? అందులోకి వెళ్లినవాళ్లని ఎందుకు చంపేస్తోంది?అన్నది చిత్ర కథ. హారర్‌తో పాటు-, థ్రిల్లింగ్ అంశాల మేళవింపుతో రాసుకున్న కథ ఇది. ప్రథమార్ధంలో దెయ్యాన్ని చూపిస్తూ భయపెట్టేందుకు.. ద్వితీయార్ధంలో ఆ దెయ్యం వెనకున్న కథని చెబుతూ థ్రిల్‌ని పంచేందుకు ప్రయత్నిస్తుందీ సినిమా. భయపెట్టడం వరకూ ఫర్వాలేదనిపిస్తుంది కానీ, ద్వితీయార్ధంలో థ్రిల్లింగ్ అనుభూతి కాస్త తగ్గింది. అయితే, థియేటర్‌లో ఉన్నంతసేపూ ఆ కథలో చోటు- చేసుకునే మలుపులు ఆసక్తిని రేకెత్తిస్తాయి. సినిమాలో చాలా చోట్ల లాజిక్‌ని పక్కనపెట్టి భయపెట్టే ప్రయత్నం కనిపిస్తుంది.సువర్ణమాయ రేడియో స్టేషన్‌లోకి అడుగుపెట్టాకే అసలు కథ మొదలవుతుంది. అక్కడ వేదవతి వాయిస్ వినిపించడంతో కథలో హారర్ కోణం వెలుగులోకి వస్తుంది. రైల్‌లో ఉన్న ఇద్దరు పైలట్లని చంపడం, ఆ తర్వాత నిర్మాణంలో ఉన్న బిల్డింగ్‌పై నుంచి ఒకరిని కిందకి పడేసి చంపే సన్నివేశాలు కథలోని అసలు సిసలు హారర్ నేపథ్యాన్ని పరిచయం చేస్తుంది. కథానాయకుడు ఒక పక్క మిగిలినవాళ్ల ప్రాణాల్ని కాపాడుతూనే, మరోపక్క సువర్ణమాయ కథ తెలుసుకునేందుకు ప్రయత్నించే క్రమంతో సెకండాఫ్ మొదలవుతుంది. ఫ్లాష్‌బ్యాక్‌గా వచ్చే సువర్ణమాయ స్టేషన్, వేదవతి, విశ్రవ పుత్ర కథలు సినిమాకి కీలకం. ఆ కథంతా సినిమా చూస్తున్నంతసేపూ ఆసక్తికరంగానే అనిపించినా, విశ్రవపుత్ర కథ మాత్రం రాక్షసుడు సినిమాలోని ఓ ఎపిసోడ్‌ని గుర్తు చేస్తుంది. బెల్లంకొండ శ్రీనివాస్ కొత్త జోనర్‌ని ప్రయత్నిస్తూనే... తన మార్క్ యాక్షన్ అంశాల్ని మిస్ కాకుండా చూసుకున్నారు. యాక్షన్ అవతారంతో మెప్పిస్తూనే... హారర్ ప్రధానంగా సాగే సన్నివేశాల్లో మంచి నటనని ప్రదర్శించారు. అనుపమ (ఆషూశపశ శసశపః÷ఔశసశ) అందంగా కనిపిస్తూనే, ద్వితీయార్ధంలో భయపెడుతుంది. ఆమె దెయ్యంగా మారే ఎపిసోడ్ ఆకట్టు-కుంటుంది. విశ్రవపుత్ర పాత్రలో నృత్య దర్శకుడు శాండీ మాస్టర్ చాలా బాగా నటించారు. ఆయన ప్రథమార్ధంలో కనిపించిన విధానమే భయపెడుతుంది. సీనియర్ కథానాయిక ప్రేమ నటన ఆకట్టుకుంటుంది. డీ గ్లామర్‌గా కనిపిస్తూ ఆమె తల్లి పాత్రకి ప్రాణం పోశారు. పతాక సన్నివేశాల్లోనూ ఆమె పాత్ర ఓ మంచి మలుపునిస్తుంది. సాంకేతికంగా సినిమా ఉన్నతంగా ఉంది.




# సోషల్ మీడియాకు దూరంగా అనుష్క

చాలా రోజుల విరామం తర్వాత ఇటీవల 'ఘాటి'తో పలకరించారు అనుష్క. కొన్నేళ్లుగా మీడియాకు దూరంగా ఉంటోన్న ఆమె తాజాగా సోషల్ మీడియాకు కూడా దూరంగా ఉండనున్నట్లు- ప్రకటించారు. సోషల్ మీడియాకు కొంతకాలం బ్రేక్ ఇస్తున్నట్లు- తెలుపుతూ పోస్ట్ పెట్టారు. తానే స్వయంగా లెటర్ రాసి దాన్ని పోస్ట్ చేశారు. సోషల్ మీడియాకు దూరంగా ఉండాలనుకుంటున్నా. ఎప్పుడూ స్క్రోలింగ్ చేసే లైఫ్‌కు దూరంగా.. నిజమైన ప్రపంచానికి దగ్గరగా ఉండాలని నిర్ణయించుకున్నా. త్వరలోనే మరిన్ని మంచి కథలతో మరింత ప్రేమతో మీ ముందుకువస్తాను' అని తాను రాసిన లెటర్‌ను పోస్ట్ చేశారు. ఈ లెటర్ వైరల్ కావడంతో అనుష్క (ఆషరీశ) ఈ నిర్ణయం ఎందుకు తీసుకున్నారా అని అభిమానులు చర్చించు కుంటున్నారు. ఇటీవల వచ్చిన 'ఘాటి' ప్రచారంలోనూ స్వీటి పరోక్షంగా పాల్గొన్నారు. రానా, అల్లు అర్జున్‌లతో ఫోన్‌లో మాట్లాడి సినిమా విశేషాలతో పాటు- కొన్ని ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. తాను కొన్ని రోజులుగా ఎక్కడికీ వెళ్లడం లేదని చెప్పారు. ఇంట్లో జరిగే పెళ్లిళ్లకు కూడా హాజరుకావడం లేదన్నారు. త్వరలోనే అందరి ముందుకువస్తానని చెప్పారు. వచ్చే ఏడాది నుంచి వరుస సినిమాలు చేస్తానని అభిమానులకు హామీ ఇచ్చారు. ఇక క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో అనుష్క ప్రధాన పాత్రలో యాక్షన్ -క్రై-మ్ డ్రామాగా 'ఘాటి' రూపొందింది.

EDITED, PRINTED AND PUBLISHED BY FAISAL KHAN PRINTED AT UJALA PRESS, LIG, 211 APHB COLONY ADILABAD, TELANGANA.
PUBLISHED FROM H.NO.4-4-120/C/3, SANJAY NAGAR COLONY, ADILABAD, TELANGANA STATE. EDITOR : FAISAL KHAN, RNI : APTEL/2013/53323, CELL : 94400 62685